www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కుంభమేళాకు పోటెత్తిన భక్తులు

మాఘ పౌర్ణమి మధ్యాహ్నానికే 1.6 కోట్ల మంది స్నానాలు

హెలికాప్టర్ నుంచి పూలవర్షం

2 భక్తుల భద్రత కోసం ఆపరేషన్ చతుర్భుజ్ ప్రారంభం



ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఘాట్ వద్ద లక్షలాదిగా భక్తులు

గురువారం | 13-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 316

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా. 8.22 తదుపరి విదియ; నక్షత్రం: మఖ రా. 9.07 తదుపరి పుబ్బ; వర్జ్యం: ఉ.8.21-10.03, తె.5.47; దుర్ముహూర్తం: ఉ.10.35-11.20, మ.3.09-3.55; అమృతఘడియలు: రా.6.33-8.15; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.46; సూర్యాస్తమయం: 6.12

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సంత్ శ్రీ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న మంత్రి సీతక్క, గిరిజన సంఘాల నేతలు. చిత్రంలో భట్టి, ఉత్తమ్, పొన్నం, మహేశ్

జూన్‌లో స్థానికం!

బీసీ కోటా పెంపు యత్నాలతో జాప్యం.. ఏప్రిల్ 4 దాకా టెన్త్ పరీక్షలు

మే నెలలో తీవ్రం కానున్న ఎండలు.. ఆ తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు!

వివరాలివ్వని వారికి మళ్లీ కులగణన

మిగిలిపోయిన 3.1% కుటుంబాల కోసం

ఆన్‌లైన్, ఎంపీడీవో వద్ద, టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా ఈ నెల 16 నుంచి 28 వరకు సర్వే

మార్చిలో అసెంబ్లీ సమావేశం.. బీసీ బిల్లు

సీఎం సమీక్షలో ఈ మేరకు నిర్ణయం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం

బిల్లును ఆమోదించి.. కేంద్రానికి పంపిస్తాం

బృందంగా వెళ్లి ప్రధానిని కలుస్తాం: భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగేలా లేవు. బీసీ కులగణన సర్వే ప్రక్రియ ఈ నెల 28 వరకు కొనసాగించాలని, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును రూపొందించి అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ఆమోదించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో స్థానిక ఎన్నికలు జూన్, జూలై నెలల్లోనే జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మార్చి మొదటి వారంలో ప్రత్యేక అసెంబ్లీ మార్చి, ఏప్రిల్ నెలల్లో టెన్త్, ఇంటర్ పరీక్షలు, మేలో ఎండలు మండనున్న నేపథ్యంలో జూన్ వరకూ ఎన్నికలు జరిగే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కులగణనలో పాల్గొనని బీసీ కుటుంబాల సర్వే పూర్తయిన తర్వాత.. తాజా గణాంకాల ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపైన డెడికేటెడ్ కమిషన్.. ప్రభుత్వానికి మళ్లీ నివేదిక ఇవ్వనుంది. ప్రభుత్వం వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని

మిగతా 13వ పేజీలో...

ఏకగ్రీవాలకు చెల్లుచీటీ!?

స్థానిక ఎన్నికల్లో బరిలో ఒక్కరున్నా నోటాతో పోటీ పడాల్సిందే 12

నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ఏంచేద్దాం?

పార్టీల అభిప్రాయాలు కోరిన ఈసీ

మళ్లీ ఎన్నిక వద్దన్న కాంగ్రెస్, సీపీఎం

రీ ఎలక్షన్ జరపాల్సిందే: బీఆర్ఎస్, సీపీఐ

సుప్రీం తీర్పు వచ్చాక స్పందిస్తామన్న బీజేపీ

కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపై రేపు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహణ.. హాజరు కానున్న సీఎం రేవంత్ 13

ఉచిత పథకాలతో పరాన్నజీవులను

సృష్టిస్తున్నామా?



ఉచితాల వల్ల ప్రజలు పనిచేయడానికి ఇష్టపడట్లేదు

ఏ పనీ చేయకుండానే రేషన్, డబ్బు పొందుతున్నారు

నిరాశ్రయులను సమాజ ప్రధాన స్రవంతిలోకి చేర్చి దేశాభివృద్ధికి వారూ తోడ్పడేలా చేయాలి: సుప్రీం

పని ఉన్నప్పుడు చేయకూడదని ఎవరనుకుంటారు? చాలా మంది గ్రామాల నుంచి పట్టణాలకు వస్తున్నది సరైన పని దొరక్కపోవడం వల్లనే కదా?

- న్యాయవాది ప్రశాంత్ భూషణ్

నేను వ్యవసాయ కుటుంబం నుంచే వచ్చాను. మహారాష్ట్రలో ఎన్నికలకు ముందు ఉచితాలను ప్రకటించడం వల్ల వ్యవసాయదారులకు కూలీలు దొరకడం లేదు. ప్రతి ఒక్కరికీ ఇంటి వద్ద ఉచితంగా రేషన్ లభిస్తుంటే వారు పనికి ఎందుకు వస్తారు?

- జస్టిస్ బీఆర్ గవాయ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా పలు రాజకీయ పార్టీలు పోటీలు పడి ప్రకటిస్తున్న 'ఉచిత' పథకాలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఎన్నికలకు ముందు అలా ఉచితాలను పంపిణీ చేసే పద్ధతి సరైంది కాదని.. ఉచితాల మూలంగా ప్రజలు పనిచేయడం మానేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఉచితాలు ఇవ్వడం ద్వారా మనం పరాన్నజీవుల వర్గాన్ని సృష్టిస్తున్నామా? అని వ్యాఖ్యానించింది. ఢిల్లీలో ఇళ్లులేని వారికి ఆశ్రయం కల్పించాలంటూ సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ సందర్భంగా.. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాసిహ్ తో కూడిన ధర్మాసనం పలు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఎన్నికలకు ముందు మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో లాడ్లీ బెహన్ వంటి పథకాలను ప్రవేశపెట్టడంతో ప్రజలు ఉచితాలపైనే ఆధారపడుతున్నారని, పనిచేయడానికి ఇష్టపడడం లేదని.. పనిచేయకుండా ఉచిత రేషన్ పొందుతున్నారని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు.



ఈ సందర్భంగా.. "పని ఉన్నప్పుడు చేయకూడదని ఎవరనుకుంటారు? చాలా మంది గ్రామాల నుంచి పట్టణాలకు వస్తున్నది సరైన పని దొరక్కపోవడం వల్లనే కదా?" అని ప్రశాంత్ భూషణ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. "మీకు ఒక కోణం మాత్రమే తెలిసినట్లున్నది. నేను వ్యవసాయ కుటుంబం నుంచే వచ్చాను. మహారాష్ట్రలో ఎన్నికలకు ముందు ఉచితాలను ప్రకటించడం వల్ల వ్యవసాయదారులకు కూలీలు దొరకడం లేదు. ప్రతి ఒక్కరికీ ఇంటి వద్ద ఉచితంగా రేషన్ లభిస్తుంటే వారు పనికి ఎందుకు వస్తారు?" అని ప్రశ్నించారు. ఏదేమైనా ఈ అంశంపై

మిగతా 2వ పేజీలో...

బంధం బలోపేతం



మార్సెయిలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ

పారిస్, ఫిబ్రవరి 13: ఇరు దేశాల మధ్య వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను పెంపొందించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ పిలుపునిచ్చారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సంబంధాలను, వివిధ అంతర్జాతీయ వేదికల్లో తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న మోదీ.. మంగళవారం సాయంత్రం ఫ్రాన్స్ అధ్యక్ష విమానంలో పారిస్ నుంచి మార్సెయిలీకి వెళ్లారు. అక్కడ మేక్రాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలు, కీలక అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. విస్తృత చర్చల అనంతరం వారిద్దరూ మాట్లాడుతూ.. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రపంచ కృత్రిమ మేధ.. సామాజిక, ఆర్థిక, పర్యావరణానికి ఉపయోగపడే ఫలితాలను అందించగలిగేలా నిర్దిష్ట చర్యలు తీసుకునేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఇరుదేశాల మధ్య

మిగతా 2వ పేజీలో...

వాణిజ్య, పెట్టుబడి సంబంధాలు పెంచుకోవాలి

అంతర్జాతీయ వేదికపై మన భాగస్వామ్యం పెరగాలి

ద్వైపాక్షిక చర్చల్లో మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపై సుదీర్ఘ చర్చలు

ఫ్రాన్స్‌లో కొత్త కాన్సులేట్‌ను ప్రారంభించిన మోదీ

భారతీయ అమర జవాన్ల స్మారకం వద్ద ఘన నివాళి



ట్రంప్ ఎన్నిక అనంతరం తొలిసారి వైట్‌హౌస్‌లోకి ఎలాన్ మస్క్ తన నాలుగేళ్ల తనయుడితో కలిసి వెళ్లారు. ప్రభుత్వోద్యోగుల కోత వంటి సీరియస్ అంశాలపై జరిగిన భేటీలో.. కొడుకును భుజాలకెత్తుకొని ప్రసంగించారు. వారిద్దరినీ ట్రంప్ ఆసక్తిగా తిలకించారు

పుతిన్‌కు ట్రంప్ ఫోన్

ఉక్రెయిన్-రష్యా అంశంపై గంటన్నర మాట్లాడుకున్న ఇరు దేశాధినేతలు

యుద్ధం ఆపడానికి వీలుగా అమెరికాతో చర్చలు.. పుతిన్ అంగీకారం

వాషింగ్టన్, ఫిబ్రవరి 12: ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించే దిశగా రష్యాను ఒప్పించేలా అమెరికా చర్యలు ప్రారంభించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేశారు. ఇద్దరు నేతలు గంటన్నరపాటు మాట్లాడుకున్నారు. ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ అంశమ్మీద అమెరికాతో తక్షణం చర్చించేందుకు పుతిన్ అంగీకరించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయమ్మీద తాను పుతిన్‌తో చర్చించినట్లు సామాజిక మాధ్యమాల ద్వారా ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు తమ ప్రత్యేక బృందం రష్యాతో వెంటనే సంప్రదింపులు చేయనుందని, ఈ విషయమ్మీద త్వరలోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోనూ మాట్లాడతానని ట్రంప్ చెప్పారు.

విదేశీ ఇంజన్లు రాకనే ఆలస్యం

హెచ్ఏఎల్‌కు సామర్థ్యం లేక కాదు.. అర్థం చేసుకోవాలి

తేజస్ ఎంకే1ఏ విమానాల తయారీలో జాప్యంపై తేజస్ ఏంకే2 ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.మధుసూదనరావు

'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ



బెంగళూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి-ఏబీఎన్): తేజస్ ఎంకే1ఏ విమానాలకు సంబంధించి కీలక పరిజ్ఞానాల విషయంలో మనం విదేశాల మీద ఆధారపడి ఉన్నామని.. ఇంజన్లు రాకపోవడం వల్లనే వాటి తయారీ ఆలస్యమవుతోంది తప్ప హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు సామర్థ్యం లేకపోవడంవల్ల కాదని తేజస్ ఎంకే2 ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ వి.మధుసూదనరావు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అర్థం చేసుకుని ఓపిక పట్టాలని ఆయన పేర్కొన్నారు. తేజస్ ఎంకే1ఏల తయారీలో నెలకొన్న జాప్యం నేపథ్యంలో.. హెచ్ఏఎల్ మీద తనకు నమ్మకం లేదంటూ ఎయిర్‌చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ మధుసూదనరావు ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో తేజస్ ఎంకే 1 ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బరంపురం (ఒడిసా)లోని తెలుగు కుటుంబానికి చెందిన కోట హరినారాయణ

మిగతా 12వ పేజీలో...



2

రాజ్యసభకు కమల్‌హాసన్!

గత ఎన్నికల్లో డీఎంకేకు కమల్ మద్దతు.. అప్పుడే స్టాలిన్ హామీ

జూలై 24న తమిళనాడులో ఖాళీ కానున్న 6 రాజ్యసభ సీట్లు

డీఎంకేకు నాలుగు ఖాయం

కమల్‌తో రాష్ట్ర మంత్రి చర్చలు



ఆరాంఘర్ చౌరస్తాలో ఓ ప్రైవేటు బస్సును ఆపి పత్రాలను పరిశీలిస్తున్న కొండాపూర్ ఆర్టీఏ అధికారిణి

అగమ్య ప్రయాణం!

ఆర్టీఏ తనిఖీలతో హైదరాబాద్ శివార్లలోనే ఆగుతున్న ప్రైవేటు బస్సులు

వేళ కాని వేళ నడిరోడ్డుపై దింపేస్తుండటంతో ప్రయాణికులకు ఇక్కట్లు

నాలుగు రోజుల్లో 13 బస్సులను సీజ్ చేసిన ఆర్టీఏ అధికారులు

వనస్థలిపురం వద్ద తనిఖీలు జరుగుతుండడంతో తెల్లవారు జామున హయత్‌నగర్ వద్దనే ఓ బస్సు ప్రయాణికులను దించింది. ఇదేంటని అడిగితే.. ముందుకెళితే బస్సు సీజ్ చేస్తారు. కావాలంటే టికెట్ బుక్ చేసుకున్న దగ్గర మాట్లాడుకోవాలని సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు.

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో 3-4 రోజులుగా జరుగుతున్న తతంగమిది. రవాణా శాఖ అధికారుల తనిఖీలతో బెంబేలెత్తుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లు.. ప్రయాణికులను మార్గమధ్యంలోనే వదిలేస్తున్నారు. దీంతో గమ్యం చేరేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రవాణా శాఖ

మిగతా 14వ పేజీలో...

ఆర్బీఐ కొత్త గవర్నర్ సంతకంతో

రూ.50 నోట్లు!

త్వరలోనే మార్కెట్‌లోకి కొత్త నోట్లు

పాత నోట్లు యథావిధిగా చెల్లుబాటు అవుతాయి: ఆర్బీఐ

'కోటక్ మహీంద్రా'పై ఆంక్షల ఎత్తివేత

కొత్త క్రెడిట్ కార్డులు ఇచ్చేందుకూ ఆర్బీఐ అనుమతి



ముంబై, ఫిబ్రవరి 12: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కొత్త గవర్నర్ సంతకంతో కూడిన రూ.50 నోట్లు త్వరలోనే మార్కెట్‌లోకి రానున్నాయి. ఆర్బీఐ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ మల్హోత్రా సంతకం చేసిన రూ.50 నోట్లను విడుదల చేయనున్నట్లు ఆర్బీఐ బుధవారం వెల్లడించింది. ఇప్పటికే మార్కెట్లో ఉన్న రూ.50 నోట్లు యథావిధిగా చెల్లుబాటు

మిగతా 2వ పేజీలో...



సెక్రటేరియట్ భవనం రెయిలింగ్‌లో కొంత భాగం ఊడిన దృశ్యం (వృత్తంలో)

సచివాలయంలో ఊడిపడ్డ పెచ్చులు!

ఐదో అంతస్తు నుంచి పడ్డ జీఆర్‌సీ ఫ్రేమ్ ముక్కలు

దెబ్బతిన్న రామగుండం మార్కెట్ చైర్మన్ కారు

అక్కడ ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం

పిల్లర్ల ఫ్రేమ్స్‌లోనూ చాలా చోట్ల పగుళ్లు

ఇప్పటికీ మరమ్మతులు చేయని వైనం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. సచివాలయం దక్షిణ భాగం వైపు (పోర్టికో) ఐదో అంతస్తుపై మోడల్ కోసం అమర్చిన రెయిలింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. అవి అక్కడే నిలిపి ఉంచిన రామగుండం వ్యవసాయ

మిగతా 14వ పేజీలో...

మార్జాలం.. మాంసం ముక్క.. మందిరం!

ముక్కను నోటకరచుకొచ్చి ఆలయంలో వదిలేసిన పిల్లి

ఇది తెలియక.. ఇతర వర్గాలవారి పనేనని భక్తుల గుస్సా

టప్పాచబుత్ర హనుమాన్ ఆలయంలో ఘటన

సీసీ ఫుటేజీ పరిశీలించిన పోలీసు ఉన్నతాధికారులు

12 పిల్లి పనేనని తేలడంతో సద్దుమణిగిన అంశం



సీసీ ఫుటేజీలో పిల్లి



ప్రయాగ్‌రాజ్ వెళ్లే రైల్లో కిక్కిరిసిన భక్తులు



కుంభమేళాకు పోటెత్తిన భక్తులు

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 12: మాఘ పౌర్ణమి సందర్భంగా మహా కుంభమేళాకు జనం భారీగా తరలివచ్చారు. ప్రయాగ్‌రాజ్‌లోని సంగం ఘాట్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకే దాదాపు 1.60 కోట్ల మంది పుణ్యస్నానాలు చేశారని యూపీ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. త్రివేణీ సంగమం, ఇతర ఘాట్‌లలో 1.59 కోట్ల మంది స్నానాలు చేసినట్టు పేర్కొంది. కాగా, నెలరోజులుగా కొనసాగిన కల్పవాస్ కార్యక్రమం మాఘ పౌర్ణమి స్నానంతో ముగిసింది. సుమారు 10 లక్షల మంది కల్పవాసీలు మహాకుంభమేళా ప్రాంతం నుంచి తరలిపోవడం ప్రారంభమైంది. హెలికాప్టర్ నుంచి భక్తులపై పూల వర్షం కురిపించారు. మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే, భార్య చైత్న రాంతీర్థతో కలిసి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం చేశారు. మాఘ పౌర్ణమి రద్దీని దృష్టిలో ఉంచుకొని వీఐపీ ప్రొటోకాల్స్‌ను రద్దు చేశారు. భక్తుల భద్రత కోసం 'ఆపరేషన్ చతుర్భుజ్' చేపట్టామని యూపీ ప్రభుత్వం తెలిపింది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం(ఐసీసీసీ) నుంచి 2,750 హైటెక్ కెమేరాలు, యాంటీ డ్రోన్ వ్యవస్థ ద్వారా 24 గంటలూ పర్యవేక్షిస్తున్నట్టు పేర్కొంది. పొరుగు జిల్లాల నుంచి ఎన్ని వాహనాలు వస్తున్నాయో ఎప్పటికప్పుడు టోల్ ప్లాజాల నుంచి సమాచారం సేకరించి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రయాగ్‌రాజ్ ఏడీజీ భాను భాస్కర్ తెలిపారు. భక్తులకు ప్రతి 10 నిమిషాలకు అందుబాటులో ఉండేలా రవాణాశాఖ అదనంగా 1200 షటిల్ బస్సులు ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26న నిర్వహించే 'అమృత స్నానం'తో మహాకుంభమేళా ముగియనుంది.

పరాన్న జీవులను సృష్టిస్తున్నామా?

(మొదటిపేజీ తరువాయి)

తాము చర్చలోకి వెళ్లాలని భావించట్లేదని పేర్కొన్నారు. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సహా అందరూ అంటారని పేర్కొన్న ధర్మాసనం.. అదే సమయంలో (ఉచితాలకు, పని కల్పించడానికి మధ్య) సమతౌల్యం పాటించాల్సిన అవసరం లేదా అని అభిప్రాయపడింది. ఢిల్లీలో ప్రస్తుత షెల్టర్లలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని ప్రశాంత్ భూషణ్ చేసిన వ్యాఖ్యలకు.. "రోడ్డుపై పడుకోవడం, నివాసయోగ్యం కాని షెల్టర్ హోమ్‌లో ఉండడం.. ఈ రెండింటిలో ఏది మెరుగు?" అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు.



"నిరాశ్రయులను ప్రధాన స్రవంతి సమాజంలో భాగం కానిచ్చి, దేశాభివృద్ధికి తోడ్పడేలా చేయడానికి బదులు ఇన్నిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు! ఇలా చేయడం ద్వారా మనం ఒక పరాన్నజీవుల వర్గాన్ని సృష్టించట్లేదూ? దురదృష్టవశాత్తూ.. ఎన్నికలకు ముందు ప్రకటించే ఉచిత పథకాల వల్ల ప్రజలు పనిచేయడానికి ఇష్టపడట్లేదు"

\- సుప్రీం కోర్టు

సమాచారాన్ని సేకరిస్తున్నాం..

పట్టణాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించేందుకు కేంద్రం 'పట్టణ పేదరిక నిర్మూలన' పథకాన్ని ఖరారు చేస్తోందని అటార్నీ జనరల్ ధర్మాసనానికి వెల్లడించారు. అది ఎప్పటిలోగా పూర్తవుతుందని న్యాయమూర్తులు ప్రశ్నించగా.. రాష్ట్రాల నుంచి సమాచారం సేకరిస్తున్నామని, దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తామని ఆయన చెప్పారు. కాగా.. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయుల సంఖ్య పెరగడానికి మూలకారణాలపై ఎవరూ దృష్టిసారించకపోవడం దురదృష్టకరమని విచారణ సందర్భంగా ఒక పిటిషనర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ధనికులను మాత్రమే పట్టించుకుంటోందని, పేదలను విస్మరిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. దీనికి జస్టిస్ గవాయ్... కోర్టులో రాజకీయ ఉపన్యాసాలు చేయొద్దని, అనవసర ఆరోపణలు చేయొద్దని సూచించారు. "ప్రభుత్వం ధనికులను మాత్రమే పట్టించుకుంటోందని మీరెలా చెప్పగలరు?" అని సదరు పిటిషనర్‌ను నిలదీశారు.

ఆ లెక్కలు సరైనవేనా?

అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం 2024 డిసెంబరు 4 నాటికి దేశవ్యాప్తంగా కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాలు మంజూరు చేసిన 2557 షెల్టర్లకుగాను.. 1995 షెల్టర్లు పనిచేస్తున్నాయని, వాటిలో 1.16 లక్షల పడకలున్నాయని ధర్మాసనానికి అటార్నీ జనరల్ వివరించారు. దీనికి ప్రశాంత్ భూషణ్.. ఒక్క ఢిల్లీలోనే 3 లక్షల మందికిపైగా నిరాశ్రయులు ఉన్నట్టు ఒక సర్వేలో వెల్లడైందని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కానీ, ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు గణాంకాల ప్రకారమే ఢిల్లీలోని షెల్టర్ల సామర్థ్యం 17 వేలు (అంతమంది తలదాచుకునేటన్ని షెల్టర్లు) అని.. వాటిలోనూ కేవలం 5,900 పడకలు మాత్రమే ఉన్నాయని.. సమస్య ఎంత పెద్దదో ఈ అంకెలే చెబుతున్నాయని ఆయన వివరించారు. కాగా.. పిటిషనర్లలో ఒకరైన ఈఆర్ కుమార్.. రాష్ట్రాలవారీగా నిరాశ్రయుల సంఖ్య, షెల్టర్లు, వాటి సామర్థ్యానికి సంబంధించిన వివరాలను కోర్టుకు సమర్పించారు. దీనికి ధర్మాసనం.. ఆ అంకెలు సరైనవో కావో సంబంధి మంత్రిత్వ శాఖను అడిగి చెప్పాల్సిందిగా అటార్నీ జనరల్‌ను ఆదేశించింది.


కూలీలు దొరకడం లేదు

ప్రభుత్వ పథకాలు అందుతుండటంతో ఉన్నచోటు వదిలి రావడానికి ఇష్టపడటం లేదు

ఎల్అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణియన్ వ్యాఖ్యలు


న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: వారానికి 90 గంటలు పనిచేయాలంటూ ఇటీవల ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన ఎల్అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణియన్, తాజాగా మరోసారి చర్చలోకి వచ్చారు. ప్రభుత్వాలు అందిస్తున్న ఉచిత సంక్షేమ పథకాల కారణంగా భవన నిర్మాణ కార్మికులు తాము ఉన్న ప్రాంతం వదిలి పనుల కోసం వలసలు పోవడానికి ఇష్టపడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. దీనివల్ల కూలీలను సమకూర్చుకోవడం కష్టంగా మారిందన్నారు. మంగళవారం మైసూరులో జరిగిన సీఐఐ సదస్సులో సుబ్రహ్మణియన్ ఈ వ్యాఖ్యలు చేశారు. కూలీల వలసలకు ఉపాధి హామీ పథకం, జన్‌ధన్ వంటి పథకాలు అడ్డుగా ఉన్నాయని సుబ్రహ్మణియన్ అన్నారు. "కొత్త అవకాశాల దిశగా అడుగులు వేసేందుకు భవన నిర్మాణ కార్మికులు సిద్ధపడటం లేదు. బహూశా స్థానికంగా వారి ఆర్థిక పరిస్థితి బాగుండటం, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు దీనికి కారణం కావచ్చు" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్థిక మంద్యాన్ని దృష్టిలో ఉంచుకుని కూలి భత్యాలను సవరించాలన్న ఆయన.. ఇక్కడ కంటే మూడు నుంచి మూడున్నర రెట్లు ఎక్కువ భత్యం ఇచ్చి పశ్చిమాసియా దేశాలు మన కార్మిక శక్తిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు.

లోకం తీరు



సిక్కు అల్లర్ల కేసులో సజ్జన్ కుమార్ దోషిగా ఖరారు

» ఈ నెల 18న శిక్ష ఖరారు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: సిక్కు అల్లర్ల కేసులో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌ను ఢిల్లీ న్యాయస్థానం దోషిగా ఖరారు చేసింది. ఈ నెల 18న ఆయనకు శిక్షను ఖరారు చేస్తామని ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం 1984 నవంబర్ ఒకటిన ఢిల్లీలోని సరస్వతి విహార్ ప్రాంతంలో ఉన్న సిక్కుల నివాసాలపై అల్లరి మూకలు మారణాయుధాలతో విరుచుకుపడ్డాయి. ఈ కేసులో 2021 డిసెంబర్ 16న సజ్జన్‌కుమార్‌పై అభియోగాలు నమోదయ్యాయి. విచారణలో భాగంగా కోర్టు ఆయన్ను దోషిగా గుర్తించింది.

విద్యలో వివక్ష తగదు: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి12: విద్య విషయంలో ఏ విద్యార్థీ వివక్షకు గురికారాదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. రోహింగ్యా శరణార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్య, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందించే విషయంలో వివక్ష చూపరాదని కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలను ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. దీనిపై పది రోజుల తర్వాత వాదనలు వింటామని తెలిపింది. రోహింగ్యా కుటుంబాలు ఎక్కడెక్కడ జీవిస్తున్నాయో వివరాలు చెప్పాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ధర్మాసనం కోరింది. రోహింగ్యాల మానవ హక్కుల కోసం పోరాడుతున్న ఎన్జీవో తరఫున న్యాయవాది కొలిన్ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు. ఆధార్ కార్డులు లేవనే కారణంతో వారికి బడులు, ఆసుపత్రుల్లో అనుమతి లభించడం లేదన్నారు.

వైట్‌హౌస్‌లోకి తనయుడితో మస్క్



వాషింగ్టన్, ఫిబ్రవరి 12: ఎలాన్ మస్క్ నేతృత్వం వహిస్తున్న డోజ్ విభాగానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరిన్ని అధికారాలు కట్టబెట్టారు. డోజ్ విభాగం సూచిస్తే ఆ మేరకు సిబ్బందిలో కోత విధించాలని, డోజ్‌ను సంప్రదించిన తర్వాతే కొత్త నియామకాలు చేపట్టాలని అమెరికాలోని ఫెడరల్ ఏజెన్సీలను ఆదేశిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను జారీ చేశారు. అవసరమైన మేరకే సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ఆ సమయంలో ఎలాన్ మస్క్ ట్రంప్ పక్కనే ఉన్నారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక మస్క్ తొలిసారి మంగళవారం వైట్ హౌస్(అధ్యక్ష భవనం)కు వచ్చారు. వెంట తన నాలుగేళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. వైట్ హౌస్‌లో అధ్యక్షుడి పక్కన మస్క్ తన కొడుకును భుజాలపై ఎత్తుకున్న ఫొటో, సరాదాగా ఉన్న వీడియో వైరల్ అవుతున్నాయి. అదే సమయంలో, ప్రభుత్వ విభాగాల్లో మస్క్ పెత్తనం పెరిగిపోతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విమర్శలపై మస్క్ స్పందించారు. సంస్కరణల కోసమే ప్రజలు ట్రంప్‌ను ఎన్నుకున్నారని, ప్రజలు సంస్కరణలను చూడబోతున్నారని పేర్కొన్నారు. సంస్కరణలను అమలు చేయకపోతే అమెరికా దివాలా తీస్తుందన్నారు.

ట్రంప్ సుంకాలతో 'ఆటోమొబైల్'లో గందరగోళం

» ఉత్పత్తి వ్యయాలు పెరుగుతాయి: ఫోర్డ్ సీఈవో ఫర్లీ

వాషింగ్టన్, ఫిబ్రవరి 12: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదిత, విధిస్తున్న సుంకాల కారణంగా ఆటోమొబైల్ పరిశ్రమలో గందరగోళం ఏర్పడుతోందని ప్రముఖ ఆటోమొబైల్ ఉత్పత్తుల సంస్థ ఫోర్డ్ సీఈవో జిమ్ ఫర్లీ అన్నారు. ట్రంప్ సర్కారు సుంకాల బెదిరింపులు, ఎలక్ట్రిక్ వాహనాలపై ద్వేషం వల్ల ఉత్పత్తి వ్యయాలు కూడా చాలా పెరిగే అవకాశముందని చెప్పారు. మంగళవారం ఓ ఆర్థిక సమావేశంలో పాల్గొన్న ఫర్లీ మాట్లాడుతూ.. మెక్సికో, కెనడాలపై విధిస్తున్న 25 శాతం సుంకాలు అమెరికా కంపెనీలకే ముప్పుగా పరిణమిస్తున్నాయన్నారు. అలాగే యూరోపియన్, ఆసియా వాహన తయారీదారులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికే ట్రంప్ సర్కారు ఉక్కు, అల్యూమినియంపై 25% సుంకాలను విధించిందని..అయితే ఫోర్డ్ ఆ లోహాలను ఎక్కువగా అమెరికా కంపెనీల నుంచే కొనుగోలు చేస్తోందని వెల్లడించారు.

అదానీ సౌర విద్యుత్తు ప్రాజెక్టు కోసం.. సరిహద్దు భద్రతా నిబంధనల సవరణ!

» 'గార్డియన్' కథనంలో వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీకి చెందిన సౌర విద్యుత్తు ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం ఏకంగా సరిహద్దు భద్రతా నిబంధనలనే సవరించింది! అదానీ సంస్థ ప్రపంచంలోనే అతి పెద్ద సౌర విద్యుదుత్పత్తి ప్లాంటును గుజరాత్‌లోని ఖావ్డాలో నిర్మిస్తోంది. కచ్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం పాకిస్థాన్ సరిహద్దుకు కేవలం కిలోమీటరు దూరంలో ఉంది. 2020లో ఈ ప్రాజెక్టును ప్రధాని మోదీ ఆవిష్కరించారు. అయితే, ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం జాతీయ భద్రతా నిబంధనలను కూడా సవరించారని 'గార్డియన్' పత్రిక కథనంలో పేర్కొంది. గతంలో రక్షణ శాఖ నిబంధనల ప్రకారం పాకిస్థాన్ సరిహద్దు నుంచి 10 కిలోమీటర్ల వరకూ ఎలాంటి భారీ నిర్మాణాలు, రోడ్లు నిర్మించడానికి వీల్లేదు. కానీ, మోదీ సర్కారు ఈ నిబంధనలను సవరించిందని గార్డియన్ వివరించింది. ఖావ్డా ప్రాజెక్టు సరిహద్దుకు కేవలం కిలోమీటరు దూరంలోనే ఉందని తెలిపింది. గుజరాత్‌లో, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలే ఉండడంతో అత్యున్నత స్థాయిలో పైరవీలు చేశారని.. ఫలితంగా నిబంధనలను సవరించారని, రాన్ ఆఫ్ కచ్‌లో సౌర, పవన విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణానికి భూములు కేటాయించారని వివరించింది.

నిషేధిత చైనా యాప్‌లు మళ్లీ వచ్చేశాయి

ఢిల్లీ, ఫిబ్రవరి 12: సమాచార గోప్యత, దేశ భద్రతు దృష్టిలో ఉంచుకొని 267 చైనా యాప్‌లను మన దేశం 2020లో నిషేధించింది. గల్వాన్ వ్యాలీ ఘర్షణల నేపథ్యంలో భారతదేశం ఈ చర్యలకు పూనుకుంది. అయితే వాటిలో 36 యాప్‌లో తిరిగి దేశంలో అందుబాటులోకి వచ్చాయి. వీటిలో కొన్ని పేర్లు మార్చుకొని అడుగుపెట్టగా, మరికొన్ని తమ రూపాన్ని మార్చుకున్నాయి. యాజమాన్య హక్కుల మార్పుతో మరికొన్ని అందుబాటులోకి వచ్చాయి. చాలా వరకు గూగుల్, యాపిల్ ప్లే స్టోర్లలలో అందుబాటులో ఉండగా, కొన్ని మాత్రం కేవలం యాపిల్ స్టోర్‌లకు మాత్రమే పరిమితమయ్యాయి. ఇలా దేశంలోకి పునఃప్రవేశం చేసిన వాటిలో ఫైల్ షేరింగ్ యాప్ గ్జెండర్, స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం మ్యాంగో టీవీ, షాపింగ్ యాప్ టావోబావో, డేటింగ్ యాప్ టాన్‌టాన్, వినోదం, గేమింగ్ యాప్‌లు ఉన్నాయి.

పాక్‌లో నాకు మరణ శిక్ష పడేలా ఉంది: జుకర్‌బర్గ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌లో తనకు మరణ శిక్ష పడేలా ఉందని ఆయన పేర్కొన్నారు. జో రోగన్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన పాక్‌లో ఫేస్‌బుక్‌పై నమోదైన దావా గురించి మాట్లాడారు. ప్రవక్త మహమ్మద్‌ను అవమానించేలా ఫేస్‌బుక్‌లో ఎవరో పోస్ట్ పెట్టినందుకు తనకు మరణ శిక్ష విధించాలని పాకిస్తాన్‌లో దావా వేశారని చెప్పారు. ఇది ఎక్కడివరకు వెళ్తుందో తెలియదని, అయితే తాను పాకిస్థాన్ వెళ్లాలనుకోవడం లేదు కాబట్టి దాని గురించి ఆందోళన చెందట్లేదని అన్నారు. పలు ప్రాంతాల్లో ఉన్న చట్టాలు, సాంస్కృతిక విలువల కారణంగా యాప్‌లో చాలా కంటెంట్‌ను అణచివేయాల్సి వస్తోందని ఆయన తెలిపారు.

ఆర్బీఐ కొత్త గవర్నర్ సంతకంతో 50 నోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అవుతాయని స్పష్టం చేసింది. ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా సంతకంతో నోట్లు జారీ కావడం ఇదే తొలిసారి. గత ఏడాది డిసెంబరులో ఆయన ఆర్‌బీఐ పగ్గాలు చేపట్టారు. మహాత్మాగాంధీ సిరీస్‌లో కొత్త గవర్నర్ సంతకంతో రూ.50 నోట్లను విడుదల చేయనున్నట్లు ఆర్బీఐ తెలిపింది. ప్రస్తుతం చాలా వరకు పాత గవర్నర్ శక్తికాంత దాస్ సంతకం చేసిన నోట్లే చలామణీలో ఉన్నాయి. మరోవైపు, ప్రైవేట్ రంగానికి చెందిన కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు భారీ ఊరట లభించింది. 9 నెలల క్రితం (2024 ఏప్రిల్) ఈ బ్యాంక్‌పై విధించిన ఆంక్షలను ఎత్తివేస్తున్నట్టు ఆర్బీఐ బుధవారం ప్రకటించింది. గతంలో గుర్తించిన లోపాలపై బ్యాంక్ తగిన చర్యలు చేపట్టిన నేపథ్యంలో రిజర్వ్ బ్యాంకు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో కోటక్ బ్యాంక్ మళ్లీ ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ చానళ్ల ద్వారా కొత్త వినియోగదారులను చేర్చుకునేందుకు వీలు కలగనుంది. అలాగే, కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేసేందుకూ ఈ బ్యాంక్‌కు అనుమతిచ్చింది.

రాజ్యసభకు కమల్ హాసన్..!



చెన్నై, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీనటుడు, 'మక్కల్ నీదిమయ్యం' (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ రాజ్యసభకు వెళ్లడం ఖాయమైనట్లు తెలిసింది. డీఎంకే సీనియర్ నేత, తమిళనాడు మంత్రి పీకే శేఖర్‌బాబు మంగళవారం రాత్రి కమల్‌తో స్థానిక ఆళ్వారుపేటలోని ఎంఎన్ఎం పార్టీ కార్యాలయంలో అరగంటపాటు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు రాజ్యసభ ఎన్నికపైనే చర్చించినట్లు సమాచారం. జూలై 24న తమిళనాట ఆరు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. అసెంబ్లీలో ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి డీఎంకే కూటమికి 4, అన్నాడీఎంకే కూటమికి 2 స్థానాలు రావడం ఖాయంగా కనిపిస్తోంది. ఆ ఎన్నికలో తమ కూటమి తరఫున కమల్‌ను రాజ్యసభకు పంపించాలని స్టాలిన్ నిర్ణయించినట్లు తెలిసింది. నిజానికి గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కమల్ డీఎంకేకు మద్దతు ప్రకటించడంతోపాటు పలు చోట్ల ప్రచారం కూడా చేశారు. ఆ ఎన్నికల్లో కమల్ పార్టీ నుంచి ఎవ్వరూ పోటీ చేయలేదు. తమ పార్టీకి బేషరతుగా మద్దతు ఇచ్చిన కమల్‌ను రాజ్యసభకు పంపిస్తామని స్టాలిన్ అప్పట్లోనే హామీనిచ్చారు. ఇప్పుడది కార్యరూపం దాల్చనుంది.

ఈ బంధం బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)



మొదటి ప్రపంచయుద్ధంలో అమరులైన భారత సైనికుల సమాధుల వద్ద ప్రధాని మోదీ, మేక్రాన్ నివాళి

ద్వైపాక్షిక సంబంధాలతోపాటు కీలకమైన అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలపైనా తాము చర్చించినట్టు సంయుక్తంగా ప్రకటించారు. ఐక్య రాజ్య సమితి భద్రతా మండలిలో తక్షణమే సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని వారు నొక్కి చెప్పారు. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వానికి ఫ్రాన్స్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఈ సందర్భంగా మేక్రాన్ మరోసారి స్పష్టం చేశారు.

భారత్‌కు రావాలని మేక్రాన్‌కు ఆహ్వానం

రక్షణ, సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ, అంతరిక్షం వంటి వ్యూహాత్మక రంగాల్లో సహకారంపై మోదీ, మేక్రాన్ సమీక్షించారు. క్షిపణులు, హెలికాప్టర్ ఇంజన్లు, జెట్ ఇంజన్లపై జరుగుతున్న చర్చలను ఇరువురూ స్వాగతించారు. భారత్ రూపొందించిన పినాకా రాకెట్ లాంచర్ వ్యవస్థను పరిశీలించాలని ఫ్రాన్స్‌ను మోదీ కోరారు. ఈ వ్యవస్థను కొనుగోలు చేస్తే ఇండో-ఫ్రాన్స్ రక్షణ సంబంధాల్లో మరో మైలురాయి అవుతుందన్నారు. 2024లో పారిస్ ఒలింపిక్స్, పారాలింపిక్స్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు మేక్రాన్‌ను మోదీ అభినందించారు. 2036లో ఒలింపిక్స్ నిర్వహణకు భారత్ ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఫ్రాన్స్ అనుభవాన్ని, నైపుణ్యాన్ని పంచుకోవడానికి సుముఖత వ్యక్తం చేసిన మేక్రాన్‌కు ధన్యవాదాలు తెలిపారు. మార్సెల్లీ సమీపంలోని తీరప్రాంత పట్టణం కాసిస్‌లో ప్రధాని మోదీకి.. మేక్రాన్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారత్‌లో పర్యటించాల్సిందిగా.. మేక్రాన్‌ను మోదీ ఆహ్వానించారు. మేక్రాన్‌తో కలిసి మార్సెల్లీ నగరంలో భారత నూతన దౌత్య కార్యాలయాన్ని మోదీ ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ కార్యాలయం ఏర్పాటు ద్వారా ఇరు దేశాల మధ్య బంధం మరింత బలోపేతమవుతుందని చెప్పారు. అనంతరం మజార్గెస్ మిలటరీ శ్మశాన వాటికను వారు సందర్శించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో అమరులైన భారతీయ సైనికుల సమాధుల వద్ద మోదీ, మేక్రాన్ పుష్పగుచ్ఛాలు ఉంచి ఘన నివాళి అర్పించారు. కాగా, ఫ్రాన్స్‌లోనే ప్రధాని మోదీ అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుమారుడు వివేక్ పుట్టినరోజు వేడుకకు హాజరయ్యారు. ఆ చిన్నారికి బర్త్‌డే గిఫ్ట్ కూడా ఇచ్చారు. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో కూడా మోదీ భేటీ అయ్యారు. కృత్రిమ మేధ భారత్‌లో తీసుకురానున్న అద్భుతమైన అవకాశాలపై చర్చించారు. 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' కోసం గూగుల్, భారత్ కలిసి ఎలా పనిచేయవచ్చో మాట్లాడారు.

12 మంది గ్యాంగ్‌స్టర్ల జాబితా సిద్ధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: మోదీ అమెరికా పర్యటనలో భాగంగా గురువారం ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవనున్నారు. ఈ క్రమంలో భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాలో నక్కి భారత్‌లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న 12 మంది గ్యాంగ్‌స్టర్ల జాబితాను సిద్ధం చేసి దాన్ని అమెరికాకు ఇవ్వనుంది. ఆ గ్యాంగ్‌స్టర్లను అప్పగించాలని కోరనున్నట్టు తెలిసింది. ఈ జాబితాలో.. దర్శన్‌జోత్ సింగ్, అమృత్ పాల్ సింగ్, హర్‌జోత్ సింగ్, హర్బీర్ సింగ్, నవరూప్ సింగ్, స్వరణ్ సింగ్, సాహిల్ కైలాష్ రిటోలి, యోగేశ్, భాను ప్రతాప్ సంబ్లీ, అమన్ సాంబి పేర్లు ఉన్నాయి.


నగ్నంగా నిలబెట్టి.. మర్మాంగాలకు డంబెల్స్ వేలాడదీసి..

ర్యాగింగ్ పేరుతో ముగ్గురు జూనియర్లకు సీనియర్ల నరకం

కేరళలోని కొట్టాయం ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో ఘటన

కొట్టాయం, ఫిబ్రవరి 12: కేరళలోని ఓ నర్సింగ్ కాలేజీలో సీనియర్లు ర్యాగింగ్ పేరుతో జూనియర్లను నగ్నంగా నిలబెట్టి.. వారి మర్మాంగాలకు కసరత్తుల కోసం ఉపయోగించే డంబెల్స్ వేలడదీశారు. ఆపై మర్మాంగాలకు కంపాస్‌లోని పదునైన పరికరాలను గుచ్చి తీవ్రంగా గాయపర్చారు. ఒకట్రెండ్రోజులు కాదు.. ఏకంగా మూడునెలల పాటు వారి దమనకాండ కొనసాగింది. కొట్టాయం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఈ దారుణం జరిగింది. మూడో సంవత్సరం చదువుతున్న ఐదుగురు విద్యార్థులు, మొదటి సంవత్సరం చదువుతున్న ముగ్గురిని ఈ విధంగా చిత్రహింసలకు గురిచేశారు. రక్తమోడుతున్న గాయాలపై బాధితులు లోషన్ పూసుకుంటే, ఇది తెలిసి ఆ ముగ్గురు సీనియర్లు మరింత రెచ్చిపోయారు. ఆ లోషన్‌ను బలవంతంగా బాధితుల నోట్లో పిండి పైశాచికానందం పొందారు. బాధితుల పట్ల తమ దుశ్చేష్టలన్నీ వీడియో తీశారు. ఎవరికైనా చెప్తే అకడమిక్ కెరీర్‌ను నాశనం చేస్తామని బెదిరించారు. అయితే, వారి రాక్షస చర్యలు ఎలా బయటపడ్డాయంటే.. సదరు ఐదుగురు సీనియర్లు మద్యానికి బానిసలు! జూనియర్ విద్యార్థుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసేవారు. వారి చిత్రహింసలు భరించలేక.. ఓ విద్యార్థి తన గోడునంతా ఫోన్లో తండ్రితో చెప్పుకొన్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయాలంటూ కుమారుడికి ఆయన చేసిన సూచనే మొత్తంగా కాలేజీలో ర్యాగింగ్ భూతాన్ని బయటపెట్టేలా చేసింది. ర్యాగింగ్ పేరుతో గత ఏడాది నవంబరు నుంచి ఐదుగురు సీనియర్లు తమను చిత్రహింసలకు గురిచేస్తున్నారని ముగ్గురు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు థర్డ్ ఇయర్ చదువుతున్న ఐదుగురు నిందితులు శామ్యూల్, జాన్సన్, జీవా, రాహుల్ రాజ్, రిజిల్ జీత్, వివేక్‌లపై ర్యాగింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసిన పోలీసులు, వారిని అరెస్టు చేశారు.

'అయోధ్య' ప్రధాన అర్చకుడు సత్యేంద్ర దాస్ కన్నుమూత



లక్నో, ఫిబ్రవరి 12: అయోధ్య రామ మందిరం ప్రధాన అర్చకుడు సత్యేంద్ర దాస్ (85) బుధవారం కన్నుమూశారు. లక్నోలోని సంజయ్‌గాంధీ మెడికల్ పీజీ ఆస్పత్రిలో బ్రెయిన్ స్ట్రోక్‌కు చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించిందని, ఈనెల 3 నుంచి న్యూరాలజీ వార్డులోని హై డిపెన్‌డెన్సీ యూనిట్‌లో ఆయనకు చికిత్స అందించామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సత్యేంద్ర దాస్ పార్థివదేహాన్ని అయోధ్యలోని ఆయన ఆశ్రమం సత్యధామ్ గోపాల్ మందిర్‌కు తరలించారు. సత్యేంద్ర దాస్ బంధువుల రాకకోసం ఎదురు చూస్తున్నామని, గురువారం మధ్యాహ్నం సరయూ నది తీరంలో అంత్యక్రియలు పూర్తి చేస్తామని తదుపరి ప్రధాన అర్చకుడు ప్రదీప్ దాస్ తెలిపారు. సత్యేంద్ర దాస్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు. ఆయన జీవితం మొత్తం రాముడి సేవకే అంకితం చేశారని చెప్పారు. పురాణ ఇతిహాసాల్లో, పూజాదికాలు నిర్వహించడంలో ఆయన నిష్ణాతుడని కొనియాడారు. సత్యేంద్రదాస్ 20వ ఏట ఆధ్యాత్మిక దీక్ష స్వీకరించారు. 1992లో బాబ్రీ మసీదు ఘటన సమయంలోనూ ఆయనే రామ మందిరంలో అర్చకుడిగా ఉన్నారు.

యూట్యూబర్ రణ్‌వీర్‌కు 1.4 లక్షల మంది అభిమానులు దూరం

తల్లిదండ్రులపై అసభ్యకర వ్యాఖ్యల ఫలితం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: వావివరుసలు, ఇంగితం లేకుండా తల్లిదండ్రుల గురించి అసభ్యకరమైన (ప్రచురించటానికి వీలు లేని) భాషలో మాట్లాడిన రణ్‌వీర్ అలహాబాదియా.. తన సోషల్ మీడియా అకౌంట్లలో వేల సంఖ్యలో ఫాలోవర్లను కోల్పోతున్నాడు. గడిచిన కొన్ని రోజుల్లోనే దాదాపు 1,42,000 మంది రణ్‌వీర్‌ను అన్‌సబ్‌స్క్రైబ్ చేసుకున్నారని వెల్లడైంది. ఇప్పటి వరకూ రణ్‌వీర్ ఫాలోవర్లుగా ఉన్న అనేక మంది అతడి మాటలను ఈసడించుకుంటూ, తీవ్రమైన కామెంట్లు పెడుతూ.. అతడి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ చానళ్ల నుంచి వైదొలుగుతున్నారు. అంతేకాదు.. బాయ్‌కాట్ రణ్‌వీర్ అలహాబాదియా, అన్‌ఫాలో రణ్‌వీర్ అలహాబాదియా వంటి హ్యాష్‌ట్యాగ్‌లు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. రానున్న రోజుల్లో రణ్‌వీర్ పాడ్‌కాస్ట్‌కు వస్తామని అపాయింట్‌మెంట్ ఇచ్చిన పలువురు ప్రముఖులు.. తాము ఆ కార్యక్రమానికి హాజరుకాబోమని బహిరంగంగా ప్రకటిస్తున్నారు. రణ్‌వీర్‌ను స్పాన్సర్ చేసిన అమెజాన్ ప్రైమ్ వీడియో, ఇంటెల్, మౌంటెన్ డ్యూ, స్పోటిఫై వంటి పలు బ్రాండ్‌లు ఒప్పందం నుంచి వైదొలిగే సూచనలు కనిపిస్తున్నాయి. రణ్‌వీర్ మీద కేసులు దాఖలవుతున్నాయి. సోషల్ మీడియాలో అసభ్యతను ప్రచారం చేస్తున్నారన్న అభియోగాలతో గువాహటిలో రణ్‌వీర్‌తోపాటు మరో యూట్యూబర్ ఆశీష్ చంచలానీ మీద ఎఫ్ఐఆర్ దాఖలైందని ఆ రాష్ట్ర సీఎం హిమంత వెల్లడించారు. మహారాష్ట్ర సీఎం ఫడణవీస్.. రణ్‌వీర్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది.. ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతానని చెప్పారు. రణ్‌వీర్‌తోపాటు, అతడి అసభ్యకర వ్యాఖ్యలకు వేదికగా నిలిచిన యూట్యూబ్ కామెడీ షో 'ఇండియాస్ గాట్ టాలెంట్' తాలూకు కమెడియన్ సమయ్ రైనా, ఆ షో నిర్మాతలు తుషార్ పూజారి, సౌరభ్ భోత్రా, షోలో పాల్గొన్న యూట్యూబర్ అపూర్వ ముఖిజాలకు జాతీయ మహిళా కమిషన్ సమన్లు జారీ చేసింది.

అప్పు కట్టలేదని ఇంటి గేట్లు ఎత్తుకెళ్లారు

- స్టేషన్‌ఘన్‌పూర్ డీసీసీబీ అధికారుల తీరు
- ఓ మహిళ రుణం తిరిగి చెల్లించలేదని ఆమె ఇంటి గేట్లు తీసుకెళ్లిన వైనం
- జనగామ జిల్లాలో ఘటన

కొడకండ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో తీసుకున్న అప్పు తిరిగి చెల్లించలేదని బ్యాంకు అధికారులు ఇంటి గేట్లు ఎత్తుకెళ్లిన ఘటన జనగామ జిల్లా కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏడునూతులలో తండా మంజుల, మద్దెబోయిన ప్రేమలతలకు పాడిగేదెల కోసం జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఉన్న డీసీసీబీ రూ.8.72 లక్షల రుణం 2021 అక్టోబరులో ఇచ్చింది. ఒక్కో గ్రూపునకు ఐదుగురు చొప్పున రెండు గ్రూపుల్లో మొత్తం 10మంది తలా ఒక పాడిగేదె కొన్నారు. అయితే కొంత అప్పు కట్టినా రెండు గ్రూపులు కలిపి మొత్తం రూ.7 లక్షల బాకీ చెల్లించలేదు. వాస్తవానికి 2023లోనే ఈ రుణ వాయిదాలు పూర్తి కావాల్సి ఉంది. దీంతో బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు 2023 అక్టోబరులో లీగల్ నోటీసులు పంపారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవారం లబ్ధిదారుల ఇంటికి బ్యాంకు సిబ్బంది లీగల్ నోటీసులు ఇవ్వడానికి వెళ్లారు. ఈ సందర్భంగా గట్టిగా అడగడంతో రూ.3 లక్షలు చెల్లించారు. అయితే రెండు రోజుల్లో మొత్తం చెల్లిస్తామన్నా వినకుండా బ్యాంకు సిబ్బంది తమ ఇంటి గేట్లు తీసుకెళ్లారని మద్దెబోయిన ప్రేమలత ఆరోపించారు. వారే తమ గేట్లు తీసుకెళ్లమన్నారని డీసీసీబీ కొడకండ్ల బ్రాంచ్ మేనేజర్ కళ్యాణి తెలిపారు.

శ్రీకాకుళంలో జీబీఎస్ కలకలం!

- బాలుడి మృతిపై అనుమానం
- గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో

సంతబొమ్మాళి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏపీలోని శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసలో గులియన్ బారీ సిండ్రోమ్ (జీబీఎస్) వ్యాధి కలకలం రేగింది. ఇటీవల గ్రామంలో వాతాడ యువంత్ అనే పదేళ్ల బాలుడు ఈ వ్యాధితో మృతి చెందాడని ప్రచారం జరుగుతుండడంతో గ్రామస్థులు భయాందోళనలు చెందుతున్నారు. మహారాష్ట్రలో ఈ వ్యాధితో చాలామంది మృతి చెందగా, ఇటీవల తెలంగాణలో కూడా వ్యాధి లక్షణాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో కాపుగోదాయవలసలో ఈ వ్యాధిసోకి బాలుడు మృతి చెందాడన్న అనుమానంతో జిల్లా వైద్యాధికారి బాలమురళీకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది బుధవారం గ్రామాన్ని సందర్శించింది. బాలుడి తల్లి రోజా నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జనవరి 30న యువంత్‌కు నీరసంగా ఉండడంతో విశాఖ ఆస్పత్రికి తరలించామని, వైద్యులు పరిశీలించి గులియన్ బారీ సింద్రోమ్ అని చెప్పారని తెలిపారు. అక్కడి నుంచి రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించామని, అక్కడ బ్రెయిన్‌డెడ్‌తో మృతి చెందాడని చెప్పారు. అనంతరం వైద్య బృందం గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా, బాలుడు యువంత్ జీబీఎస్‌తో మృతి చెందాడన్న దానిపై పూర్తి స్థాయిలో నిర్ధారణకు రావాల్సి ఉందని బాలమురళీకృష్ణ తెలిపారు.

'ధని' లోన్ యాప్ ముఠా కీలక నిందితుడి అరెస్టు

- రూ. 2 కోట్లకు పైగానే కాజేసిన ముఠా

వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ధని ఫైనాన్స్ లోన్ యాప్ పేరిట ప్రజలను మోసం చేస్తున్న సైబర్ నేరగాళ్ల ముఠాలోని కీలక నిందితుడిని వనపర్తి జిల్లా పోలీసులు పట్టుకున్నారు. బుధవారం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ ముఠా కొంతకాలంగా బిహార్, పాట్నా, కోల్‌కత్తా కేంద్రంగా ధని ఫైనాన్స్ లోన్ యాప్ పేరిట తెలుగు రాష్ట్రాలలోని ప్రజలను మోసం చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని కొందరు యువకులు ఈ సైబర్ నేరగాళ్లతో కలిసి ఉమ్మడి జిల్లాలోని ప్రజలను మోసం చేస్తున్నారని వెల్లడించారు. గత నెల 20వ తేదీన గోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన సైబర్ కేసు నమోదయిన కేసు ఆధారంగా 55 మంది నిందితులను గుర్తించామని తెలిపారు. అందులో ముగ్గురు నిందితులు మూడావత్ నరేష్ నాయక్, మూడావత్ వెంకటేష్ నాయక్, మూడావత్ చందు నాయక్‌లను ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అదే కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు మహబూబ్ నగర్ జిల్లా సూర్తి తాండకు చెందిన కాత్రావత్ వెంకటేష్‌ను బుధవారం అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేటుగాళ్ల బాధితుల నుంచి రూ. 2 కోట్లకు పైగా కాజేశారన్నారు. సూర్తి తండా, కనకాపూర్ తండాకు చెందిన యువకులతో ఒక టీంను ఏర్పాటు చేసుకుని కోల్‌కత్తా, ఢిల్లీ, పాట్నా, బిహార్ రాష్ట్రాలకు చెందిన పంకజ్ కుమార్ యాదవ్, అంకిత్ యాదవ్, రాహుల్ పాస్వాన్, దీపక్ కుమార్, సునీల్ కుమార్, శంభులతో కలిసి వారు చెప్పిన విధంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు వివరించారు. కాజేసిన డబ్బులతో జల్సాలు చేయడం, కొంతమందికి అప్పుగా ఇవ్వడం చేస్తున్నారని చెప్పారు. కీలక నిందితుడు వెంకటేష్ ఇప్పటి వరకు పది లక్షలకు పైగా సైబర్ దోపిడీకి పాల్పడగా అతడి నుంచి రూ. 4 లక్షలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసు ఛేదనలో డీఎస్పీ రత్నం, సీఐ కృష్ణ, ఎస్‌ఐ రవి ప్రకాష్ ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు.

70 రకాల క్యాన్సర్లు ముందే గుర్తించొచ్చు

- 'ఉమ్ము' పరీక్షతో ప్రతి వ్యక్తికీ ప్రత్యేక చికిత్స
- 'ఒమేగా' వ్యవస్థాపకుడు డాక్టర్ మోహన్ వంశీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ముప్పును ముందే గుర్తిస్తే.. వాటిని రాకుండా అడ్డుకోవచ్చని ఒమేగా ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ మోహన్ వంశీ అన్నారు. వ్యాధుల ముప్పును ముందుగా గుర్తిస్తే సులభంగా చికిత్స చేయొచ్చని చెప్పారు. గచ్చిబౌలిలోని ఒమేగా ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశంలోనే మొదటిసారిగా ఒమేగా ఆస్పత్రిలో 'దీర్ఘాయుష చికిత్సల విభాగం (లాంగ్విటీ లాంజ్)' సేవలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తాము అందుబాటులోకి తెస్తున్న అత్యాధునిక టెక్నాలజీ ద్వారా ఉమ్ము పరీక్ష చేస్తామన్నారు. ఈ పరీక్ష చేస్తే 70 రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశాలను ముందుగానే గుర్తించవచ్చని చెప్పారు. క్యాన్సర్ అనేది చాపకింద నీరులా వ్యాపించి, ప్రాణాలు తీస్తుందని.. దేశంలో ఏటా 50 వేల కొత్త కేసులు వెలుగులోకి వస్తున్నాయని వివరించారు. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో కేసుల గుర్తింపు, నమోదులో జాప్యం జరుగుతోందని వంశీ చెప్పారు. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే సులభంగా చికిత్స చేయవచ్చన్నారు. క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్న సమయంలో డీఎన్ఏలో కొన్ని ఎంజైములు చేరి మార్పులు జరుగుతాయని, వాటిని బట్టి ముందుగానే వ్యాధిని గుర్తించవచ్చని తెలిపారు. అంతేకాకుండా గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలను ముందుగా గుర్తించి, చికిత్సతోపాటు తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చని చెప్పారు. జన్యు పరీక్షల ద్వారా డీఎన్ఏ బ్లూప్రింట్‌ను సిద్ధం చేసి, సులభంగా చికిత్స అందించవచ్చని తెలిపారు. ఆరోగ్య సేవల్లో ఇది కీలక పరిణామమన్నారు. ఇక క్యాన్సర్‌కు అందించే కీమో థెరపీ చికిత్సతో ఒక రోగికి ఎక్కువ ప్రయోజనం కలిగితే మరో రోగికి తక్కువ ప్రయోజనం ఉంటుందని చెప్పారు. వారం రోజుల్లో తాము లాంగ్విటీ లాంజ్ సేవలను ప్రారంభిస్తామన్నారు.

1300 సత్వర స్పందన బృందాలు!

బర్డ్ ఫ్లూ వైరస్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పశుసంవర్ధక శాఖ

- కోళ్లు అనారోగ్యంగా ఉన్నట్లు ఫోన్ చేస్తే వెంటనే వెళ్లి చికిత్స చేయనున్న బృందాలు
- అనుమానాల నివృత్తికి 040-23314876కు సంప్రదించాలి
- జువైనల్, సర్వీస్ హోమ్స్‌లో చికెన్‌ను నిలిపేసిన అధికారులు

హైదరాబాద్/కల్లూరు/పెనుబల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాపిస్తున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. అన్ని రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం కూడా సూచించింది. ఈ క్రమంలో వైరస్‌ను అడ్డుకునేందుకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వ్యాధి సోకిన కోళ్లు రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలంటూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. ఇందులో భాగంగానే సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. పశుసంవర్ధక శాఖ కేంద్ర కార్యాలయం, హైదరాబాద్‌లో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. అనుమానాల నివృత్తికి, వైరస్‌పై అవగాహన కోసం 040-23314876 నంబరులో సంప్రదించాలని అధికారులు తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 1,300 సత్వర స్పందన బృందాల (ఆర్ఆర్‌టీ)ను ఏర్పాటు చేశారు. ఈ బృందంలో ఒక వైద్యుడు, ఇద్దరు పారా మెడికల్ సిబ్బంది ఉంటారు. కోళ్లు అనారోగ్యంగా ఉన్నాయని లేదా ఇతరత్రా కారణాలతో ఎవరైనా రైతులు ఫోన్ చేస్తే వెంటనే ఈ బృందాలు వెళ్లి చికిత్స అందిస్తాయి. ఆర్ఆర్‌టీ సభ్యులకు ప్రత్యేకంగా పీపీఈ కిట్‌లను అందించారు. కాగా, ఇప్పటివరకు రాష్ట్రంలో ఎక్కడా బర్డ్ ఫ్లూ వైరస్ లక్షణాలు కనిపించలేదని అధికార వర్గాలు తెలిపాయి. అయితే ఖమ్మం జిల్లాలో కొన్ని కోళ్లు కొక్కెర వ్యాధి లక్షణాలతో మృతి చెందినట్లు పరీక్షల్లో తేలిందని చెప్పాయి. పౌల్ట్రీ రైతులతోనూ పశుసంవర్ధక శాఖ అధికారులు వరుస సమావేశాలు నిర్వహిస్తూ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు.



ఖమ్మం జిల్లా పేరువంచలో కోళ్లఫామ్‌లో రైతుతో మాట్లాడుతున్న జేడీఏ వెంకటనారాయణ

అంగన్‌వాడీ గుడ్లపై ప్రభావం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే కోడిగుడ్లపైనా బర్డ్ ఫ్లూ ప్రభావం పడనుంది. వైరస్ భయాల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో కోడిగుడ్లు ఇవ్వడం ఎంతవరకు సురక్షితమనే దానిపై మహిళా, శిశు సంక్షేమ శాఖ దృష్టి సారించింది. దీనిపై పశుసంవర్ధక శాఖకు లేఖ రాయగా.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ద్వారా వైరస్, దానివల్ల కలిగే దుష్పరిణామాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సమాధానం ఇచ్చారు. ఇదే అంశాన్ని తెలియజేస్తూ జిల్లా సంక్షేమ అధికారులకు మహిళా శిశు సంక్షేమ శాఖ బుధవారం సర్క్యులర్ పంపింది. బర్డ్ ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో కోళ్లతో పాటు గుడ్ల దిగుమతిని కూడా నిలిపివేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గుడ్లను అందించే అంశంపైనే ప్రత్యేకంగా పశుసంవర్ధక శాఖకు మరో లేఖ రాసినట్లు తెలిసింది. మరోవైపు మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని చిన్న పిల్లల సంరక్షణ కేంద్రాలు, సర్వీస్ హోమ్స్‌లోనూ చికెన్‌ను నిలిపివేసినట్లు అధికారులు చెప్పారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదు

వాతావరణ మార్పులతోనే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కోళ్లు చనిపోతున్నాయని పశు సంవర్ధక శాఖ జేడీఏ కె.వెంకటనారాయణ తెలిపారు. జిల్లాలో బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవన్నారు. ఇటీవల కాలంలో కల్లూరు, పెనుబల్లి తదితర ప్రాంతాల్లో ఫామ్‌లలో పెంచుతున్న కోళ్లు వాతావరణం, కొక్కెర, బ్యాక్టీరియాలతోనే మృతి చెందాయని చెప్పారు. ఖమ్మం కలెక్టర్ ఆదేశాల మేరకు జేడీఏ బుధవారం కోళ్ల ఫారాలను సందర్శించారు. నెల రోజులు ఫారాలను ఖాళీగా ఉంచి, ఆ తర్వాత పిల్లలను తెచ్చుకోవాలని రైతులకు సూచించారు. ప్రజలు కొంతకాలం కోడి మాంసం, గుడ్లను తినొద్దని పేర్కొన్నారు. ఆంధ్రా నుంచి ఎలాంటి కోళ్లు, దాణా సరఫరా కాకుండా తెలంగాణ సరిహద్దుల్లో పశుసంవర్ధక, పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖలతో సమన్వయం చేస్తూ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రేమోన్మాది శ్రీకాంత్‌కు జీవిత ఖైదు

- గతేడాది సంచలనం రేపిన అలేఖ్య హత్య కేసులో జిల్లా కోర్టు తీర్పు

ఖానాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం కలకలం రేపిన అలేఖ్య హత్య కేసులో ప్రేమోన్మాది జూకింది శ్రీకాంత్‌కు జీవిత ఖైదు నిర్మల్ జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించింది. రూ.1000 జరిమానా కూడా చెల్లించాలని ప్రధాన న్యాయాధికారి ఏ. కరుణాకర్ బుధవారం తీర్పునిచ్చారు. జిల్లాలోని ఖానాపూర్‌లో అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన షట్పెల్లి అలేఖ్య(22)ని అదే కాలనీకి చెందిన శ్రీకాంత్ ప్రేమిస్తున్నానంటూ పెళ్లి చేసుకోమని వేధించడగా అలేఖ్య తిరస్కరించింది. దాంతో ఆమెపై ద్వేషం పెంచుకొని గతేడాది ఫిబ్రవరి 8న కత్తితో అలేఖ్యపై దాడి చేయగా మృతి చెందింది. ఈ కేసు లో సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత బుధవారం న్యాయమూర్తి.. నిందితుడికి జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధించారు.

వనపర్తికి ఐటీ టవర్ మంజూరు

- రూ. 22 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- సీఎంకు ధన్యవాదాలు తెలిపిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో ఐటీ టవర్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి రూ. 22 కోట్లను బుధవారం విడుదల చేసింది. వనపర్తి పట్టణ శివారులోని నాగవరం గ్రామంలో రెండెకరాల్లో ఐటీ టవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి వెల్లడించారు. బీఆర్ అంబేడ్కర్ సచివాలయ మీడియా సెంటర్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఐ.టి టవర్ మంజూరు వివరాలను వెల్లడించారు. 25 వేల చదరపు అడుగుల్లో ఐటీ భవన నిర్మాణం జరుగుతుందని, ఈ భవనంలో ఏకకాలంలో 250 మంది ఐటీ నిపుణులు పనిచేసుకునే సౌకర్యం ఉంటుందని వివరించారు. గ్రామీణ ప్రాంతంలో ఐటీని అభివృద్ధి చేయడంలో భాగంగా వనపర్తికి ఐటీ టవర్ మంజూరు అయిందని, సామాజిక ఆర్థిక అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి సౌకర్యం కల్పించేందుకు ఈ ఐటీ టవర్‌ను వనపర్తిలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఏడాదిలో దీని నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. వనపర్తి ప్రాంతంలో విద్యాభ్యాసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల ఐటీ టవర్ మంజూరు అయిందంటూ.. ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

ఈసారి 18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈసారి వనమహోత్సవంలో 18.03 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. అత్యధికంగా ఎంఏయూడీ విభాగం 8 కోట్లు, పంచాయతీరాజ్ 7 కోట్ల మొక్కలు నాటాలని నిర్దేశించారు. 2025-26 సంవత్సరంలో నిర్వహించే వనమహోత్సవంపై అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్ఎం డోబ్రియల్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం బుధవారం సచివాలయంలో జరిగింది. ఇందులో వనమహోత్సవం లక్ష్యాలపై చర్చించారు. అన్ని ప్రభుత్వ విభాగాల్ని సమన్వయం చేసుకుని వనమహోత్సవం విజయవంతం చేసేలా చర్యలు చేపట్టాలని సమావేశంలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో పాఠశాల, కళాశాలల విద్యార్థుల్ని భాగస్వామ్యం చేసేలా సంబంధిత విభాగం అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

సర్వే అంటూ ఇంట్లోకి చొరబడి దోపిడీ

- ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి
- రూ.15లక్షల విలువైన ఆభరణాల అపహరణ

వైరా, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా వైరాలోని ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. సర్వే పేరుతో వచ్చిన నలుగురు అగంతకులు ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై దాడి చేసి, ఆమెను బంధించి రూ.15లక్షల విలువైన ఆభరణాలను దోచుకెళ్లారు. వైరా లీలాసుందరయ్య నగర్‌లో బుధవారం ఈ ఘటన జరిగింది. కొత్తగూడెంలోని పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకునిగా పని చేసే శీలం యుగేందర్ రెడ్డి తన భార్య లలిత, తల్లి వెంకట్రావమ్మ(65)తో కలిసి వైరాలోని లీలాసుందరయ్యనగర్‌లో నివాసముంటున్నారు. లలిత సమీపంలోని విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంటారు. దంపతులిద్దరూ బుధవారం ఉదయం ఎప్పట్లాగే విధులకు వెళ్లిపోగా వెంకట్రావమ్మ మాత్రమే ఇంట్లో ఉంది. ఉదయం 11 గంటల సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ఆ ఇంటికి వచ్చారు. తాము కుటుంబసభ్యుల సర్వే వివరాల కోసం వచ్చామని వెంకట్రావమ్మకు చెప్పగా నమ్మిన ఆమె వారు అడిగిన వివరాలను చెప్పింది. అనంతరం వెంకట్రావమ్మ తిరిగి ఇంట్లోకి వెళుతుండగా.. అగంతకులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేసి నోటికి ప్లాస్టర్ వేసి పడకగదిలోకి తీసుకెళ్లి మంచంపై పడేశారు. ఇద్దరు అగంతకులు ఆమె మొఖంపై దుప్పటి వేసి.. ఆమెపై కూర్చొని పిడిగుద్దులు గుద్దారు. మరో ఇద్దరు బీరువాలోని 18 తులాల బంగారు ఆభరణాలను చేజిక్కించుకున్నారు. వెంకట్రావమ్మ మెడలోని గొలుసు ఇతర వస్తువులను లాగేసుకున్నారు. అనంతరం వెంకట్రావమ్మను అలానే పడేసి గది గడియ పెట్టి వచ్చిన కారులో ఉడాయించారు. మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికొచ్చిన వెంకట్రావమ్మ కోడలు లలిత.. ఆమెను విడిపించింది. వైరా ఏసీపీ ఎం.ఏ.రెహ్మాన్, సీఐ నున్నావత్ సాగర్ బాధితురాలితో మాట్లాడి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

- కళాశాల ఎదుట మృతురాలి కుటుంబసభ్యుల ఆందోళన

నిజాంపేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బాలిక అక్కడి హాస్టల్ గదిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సీఐ ఉపేందర్, బాధిత కుటుంబసభ్యులు వెల్లడించిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం క్రిష్టాపురం గ్రామానికి చెందిన పూజిత బాచుపల్లిలోని ఎస్ఆర్ కాలేజీలో ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతోంది. కాలేజీలోని హాస్టల్ గదిలోనే ఆమె ఉంటోంది. మంగళవారం రాత్రి పూజిత తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని సీఐ ఉపేందర్ వెల్లడించారు. మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభించిందని వెల్లడించారు. అయితే తమ కుమార్తె మృతికి కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం అని పూజిత తల్లిదండ్రులు శ్రీనివాస్-దేవి ఆరోపించారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని పేర్కొన్నారు బుధవారం కళాశాల వద్దకు పూజిత కుటుంబసభ్యులు, బంధువులు చేరుకొని.. మూడుగంటల పాటు ఆందోళన నిర్వహించారు. కళాశాల భవనం అద్దాలు ధ్వంసం చేశారు.

సచివాలయంలో నకిలీ ఐఏఎస్ హల్‌చల్

- ఉద్యోగాల పేరిట వసూళ్లు.. నకిలీ ఉత్తర్వులు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సచివాలయంలో నకిలీ అధికారుల బెడద ఎక్కువైంది. ఇటీవల ఓ నకిలీ తహసీల్దారు, మరో నకిలీ రెవెన్యూ ఉద్యోగి పట్టుబడగా తాజాగా ఏకంగా ఐఏఎస్ అధికారి అంటూ హల్‌చల్ చేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. నకిలీ ఐఏఎస్‌గా పట్టుబడిన వ్యక్తిని బాలకృష్ణగా పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారం వెలుగు చూడటంతో సచివాలయ ముఖ్య భద్రతాధికారి దేవీదాస్ ఆదేశాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కార్యదర్శి హోదాలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నకిలీ ఉత్తర్వులు తయారుచేసి డబ్బు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. వీరి చేతిలో మోసపోయిన బాధితులు ఉద్యోగాలకు సంబంధించి ఈ నకిలీ ముఠా ఇచ్చిన ఉత్తర్వుల ప్రతులను తీసుకుని బుధవారం సచివాలయానికి వచ్చారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు విచారణ చేపట్టారు. ఏఎస్‌ఐ యూసఫ్, అంజనేయులు నకిలీ ఉద్యోగులను గుర్తించే ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

మేడారంలో ఘనంగా మినీ జాతర

- భారీగా తరలివస్తున్న భక్తులు
- మంచిర్యాలలో గోదావరి వెలవెల
- సమ్మక్క మినీ జాతర, శివరాత్రి స్నానాలకు ఇబ్బందులు



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి/మంచిర్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క- సారలమ్మల మినీ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు జరిగే ఈ వేడకలో భాగంగా తొలిరోజు ప్రధాన ఘట్టంగా మండమెలిగె కార్యక్రమాన్ని పూజారులు నిర్వహించారు. తెల్లవారుజామున గంగా స్నానాలు ఆచరించారు. అనంతరం మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మల మందిరాన్ని మహిళలు శుద్ధి చేసి తల్లుల ఆది స్థానాలను అలుకుపూతలు చేసి ముగ్గులు వేశారు. వనదేవతల అంతర్గత మందిరాల్లో సమ్మక్కకు సిద్దబోయిన వంశీయులు, సారలమ్మకు కాక వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలోని దేవతలను పూజించారు. దీప దూప నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డోలు వాయిద్యాల నడుమ గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలు ఏర్పాటు చేసి దిష్టి తోరణాలు కట్టారు. ఈ క్రమంలో వనదేవతల గుడుల్లో మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఆనవాయితీలో భాగంగా చర్ప వంశీయులు దివంగత మాజీ ఎమ్మెల్యే చర్ప భోజరావు కుటుంబ సభ్యులు సహా ఊరట్టం గ్రామం నుంచి డోలు వాయిద్యాల నడుమ సెలపెయ్యను గద్దెల వద్దకు తీసుకొచ్చి సమ్మక్క, సారలమ్మ పూజారులకు అందజేశారు. అనంతరం సాయంత్రం ఇలవేల్పులను ఘనంగా తమ తమ మందిరాలకు చేర్చారు. డోలు వాయిద్యాలు, కొమ్ము శబ్దాల నడుమ మహిళలు నీళ్లు ఆరబోస్తుండగా వడ్డెలు (పూజారులు) గద్దెల వద్దకు చేరుకొని జాగారం చేశారు. గురువారం ఉదయం సూర్యోదయానికి ముందు వనదేవతల మందిరాలకు చేరుకొని తల్లులకు శనివారం వరకు అంతర్గత పూజాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక మినీ జాతర ప్రారంభమైన నేపథ్యంలో మేడారానికి భక్తులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. మండమెలిగె పండుగ సందర్భంగా తల్లుల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తొలిరోజు సుమారు 2.5 లక్షల మంది మేడారం చేరుకున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

శివరాత్రి జాతర వరకైనా నీటిని విడుదల చేయండి

వేసవికాలం రాకముందే గోదావరి నదిలో నీటి ప్రవాహం పూర్తిగా అడుగంటింది. మంచిర్యాలలో గోదావరి ఒడ్డున సమ్మక్క-సారలమ్మ మినీ జాతర బుధవారం నుంచి ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరుగనున్న జాతరకు జిల్లా వాసులతోపాటు పొరుగు జిల్లాల భక్తులు ఇక్కడకు వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి, మొక్కులు చెల్లించుకుంటారు. ప్రస్తుతం గోదావరిలో స్నానం చేసేందుకు తగినంత నీరు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఈ నెల 26న శివరాత్రి సందర్భంగా జిల్లా కేంద్రంలో జాతరను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గోదావరిలో లక్షల మంది పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. భక్తులు స్నానాలు ఆచరించేనందుకు నీరు అందుబాటులో లేదు. కనీసం శివరాత్రి జాతర వరకైనా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయాలనే విజ్ఞప్తులు ఉన్నాయి.

ఫీజు కట్టాలంటూ ప్రిన్సిపల్ నలుగురిలో అడిగారని..

ఇంట్లో ఉరివేసుకొని బాలిక ఆత్మహత్య

- మేడ్చల్ జిల్లాలో ఘటన

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఫీజు ఎప్పుడు కడతారు? అంటూ తనను ప్రిన్సిపల్, స్కూల్లో అందరి ముందు నిల్చోబెట్టి అడగడాన్ని ఆ బాలిక తీవ్ర అవమానకరంగా భావించింది. బడికి వెళ్లలేక కొన్నిరోజులుగా ఇంట్లోనే ఉంటున్న ఆ విద్యార్థిని ఆ మనోవేదనతోనే తన గదిలో ఆత్మహత్య చేసుకుంది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ పట్టణంలో ఈ ఘటన జరిగింది. పదహారేళ్లకే నూరేళ్లు నిండిన బిడ్డ మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న ఆ తల్లిదండ్రులను ఓదార్చడం ఎవ్వరివల్లా కావడం లేదు. తమ బిడ్డను పాఠశాల ప్రిన్సిపలే పొట్టనబెట్టుకున్నారంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతురాలి తల్లిదండ్రులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన వెంకటేశ్వర రావు, కమల దంపతులకు విక్రమ్, అఖిల (16) సంతానం. వెంకటేశ్వర రావు కుటుంబం మేడ్చల్‌లో స్థిరపడింది. విక్రమ్, అఖిల దగ్గర్లోని ఓ కార్పొరేట్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నారు. ఈ పిల్లల స్కూలు ఫీజు కలిపి మొత్తం రూ.90వేలు కాగా, రూ.10వేలు మాత్రమే తల్లిదండ్రులు కట్టారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తుండటంతో పూర్తి స్థాయిలో ఫీజుల వసూలు కోసం ఇటీవల యాజమాన్యం పేరెంట్స్ మీటింగ్‌ను పెట్టింది. దీనికి వెంకటేశ్వర్ రావు, కమల హాజరవ్వలేదు. అయితే మీటింగ్‌కు వచ్చిన ఇతర విద్యార్థుల తల్లిదండ్రుల ముందు ఫీజు బకాయిల విషయమై విక్రమ్, అఖిలను మహిళా ప్రిన్సిపల్ ప్రశ్నించారు. ఆమె తీరుతో తీవ్ర మనస్తాపానికి గురైన విక్రమ్, అఖిల.. అప్పటి నుంచి వారం రోజులుగా బడికి వెళ్లడం లేదు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు చెప్పడంతో అఖిల తన గదిలోకి వెళ్లి తలుపులు బిగించుకొని.. లోపల సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఎంతసేపటికీ బిడ్డ గదిలోంచి బయటకు రాకపోవడంతో తల్లిదండ్రులు తలుపులు బద్దలు కొట్టి చూడగా అఖిల ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను తొలుత ఓ ప్రైవేటు ఆస్పత్రికి.. అక్కడి నుంచి కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న అఖిల బుధవారం సాయంత్రం మృతి చెందింది. అఖిల ఆత్మహత్యకు పాఠశాల ప్రిన్సిపలే కారణం అని తల్లి కమల ఆరోపించింది. అదేరోజు పాఠశాలకు వెళ్లి యాజమాన్యాన్ని నిలదీసింది. ఫీజులు చెల్లించకుంటే తల్లిదండ్రులను పిలిపించి అడగాలే తప్ప.. అందరి ముందు బాలికను నిల్చోబెట్టి అవమానిస్తారా? అని ఆవేదనతో ప్రశ్నించింది. కాగా, ప్రిన్సిపల్ రమాదేవిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



అఖిల(ఫైల్)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రాజ్యాంగహితులేనా?

శాసనసభ ఆమోదించిన బిల్లుల మీద ఏ నిర్ణయం తీసుకోకుండా అంతకాలం ఎలా వదిలేస్తారు? అంటూ సుప్రీంకోర్టు ఇటీవల తమిళనాడు గవర్నర్‌ను ప్రశ్నించింది. గవర్నర్లు కేంద్రప్రభుత్వం ఏజెంట్లమాదిరిగా వ్యవహరిస్తున్నారంటూ విపక్షపాలిత రాష్ట్ర ప్రభుత్వాలు సర్వోన్నతన్యాయస్థానాన్ని ఆశ్రయించడం, ఆయా కేసుల వాదోపవాదాల సందర్భంగా న్యాయమూర్తులు ఆగ్రహాన్నీ, ఆవేదననూ, నిస్సహాయతనూ వ్యక్తంచేయడం చూస్తూనే ఉన్నాం. బలమైన రాజకీయ శత్రువు ఉన్నచోట గవర్నర్ కూడా నాలుగు ఆకులు ఎక్కువ చదివినవారే ఉంటారు. తమ తెలివితేటలనూ, శక్తియుక్తులను సంపూర్ణంగా వినియోగించి, ఆ రాష్ట్రాన్ని ఏలుతున్న వారిని వేధించుకుతింటూ, పాలనసాగనివ్వకుండా అడుగడుగునా అడ్డుపడుతూంటారు. విస్తృతప్రజామోదంతో నెగ్గివచ్చినా కూడా సదరు పార్టీలు తాము కోరుకున్న చట్టాలు చేసుకోవడానికీ, నిర్ణయాలు తీసుకోవడానికి కొట్టుమిట్టాడాల్సిందే. నిన్నటికి నిన్న ఘోరంగా ఓడిపోయిన ఢిల్లీ కేజ్రీవాల్, బెంగాల్ మమత, కేరళ విజయన్, తమిళనాడు స్టాలిన్ వరకూ అందరిదీ ఒకే కథ. విపక్షపాలిత రాష్ట్రాల్లో ఏ గవర్నర్ అద్భుతమైన పనితీరు కనబరుస్తారో వారికి ప్రమోషన్ ఇచ్చి ఢిల్లీలో దేశ అత్యున్నత పదవులతో అలంకరించే సంప్రదాయం కూడా ఉంది.

తమిళనాడు గవర్నర్ ఎన్.రవి నిలిపివేసిన పన్నెండు బిల్లుల్లో ఒకటి 2020 జనవరి నాటిది. బిల్లులను సమ్మతించరు, పునఃపరిశీలనకు వెనక్కుపంపరు, రెండోసారి పంపిన బిల్లులను కచ్చితంగా ఆమోదించాలన్న ధర్మాన్ని కూడా పాటించరు అని రాష్ట్రప్రభుత్వం గత రెండేళ్ళుగా సుప్రీంకోర్టులో వాపోతోంది. ప్రభుత్వం పంపిన పన్నెండు బిల్లులను ఎటూతేల్చకుండా మూడేళ్ళు ఆపివేసి, గత ఏడాది నవంబరులో సుప్రీంకోర్టులో జవాబు చెప్పుకోవాల్సి వస్తుందన్న కారణంగా కొన్నింటిని రాష్ట్రపతికి పంపడం వంటి చర్యలు న్యాయమూర్తులను ఆశ్చర్యపరిచాయి. ఆయన చర్యలు ఆర్టికల్ 200కు విరుద్ధమని గుర్తుచేస్తూ, గవర్నర్ అధికారాలు, విచక్షణల విస్తృతి గురించి అటార్నీ జనరల్‌ను గుచ్చిగుచ్చి ప్రశ్నిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసు విచారణలో భాగంగా పలు చక్కని వ్యాఖ్యలు చేసింది. గవర్నర్ అధికారాలను తగ్గించి చెప్పడం లేదని అంటూనే, బిల్లుల్ని ఆలస్యం చేయడంలో ఎన్. రవి తన సొంత విధానాన్ని అనుసరిస్తున్నారంటూ సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించి ఈ కేసులో తీర్పును రిజర్వుచేసింది.

అసెంబ్లీ రూపొందించిన అన్ని బిల్లులను గవర్నర్ ఆమోదించాల్సిన అవసరం లేదు. నచ్చినవాటికి సరేనని, నచ్చనివి తిప్పికొట్టవచ్చు. అవసరమైతే వివరణలు కోరవచ్చు, అంతిమంగా రాష్ట్రపతికీ నివేదించవచ్చు. ఈ మార్గాలన్నీ కాకుండా ఏళ్ళతరబడి తేల్చకుండా వదిలివేయడమంటే అది మరో రాజకీయపార్టీ మీద కక్షతీర్చుకోవడం కంటే, రాజ్యాంగాన్ని అవమానించడం అవుతుంది. చివరకు ఎటువంటి వ్యాఖ్యలు, వివరణలు లేకుండా బిల్లులు తిప్పికొట్టడం, నిలుపు చేస్తున్నామని చెప్పి, వెనక్కుపంపకపోవడం వంటి విన్యాసాలు కూడా జరిగాయి. ఒక బిల్లు ఉభయసభల్లో రెండోసారి ఆమోదం పొందితే, గవర్నర్ చెప్పిన మార్పుచేర్పులు అందులో జరిగినా, లేకున్నా దాని మీద ఆయన సంతకం చేయాల్సిందే తప్ప, తిప్పికొట్టడానికి వీల్లేదని ఆర్టికల్ 200 నిర్దేశిస్తోంది. ఈ కేసులో సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటికే పలుమార్లు తన అసంతృప్తిని వెలిబుచ్చింది. తీర్పులో సైతం బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్ అధికారాలూ పరిమితులమీద మరింత నిర్దిష్టమైన వ్యాఖ్యలు చేయవచ్చును. రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన గవర్నర్లు రాజ్యాంగేతర శక్తుల్లాగా, రాజకీయపార్టీ అధికారిక ప్రతినిధుల్లాగా వ్యవహరిస్తున్నప్పుడు న్యాయస్థానాలు ఒక పరిధికి మించి చేయగలిగేదేమీ ఉండదు. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల చేతుల్లోనే అధికారాలు ఉండాలి తప్ప, ప్రజలతో ప్రత్యక్షసంబంధం లేని నామమాత్రపు పెద్దల చేతుల్లో కాదు. రాష్ట్ర రాజకీయాల్లో తలదూర్చడం, పరోక్షపాలన సాగించడం, అర్థంపర్థంలేని వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రభుత్వాలను అవమానించడం, రాష్ట్రపతిపాలన విధిస్తామని బెదిరించడం వంటి చేష్టలతో గవర్నర్లు హద్దులు దాటుతున్నారు, రాజ్యాంగాన్ని అతిక్రమిస్తున్నారు. గవర్నర్లమీద సుదీర్ఘకాలం న్యాయస్థానాల్లోనూ, అక్కడ ఏమీ తేలక ప్రజాక్షేత్రంలోనూ విపక్ష పార్టీలు పోరాడుతూండటం, ముఖ్యమంత్రులు నిరసనదీక్షల్లో కూర్చోవడం ప్రస్తుత ప్రజాస్వామ్యస్థితికి నిదర్శనం.

ఆప్ ఓటమి ప్రజాస్వామ్య విజయమేనా?




■ యోగేంద్ర యాదవ్

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ ఓడిపోయింది. మధ్యతరగతి ఓటర్లు మందహాసం చేస్తున్నారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రత్యర్థులు ఆనంద తాండవం చేస్తున్నారు. క్షమించాలి, నేనీ విజయోత్సవాలలో పాల్గొనలేను. ఇది నిజంగా 'ఆమ్ ఆద్మీ' విజయమేనా అని ప్రశ్నిస్తున్నాను. పది సంవత్సరాల క్రితం ఆప్‌లో పనిచేస్తున్న మాలో కొంతమందిపై పుకార్లు పుట్టించి, అవమానించి గెంటివేసిన వైనాన్ని నేను మరచిపోయానని మీరు పొరపడవద్దు. ఒక విశాల రాజకీయ సన్నివేశం గురించి యోచిస్తున్నప్పుడు నా వ్యక్తిగత అనుభవాలు, ఎంత చేదువైనా, ఆ వివేచనను ప్రభావితం చేయడాన్ని అనుమతించను. ఢిల్లీ ఎన్నికలలో బీజేపీ గెలుపు, ఆప్ ఓటమి ఆ విస్తృత రాజకీయ సన్నివేశంలో ఒక భాగం మాత్రమే. ఆ ఆలోచన నా గురించి కాదు, ఆప్, దాని నాయకుల గురించీ కాదు. నేను ముందే ప్రస్తావించినట్టు అది 'ఆమ్ ఆద్మీ' గురించి. చింత, కలత, ఆందోళన మిళితమైన మనసుతో నిట్టూరుస్తున్నాను.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఆప్ పదేళ్ల పాలన ఒక ప్రజాభిప్రాయ సేకరణ. ప్రజలు ఆప్ పాలనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఢిల్లీ ప్రజల ఆప్ తిరస్కారం బీజేపీకి అధికార లబ్ధిని సమకూర్చింది. గమనించారా? పరాజిత ఆప్, విజేత బీజేపీ మధ్య ఓట్ల శాతం కేవలం 3.5శాతం మాత్రమే. బీజేపీ సాధించుకున్న సీట్ల సంఖ్యను సూచిస్తే విజేత ఓట్ల వాటా పరాజిత ఓట్ల వాటా కంటే చాలా అధికంగా ఉండవచ్చనే భావన కలుగుతుంది. అయితే వాస్తవంగా ఆ రెండు వాటాల మధ్య తేడా ఊహాత్మక అంచనా కంటే చాలా తక్కువగా లేదూ?!

ఢిల్లీ ఎన్నికల ఫలితం ఎటువంటి పరిస్థితులలో విరుద్ధంగా ఉండేదో ఊహించడం కష్టమేమీ కాదు. అవినీతి ఆరోపణలు ప్రజల దృష్టికి వెళ్లకుండా ప్రసార మాధ్యమాలు బీజేపీ నాయకులను కాపాడిన విధంగానే ఆప్ నేతలనూ ఆదుకున్నట్టయితే పరిస్థితి మరో విధంగా ఉండేది. ఢిల్లీ ఎన్నికలు కేంద్ర బడ్జెట్‌కు ముందే నిర్వహించేందుకు ఎన్నికల సంఘం శ్రద్ధ చూపి ఉన్నట్టయితే, అలాగే ఢిల్లీ ఓటర్లను లక్ష్యం చేసుకునేందుకు కేంద్ర బడ్జెట్‌ను అనుమతించబోమన్న తన హామీకి ఈసీ కట్టుబడి ఉన్నట్టయితే పరిస్థితి భిన్నంగా ఉండేది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్‌లో వలే మహిళలకు నగదు బదిలీ పథకాన్ని అమలుపరచడంలో ఢిల్లీ ప్రభుత్వాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ నిరోధించకుండా ఉన్నట్టయితే ఓటర్లు అంతగా ఆప్‌కు వ్యతిరేకమయ్యేవారు కాదు అని నిశ్చితంగా చెప్పవచ్చు. ఆప్, కాంగ్రెస్‌లు పొత్తు పెట్టుకోకపోయినా ఎక్కడ పోటీ చేయాలి, ఎన్ని సీట్లకు పోటీ చేయాలి అనే విషయమై అవగాహన కుదుర్చుకున్నట్లయితే ఈ రెండు పార్టీల పరిస్థితి మరింత మెరుగ్గా ఉండేది. ప్రస్తావించిన వాటిలో ఏ ఒక్కటైనా సంభవించి ఉన్నట్టయితే మరో 2 శాతానికి పైగా ఓట్లు ఆప్‌కు చేకూరేవి. ఎన్నికల ఫలితాలపై పతాక శీర్షికలు భిన్నంగా ఉండేవి.

ఇదే సమయంలో ఓటర్లలో 'ప్రభుత్వ వ్యతిరేకత' చాలా తీవ్రంగా ఉందన్నది ఒక కొట్టివేయలేని వాస్తవం. అయితే ఈ వ్యతిరేకతను ఓట్ల వాటాల వైనం పూర్తిగా ప్రతిబింబించలేదు. ప్రజల శ్రేయస్సుకు సంబంధించిన వివిధ అంశాల–అభివృద్ధి, రోడ్లు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా– లో ఆప్ సర్కార్‌పై ప్రజల్లో భ్రమలు పూర్తిగా తొలగిపోయాయని సిఎస్‌డిఎస్–లోక్‌నీతి సర్వే ధ్రువీకరించింది. ఆప్ ప్రభుత్వం పనితీరుపై ప్రజల సంతృప్తి, కేంద్ర ప్రభుత్వ పనితీరు పై కంటే తక్కువగా ఉన్నది. అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యక్తిగతంగా ప్రజాదరణ ఆ పార్టీకి లభించిన ఓటర్ల వాటా కంటే తక్కువగా ఉన్నది. అవినీతి నిర్మూలన నినాదంతో ప్రభవించిన ఆప్ ప్రభుత్వం 'పూర్తి'గా లేదా 'కొంతమేరకు' అవినీతి సర్కార్ అని ఢిల్లీ ఓటర్లలో మూడింట రెండు వంతుల మంది అభిప్రాయపడడం దిగ్భ్రాంతికరమైన విషయం. ఆప్‌కు ఓటు వేసిన ఢిల్లీ ఓటర్లలో చాలా మంది ఆ పార్టీని అంతగా ఇష్టపడడం లేదన్నది కూడా నిరాకరించలేని వాస్తవం. ఆప్‌కు ఒక గట్టి ప్రత్యామ్నాయం ఉన్నా, బీజేపీ తరఫున విశ్వసనీయమైన ముఖ్యమంత్రి అభ్యర్థి ఉన్నా లేదా కాంగ్రెస్ ఒక గెలుపు గుర్రంగా కనిపించినా ఈ ప్రజాభిప్రాయసేకరణలో ఆప్ పట్ల మరింత వ్యతిరేకత వ్యక్తమై ఉండేది.

> ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో పరాజయం ఆప్‌కు పూర్తిగా యుక్తమైనదే. అందుకు సంతోషించవలసింది ఏమీ లేదు. నిజానికి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం మన దేశంలో సుస్థిరంగా వర్ధిల్లాలని కోరుకుంటున్న వారు ఆప్ ఓటమిలోని అపశకునాలకు ఆందోళన చెందాలి, మన గణతంత్ర రాజ్య భవిష్యత్తు గురించి శ్రద్ధతో ఆలోచించాలి. దేశ రాజకీయాలలో ఎటువంటి మినహాయింపులేని సంపూర్ణ ప్రాబల్యాన్ని నెలకొల్పుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చుకోవడంలో బీజేపీ మరో అడుగు ముందుకు వేసేందుకు ఢిల్లీ విజయం తోడ్పడుతుంది.

అవును, ఈ ఎన్నికల పరాజయం ఆప్‌కు పూర్తిగా యుక్తమైనదే. అయితే అందుకు సంతోషించవలసింది ఏమీ లేదు. నిజానికి రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యం మన దేశంలో సుస్థిరంగా వర్ధిల్లాలని కోరుకుంటున్న వారు ఆప్ ఓటమిలోని అపశకునాలకు ఆందోళన చెందాలి, మన గణతంత్ర రాజ్య భవిష్యత్తు గురించి శ్రద్ధతో ఆలోచించాలి. ఆప్ ఓటమికి నేను చింతిస్తున్నాను – ఆ పార్టీకి నేను అభిమానిని అయినందువల్ల కాదు. రాజకీయాలలో మౌలిక పరివర్తన సాధించేందుకు ప్రభవించిన పార్టీ అది. ఆవిర్భవించిన మొదటి రెండు సంవత్సరాలలోనే ప్రజామోదం సంపూర్ణంగా పొందిన పార్టీ అది. ఆ పార్టీ అధినేత వ్యక్తిపూజను పోత్సహించాడు, సకల అధికారాలనూ తన చేతుల్లో కేంద్రీకరించుకున్నాడని నిక్కచ్చిగా చెప్పక తప్పదు. ఇక ఆయన సన్నిహితులు, ఆంతరంగికులు నిగూఢ రాజకీయాలు చేశారు, రెండు నాల్కలతో మాట్లాడారు, సాధారణ పార్టీ కార్యకర్తను లక్ష్యపెట్టలేదు. ఏతా వాతా ఏ పార్టీలనయితే అధికారం నుంచి, జాతి రాజకీయ జీవితం నుంచి తొలగించేందుకు పుట్టిందో ఆ ప్రధాన స్రవంతి రాజకీయ పక్షాల కంటే ఆప్ భిన్నమైనది కాదని రుజువయింది. మీడియాలో ముఖ్యమంత్రి నివాసం 'శీష్ మహల్' గురించి అతిశయోక్తులతో ఉధృత ప్రచారం జరిగింది. పార్టీ నాయకులు పదే పదే మాట్లాడిన గాంధేయ ఆదర్శాలకు విరుద్ధంగా వారి జీవన శైలి ఉన్నందునే మీడియా నిశిత విమర్శలు అనివార్యమయ్యాయి. మద్యం కుంభకోణంలో ఆప్ నాయకులకు న్యాయస్థానాలు ఎటువంటి శిక్ష విధించని మాట నిజమే. అసలు వారు ఆ అవినీతికి పాల్పడినట్లు న్యాయసమ్మతమైన రుజువులు లభించకపోవచ్చు. అయినా మద్యం కుంభకోణం మిథ్య కాదు. ఆప్‌కూ నైతిక విలువలు లేవనే కఠోర వాస్తవాన్ని ప్రజలకు అది స్పష్టం చేసింది.

ఆప్ ఓటమికి నేను కలత చెందుతున్నాను. 'ఢిల్లీ నమూనా' ఆదర్శప్రాయమైనదని విశ్వసించడం వల్ల కానే కాదు. ఆప్ సర్కార్ ప్రభుత్వ విద్యారంగానికి రాజకీయ ప్రఖ్యాతి తీసుకువచ్చింది. ప్రభుత్వ బడులలో సదుపాయాలను మెరుగుపరిచింది. మరి నాణ్యమైన విద్య ఢిల్లీ బాలలకు అందినదా అనే విషయం పూర్తిగా చర్చనీయాంశమే. మొహల్లా క్లినిక్‌లు ఒక మంచి ఆలోచన. అయితే వాటిని అమలుపరిచిన తీరు ఆరోగ్య సాధకంగా లేదు. ఉచిత విద్యుత్ , మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం మొదలైనవి పేదల సంక్షేమం పట్ల ఆప్ రాజకీయ సంకల్పానికి అద్దం పడుతున్నాయి. అయితే అందుకు ఖర్చు చేసిన నిధులను ప్రజల జీవన స్థితిగతుల మెరుగుదలకు దోహదం చేసే దీర్ఘకాలిక సంస్థాగత మెరుగుదలకు వినియోగించి ఉండవలసింది. పట్టణ ప్రాంతాల మౌలిక సదుపాయాల మెరుగుదలకు ఢిల్లీ నమూనా చేసిన దోహదం పెద్దగా ఏమీ లేదు. వ్యర్థ పదార్థాల నిర్వహణపై శ్రద్ధ చూపలేదు. నీటి, వాయు కాలుష్యాలను సమర్థంగా నిరోధించలేదు. కొన్ని రంగాలలో పరిస్థితులు పాక్షికంగా మెరుగుపడినా ఆ మెరుగుదల ఏ విధంగానూ ఆదర్శ నమూనా కానేకాదు.

ఢిల్లీ నగర–రాజ్య విధానాలు, రాజకీయాలలో నిరుపేదల రాజకీయ ప్రాధాన్యాన్ని తుడిచివేసేందుకు ఆప్ ఓటమి నాంది అవుతుందని నేను అమితంగా వ్యాకులత చెందుతున్నాను. ఆప్ ప్రభుత్వం ఎన్ని పరిమితులతో అయినప్పటికీ నగరంలో అనధికారికంగా నివసించక తప్పని పరిస్థితులలో కునారిల్లుతున్న ఢిల్లీవాలాలలో చాలా మందికి రక్షణ కల్పించింది. పేదల, కొత్తగా నగరానికి వలసవచ్చిన అభాగ్యుల, దళితుల సమస్యల పరిష్కాం పట్ల శ్రద్ధ చూపింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన బీజేపీ అజెండా ఢిల్లీని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నగరంగా అభివృద్ధిపరచడం. యమునానది తీర ప్రాంతాల అభివృద్ధి, సుందరీకరణ మొదలైనవి ఆ అజెండాలో ఉన్నాయి. ఇవన్నీ ఢిల్లీ జనాభాలో మెజారిటీగా ఉన్న పేదలు, నిరుపేదలు నగరంలో లేకుండా చేసేందుకు దారితీస్తాయి.

దేశ రాజకీయాలలో ఎటువంటి మినహాయింపులేని సంపూర్ణ ప్రాబల్యాన్ని నెలకొల్పుకోవాలన్న ఆకాంక్షను నెరవేర్చుకోవడంలో బీజేపీ మరో అడుగు ముందుకు వేసేందుకు ఢిల్లీ ఎన్నికలలో విజయం తోడ్పడుతుందని నేను ఆందోళన చెందుతున్నాను. ఎన్నికల సంఘం బీజేపీ పక్షపాతిగా వ్యవహరించడాన్ని, అన్ని పక్షాలకు సమ అవకాశాలు కల్పించకపోవడాన్ని ఎవరూ ప్రశ్నించడానికి ఆస్కారం లేకుండా పోతుంది. మరీ ముఖ్యంగా ఆప్ ఓటమితో ప్రత్యామ్నాయ రాజకీయాలకు అవకాశం లేకుండా పోతుందని, అటువంటి ప్రయత్నాలు చేసే శక్తులకు తీవ్ర విఘాతం కలుగుతుందని నేను భయపడుతున్నాను. ఈ విషయమై మీరూ ఆందోళన చెందాలి.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

'విద్యార్థి ఎన్నికల'పై నిషేధం ఎత్తివేయాలి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణపై నిషేధం విధించి 36 ఏళ్ళు గడుస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో 1988లో ఉస్మానియా విశ్వవిద్యాలయ అనుబంధ నిజాం కళాశాలలో రెండు విద్యార్థి గ్రూపుల మధ్య ఘర్షణలో దేవేందర్ యాదవ్ అనే విద్యార్థి హత్య జరిగిందనే నెపంతో అప్పటి పాలకులు ఈ ఎన్నికలపై నిషేధం విధించారు. ఎనభయ్యవ దశకంలో విద్యార్థి సంఘం ఎన్నికలు విద్యార్థుల ఆలోచనలను మెరుగుపరిచి, అభివృద్ధి వైపు నడిపించాయి. విద్యాసంస్థల్లో ఈ ఎన్నికల నుంచి ప్రేరణ, చైతన్యం పొంది రాజకీయాలలోకి వచ్చిన అనేక మంది సాధారణ విద్యార్థులు నేడు భారత పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థలో తమ ప్రభావాన్ని చూపుతున్నారు. నాడు క్యాంపస్‌లలో స్టూడెంట్ బాడీ ఎన్నికలలో ఎన్నికైన విద్యార్థులు విద్యారంగ సమస్యలను పరిష్కరించడానికి ముందు వరుసలో ఉండేవారు. దాంతో యూనివర్సిటీలు జ్ఞాన కేంద్రాలుగా, ఉద్యమ కేంద్రాలుగా సమాజంపై గొప్ప ప్రభావాన్ని చూపాయి.



నేడు విద్యార్థి ఎన్నికలు లేకపోవడంతో విద్యార్థుల డిమాండ్లను లేవనెత్తడం, ఆయా యాజమాన్యాలు, ప్రభుత్వాలను సంప్రదించి, పరిష్కరించడం సవాలుగా మారింది. కొన్నేళ్లుగా తెలంగాణ యూనివర్సిటీలు, కళాశాలలకు సరైన నిధుల కేటాయింపులు లేక మౌలిక సదుపాయాలు అందక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రొఫెసర్ల నియామకం జరగడం లేదు. నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ కూడ జరగడం లేదు. దీంతో యూనివర్సిటీలలో విద్యాబోధన నిలిచిపోయి పరిశోధనలు కుంటుపడ్డాయి. యూనివర్శిటీల ప్రతిష్ఠ మసకబారుతోంది.

ప్రతి ఏడాది జరిగే విద్యార్థి సంఘం ఎన్నికల్లో అనేక సమస్యలు చర్చకు వస్తాయి. వివిధ బావజాలాల మధ్య స్నేహపూర్వక చర్చ–ఘర్షణ ఉంటుంది. ఇది గమనిస్తూ ఎన్నికలలో పాల్గొనే సాధారణ విద్యార్థులు కూడా సమాజం పట్ల కొంత జ్ఞానాన్ని పెంపొందించుకొని మార్పు వైపు ప్రయాణించేవారు. విద్యార్థుల హక్కులకై, వారి సమస్యల పరిష్కారానికి యాజమాన్యాలతో, పాలక ప్రభుత్వాలతో నిత్యం సంప్రదింపులు, పోరాటం కొనసాగడం వల్ల విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందేవి. బహుజన సమూహాల విద్యార్థులు నాయకులుగా ఎదిగేవారు. ఇది ఇష్టం లేని పాలకవర్గాలే ఈ మూడున్నర దశాబ్దాలుగా ఎన్నికల వైపు తొంగి చూడటం లేదు. పైగా నిషేధాన్ని కొనసాగిస్తూనే ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలను, సంఘాలను అణచివేస్తున్నారు.

ఇటీవల కాలంలో తెలంగాణ ముఖ్యమంత్రి విద్యార్థుల పోరాటాలతోనే ప్రత్యేక రాష్ట్రం సాకారమైందని, విద్యార్థులు రాజకీయాలలోకి రావాలని పిలుపునిచ్చారు. ఒకవైపు విద్యార్థి సంఘం ఎన్నికలపై నిషేధాన్ని కొనసాగిస్తూ, మరోవైపు విద్యార్థులు రాజకీయాలలోకి రావాలనడం మోసం చేయడమే. తక్షణమే విద్యార్థి ఎన్నికల నిర్వహణపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలి. అందుకు గతంలో భారత మాజీ ఎన్నికల అధికారి జె.యం లింగ్డో కమిటీ సూచనలు పాటిస్తూ, విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) విడుదల చేసిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలి.

లింగ్డో నివేదికను అమలు చేస్తూ స్టూడెంట్ బాడీ ఎన్నికలు జరపాలని 2006లో సుప్రీంకోర్టు మరో ఆర్డరు జారీచేసింది. తరువాత 2007లో ఎన్నికల నిర్వహణకై యూజీసీ ఆదేశాలు జారీ చేయగా, దేశంలోని అన్ని యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థి సంఘం ఎన్నికలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. కానీ నిషేధం కారణంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విద్యార్థి సంఘం ఎన్నికలు జరగడం లేదు. విద్యార్థి సంఘం ఎన్నికల అంశం తెరమీదకు వచ్చినప్పుడల్లా ఈ రాష్ట్రాల పాలక వర్గాలు, ఆయా యూనివర్సిటీల యాజమాన్యాలు శాంతిభద్రతల అంశాన్ని సాకుగా చూపుతున్నాయి. శాంతిభద్రతలే సమస్యైతే సాధారణ ఎన్నికలు ఎలా నిర్వహిస్తున్నారో సమాధానం చెప్పాలి. విద్యార్థి సంఘం ఎన్నికల ప్రాధాన్యం గుర్తిస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలల్లో ఎన్నికలు తక్షణమే జరపాలని డిమాండ్‌తో పోరాడాల్సిన అవసరం వుంది.

– కోట ఆనంద్, విద్యార్థి నాయకులు

కుల గణన బూటకం

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం ఒక బలమైన ఐక్య బీసీ ఉద్యమం నేడు కొనసాగుతున్నది. ఈ క్రమంలో బీసీల కులగణన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను తగ్గించి, ఓసీ కులాల జనాభాను అధికంగా చూపించడం అక్రమం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సామాజిక న్యాయం సాధ్యం కాదు. అది కూడా నాటకమే. 2011లో కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జనాభా పెరగాలి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఓసీ జనాభాను పెంచి, వారికే సామాజిక న్యాయం అందే విధంగా ఆ నినాదాన్ని ఒక నాటకంగా మార్చింది. ఇప్పుడు రేవంత్‌రెడ్డి–రాహుల్‌గాంధీ కంపెనీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం అమలు చేస్తామని ప్రకటించడం కూడా నయా బూటకమే.

ఇక, 2014లో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిన గత ప్రభుత్వం ఆ వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు పెట్టలేదు? ఇది దొంగలు దొంగలు ఒక్కటే అనడానికి ఒక ఉదాహరణ. కుటుంబ సర్వే తప్పుల తడక అని ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఆ ప్రతులను చూపిస్తూ షో చేశారే కానీ, వాటిని ఎందుకు బయట పెట్టలేదు? కోట్లాది ప్రజాధనాన్ని వెచ్చించి నిర్వహించిన ఆ సర్వే రిపోర్ట్ ప్రజలదే కదా! కేసీఆర్ లేదా టీఆర్ఎస్ (బీఆర్ఎస్) జేబు నుంచి ఖర్చు చేయలేదు కదా? నాటి సమగ్ర కుటుంబ సర్వేను, నేటి కుల గణనను బహిర్గతపరచాలి. కుల గణనపై అనేక అనుమానాలు ఉన్న నేపథ్యంలో నిపుణులను నియమించి రీ సర్వే చేయించాలి. స్థానిక సంస్థల రిజర్వేషన్‌లోనే కాకుండా, విద్యా ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు ఏ విధంగా అమలు చేస్తారో స్పష్టం చేయాలి. అన్ని రకాల రిజర్వేషన్లను అమలు చేయడానికి అడ్డుగా ఉన్న సుప్రీంకోర్టు సీలింగ్‌ని ఎత్తివేయాలి, లేదా తొమ్మిదవ షెడ్యూల్‌లో ఈ రిజర్వేషన్ అంశాన్ని చేర్చి, కేంద్రాన్ని ఒప్పించి అమలు చేయాలి. కానీ ఈ విషయంలో బీసీ సమాజంలో పనిచేస్తున్న ప్రజా సంఘాలు, మేధావులు మాట్లాడకపోవడం విడ్డూరం. అలాగే జస్టిస్ ఈశ్వరయ్య సూచనలను పరిగణంలోకి తీసుకోవాలి. కులాల జనాభా దామాషా ప్రకారం వాటా కల్పించాలి.

– పాపని నాగరాజు (అధ్యక్షులు కుల నిర్మూలన వేదిక), **డాక్టర్ పర్వతం వెంకటేశ్వర్** (కోఆర్డినేటర్ బీసీ ఇంటలెక్చువల్ ఫోరం), **సంగం సూర్యారావు** (బీసీ టైమ్స్), **మాలి కరుణాకర్** (కో కన్వీనర్ బీసీ పొలిటికల్ జేఏసీ) **తదితరులు.**

ఈ పెంపు.. నిరుద్యోగులకు తలవంపు

విశ్వవిద్యాలయాల్లో బోధనా సిబ్బంది పదవీ విరమణ వయస్సును తెలంగాణ ప్రభుత్వం 65 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని విద్యార్థి, నిరుద్యోగ, యువజన సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకూ ఇచ్చింది కేవలం 12 వేల ఉద్యోగాలు మాత్రమే. వాళ్లు చెప్పుకుంటున్నవన్నీ కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఉన్న ఖాళీలు మాత్రమే.

ప్రస్తుతం బోధనా సిబ్బంది వయస్సును 65 ఏళ్లకు పెంచటం వల్ల ఇప్పటికే విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వారికి, పీహెచ్‌డీ పూర్తి చేసి ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం వేచి చూస్తున్న వారికి మరో ఐదేళ్ల వరకు ఎలాంటి ఖాళీలు ఏర్పడవు. ప్రస్తుత పరిశోధకులు తమ రీసెర్చిని పూర్తి చేసే సమయానికి ఇప్పుడున్న వాళ్లతో కలిపి పోటీ రెండింతలు పెరుగుతుంది. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో 2,837 బోధన సిబ్బంది పోస్టులున్నాయి. అందులో 1,869 ఖాళీలున్నాయి. ముఖ్యంగా 238 ప్రొఫెసర్లు, 781 అసోసియేట్ ప్రొఫెసర్లు, 850 అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల్ని భర్తీ చేయాల్సి ఉంది. ఒక్క ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే 1258 పోస్టులకు గానూ కేవలం 350 మంది రెగ్యులర్ బోధనా సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఇక కాకతీయ విశ్వవిద్యాలయంలో అయితే 409 మంజూరు పోస్టులు ఉండగా, కేవలం 86 మంది మాత్రమే బోధనా సిబ్బంది ఉన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయం, బాసర ఐఐటీలో అసలు అసోసియేట్ ప్రొఫెసర్లు లేరు. మొత్తంగా కేవలం 27 శాతం మంది సిబ్బందితోనే రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో బోధన సాగుతోంది.

గత ప్రభుత్వం ఈ ఉద్యోగ నియామకాల్ని వేగవంతం చేసేందుకు కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టింది. కానీ అప్పటి గవర్నర్ రాజకీయ వైరుధ్యాల కారణంగా బిల్లుకు మోకాలడ్డారు. తర్వాత అది రాష్ట్రపతి దగ్గరకి చేరినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం ఆ బిల్లుపై మీనమేషాలు లెక్కిస్తోంది తప్ప ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ ప్రభుత్వ విధానాల వల్ల విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు సిబ్బంది, కన్సల్టెంట్‌లతోనే విద్యా సంవత్సరాలు గడుస్తున్నాయి. దీనివల్ల రాష్ట్రంలోని ఉన్నత విద్యా ప్రమాణాలు ఘోరంగా దిగజారుతున్నాయి. ఇలా ఖాళీగా ఉన్న పోస్టుల్ని భర్తీ చేయకుండా ఇప్పటికే ఒత్తిడి ఎదుర్కొంటున్న ప్రొఫెసర్లపై మరింత భారం వేస్తున్నదీ ప్రభుత్వం. అందుకే పదవీ విరమణ వయసు పెంచిన ప్రభుత్వం ఇప్పటికే ఖాళీగా ఉన్న పోస్టుల్ని వెంటనే భర్తీ చేయాలి. దానివల్ల సహాయక అధ్యాపకులకు సరైన మార్గనిర్దేశకం అందించటంతో పాటు ఈ ఐదేళ్లలో పదోన్నతులు వస్తాయి. ఇప్పటికే పనిచేస్తున్న కాంట్రాక్టు, కన్సల్టెంట్ సిబ్బందికి ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు ఉన్నందువల్ల బోధన నాణ్యతకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ విధంగా మరో ఐదేళ్లు సర్వీసు ఉన్న అధ్యాపకుల స్థానంలో వీళ్ల సంఖ్య పెరగటం వల్ల ఈ సమస్యను పరిష్కరించవచ్చు. అందుకే ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఉన్న బోధనా సిబ్బంది ఖాళీల్ని వెంటనే భర్తీ చేయాలి.

– డాక్టర్ బీఎన్ రావు
(బీఎన్ రావు ఫౌండేషన్)

రైతు మనుగడకు ముంచుకొస్తున్న మరో ముప్పు

ప్రపంచమంతా కరోనా విజృంభణతో లాక్‌డౌన్‌లో ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం 2020, జూన్‌లో వ్యవసాయ రంగానికి సంబంధించిన మూడు ఆర్డినెన్సులను తీసుకువచ్చి, ఆ తరువాత వాటిని చట్టాలుగా మార్చడం తెలిసిన విషయమే. ఈ మూడు చట్టాలను భారత రైతాంగం పూర్తిగా వ్యతిరేకించి, చరిత్రలో కనీవిని ఎరుగని విధంగా దాదాపు 15 మాసాలు దేశ రాజధానిలో చేసిన దీక్షలు, ధర్నాల ఫలితంగా... చివరికి దేశ ప్రధాని రైతాంగానికి క్షమాపణ చెప్తూ ఈ మూడు చట్టాలను ఉపసంహరించుకున్నారు. ఆ సమయంలో ఆయన రైతాంగానికి కొన్ని నిర్దిష్టమైన హామీలను ఇచ్చారు. అందులో ముఖ్యమైనది కనీస మద్దతు ధరకి చట్టబద్ధత కల్పించడం. ఈ హామీ నేటికీ అమలు చేయకపోవడంతో భారత రైతాంగం తిరిగి పోరాట బాట పట్టింది. రైతాంగం నుంచి ఇంత వ్యతిరేకతతో కూడిన పోరాటాలు కొనసాగుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. పైగా జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్‌పిఎఫ్‌ఎఎం) ముసాయిదా రూపంలో మళ్లీ రద్దు చేసిన నల్ల చట్టాలలోని కొన్ని అంశాలను రైతులపై రుద్దే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం.

2024, నవంబర్ 24న భారత ప్రభుత్వం జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్‌పిఎఫ్‌ఎఎం) ముసాయిదాను విడుదల చేసి, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కోరింది. ఈ ముసాయిదాలోని కొన్ని అంశాలను క్షుణ్ణంగా విశ్లేషిస్తే, గతంలో రద్దయిన మూడు నల్ల చట్టాలలో రెండింటిని తిరిగి ఈ కొత్త మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దనున్నట్లు తెలుస్తుంది. భారత ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఈ విధానంపై రైతులు, రాష్ట్రాలు, నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇది రైతుల కోసం కాకుండా, పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించబడిన విధానమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ముసాయిదాలో ఉన్న రైతు వ్యతిరేక అంశాలు ఏమిటో చూద్దాం.

జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పి) చట్టబద్ధ హామీ ఇవ్వడంలో స్పష్టత లేకపోవడం రైతుల భద్రతకు ప్రధాన అడ్డంకిగా మారింది. అంతేకాక రైతుల ఆదాయ భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఎంఎస్‌పి రక్షణ లేకుండా రైతులు మార్కెట్‌లో ఉన్న అనిశ్చిత పరిస్థితులను అధిగమించడం చాలా కష్టం. ఇది చిన్న రైతులను ఇంకా అస్థిరతలోకి నెట్టివేస్తుంది. అంతేకాక, ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను పక్కన పెట్టి, వ్యవసాయ మార్కెటింగ్‌ను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రస్తుత వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వాల కీలక పాత్రను ఈ విధానం పూర్తిగా దెబ్బతీస్తుంది. ముఖ్యంగా, అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీస్ (ఏపిఎంసీ) వ్యవస్థను బలహీనపరచడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పక్షాన న్యాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొన్నాయి.

మరొక ముఖ్యమైన అంశం ఏమంటే, ఈ విధానం ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో అధిక ప్రాధాన్యత పొందే అవకాశం ఉంది. కాంట్రాక్ట్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తుంది. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయంపై పట్టు కోల్పోయి, కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఈ విధానం రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓ) ప్రధాన భాగస్వాములుగా చూపబడుతున్నప్పటికీ, కార్పొరేట్ సంస్థల కేంద్రీకృత నియంత్రణకు దోహదపడుతుంది. తద్వారా చిన్న రైతుల మనుగడ ప్రశ్నార్థకంగా మారి, వాళ్ళు మార్కెట్‌లో బలహీనపడే ప్రమాదం పొంచివుంది. ఈ విధానంలో ఉన్న గిడ్డంగుల ప్రైవేటీకరణ ద్వారా, రైతులు తమ ఉత్పత్తులను సకాలంలో నిల్వ చేసుకునే అవకాశాలను కోల్పోతారు. ధరల అస్థిరతలో రైతులకు భద్రత ఇవ్వాల్సిన పద్ధతులు పూర్తిగా ప్రైవేట్ కంపెనీల నియంత్రణలోకి వెళ్లడం వల్ల, రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరలు పొందలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విధానంలో మార్కెట్ నియంత్రణలను తొలగించడం ద్వారా, పెద్ద సంస్థలు మార్కెట్‌ను పూర్తిగా ఆధీనంలోకి తీసుకోవడమే కాకుండా, రైతులపై ఆర్థిక ఒత్తిడి పెంచే పరిస్థితిని సృష్టిస్తోంది. ముఖ్యంగా వ్యాపారులు అనైతిక వర్తక సంఘాలుగా ఏర్పడి, రైతుల ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేయడం, తద్వారా అధిక లాభాలను పొందడం లాంటివి జరిగే ప్రమాదం ఉంది.

> భారత రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి. దీని స్థానంలో రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తీసుకురావాలి.



జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానంలోని ఇలాంటి ప్రమాదకర అంశాల వల్ల రైతుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లే అవకాశం ఉంది. చిన్న రైతులు వ్యవసాయం నుంచి వైదొలగాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు. వారు తమ పంటలకు సరైన ధర పొందడంలో ఇంకా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మరొకవైపు, మార్కెటింగ్ వ్యవస్థలో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం మరింత పెరగడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అసమానతలను పెంచే అవకాశముంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న వ్యవసాయ మార్కెట్ వ్యవస్థకి సంబంధించిన అంశాలపైన కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇలాంటి విధానాలు తీసుకురావటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. గతంలో ఎపిఎంసీ చట్టం–2002 సవరణ చేయవలసి వచ్చినప్పుడు ఆనాటి కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల నుంచి శాసనసభ తీర్మానాలు తీసుకున్న తరువాత అమలులోకి తెచ్చేది. అలాంటి సంప్రదాయాలను నేటి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.


భారత రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి. దీని స్థానంలో రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తీసుకురావాల్సిన అవసరం ఉన్నది. ఈ సమగ్ర విధానాలలో భాగంగా, కనీస మద్దతు ధరకు చట్టబద్ధతని కల్పించటం, మద్దతు ధర లెక్కింపులో డా. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సు చేసినట్టుగా కాస్ట్–3 పైన 50శాతం మద్దతు ధరను ప్రకటించడం, ప్రస్తుతం ఉన్న ఎపిఎంసీలలో ఆధునిక సదుపాయాలు కల్పించి బలోపేతం చేయడం, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న గిడ్డంగులను ఆధునీకరించడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం, ఎఫ్‌పిఓలను బలోపేతం చేయడం, మార్కెట్ రిస్క్ నుంచి రైతులను కాపాడడం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ కొత్త వ్యవసాయ మార్కెటింగ్ విధానం రైతుల హక్కులకు ముప్పుగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం సరైన మార్పులు చేసి, ఈ విధానాన్ని సమతుల్యం చేయాలి. రైతులు భవిష్యత్తులో బలహీనం కాకుండా, వారు తమ హక్కులను సాధించేందుకు అది సమర్థంగా ఉండాలి.

• ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
గురువారం 13 ఫిబ్రవరి 2025





దిష్టి తోరణం కింద బెల్లం సాకం ఆరబోస్తున్న పూజారులు

మండమెలిగె.. మది మురిసే..

మేడారంలో ఘనంగా మినీ జాతర ప్రారంభం

భక్తజన సందోహంతో మేడారం కిటకిటలాడింది. మినీ జాతర ప్రారంభం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మండమెలిగె పండుగ సందర్భంగా పూజారులు మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మల మందిరాన్ని మహిళలు శుద్ధి చేసి తల్లుల ఆది స్థానాలను అలుకుపూతలు చేసి ముగ్గులు వేశారు. వనదేవతల అంతర్గత మందిరాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోలు వాయిద్యాల నడుమ గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలు ఏర్పాటు చేసి దిష్టితోరణాలు కట్టారు. అందులో కోడిపిల్ల, సొరకాయను కట్టారు. ఈ సందర్భంగా భక్తులు పోటెత్తారు. సమ్మక్క - సారలమ్మలను, గోవిందరాజులు, పగిడిద్దరాజులను తాకేందుకు పోటీపడ్డారు. తొలుత జంపన్నవాగులో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు ఆచరించి.. ఆపై ఎత్తు బంగారంతో పాటు పసుపు, కుంకుమ, చీర సారెలను అమ్మవార్లకు సమర్పించారు. జంతు బలులు ఇచ్చి అడవిలో విందారగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కోలాహలం కనిపించింది. సుమారు 2.5 లక్షల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు అంచనాలు వేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.

- తాడ్వాయి (ఆంధ్రజ్యోతి)



జంపన్నవాగులో పుణ్యస్నానం చేస్తున్న యువతి

- అంతర్గత పూజలు చేసిన పూజారులు
- కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం
- సుమారు 2.5 లక్షల మంది భక్తుల రాక
- సందడిగా మారిన వనదేవతల సన్నిధి

7



మేడారంలోని సమ్మక్క ఆలయం నుంచి పూజా సామగ్రిని గద్దెల వద్దకు తీసుకెళుతున్న ప్రధాన పూజారి కొక్కెర కృష్ణయ్య, ఇతర పూజారులు



అమ్మవార్లకు ఎత్తు బంగారం తీసుకెళుతున్న భక్తురాలు



ఆకేరు వాగు పరివాహకంలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

- ల్యాబర్తిలో ఇసుక తవ్వకాలపై సీపీ అంబర్ కిషోర్ ఆగ్రహం
- అవసరమైతే పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తాం..
- ఆకేరు వాగు పరివాహక ప్రాంతాల్లో పర్యటన

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని దెబ్బతీసేలా, భూగర్భ జలాలకు ముప్పు వాటిల్లేలా చేస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలపై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆగ్రహం వ్యక్తం చేశారు.అక్రమ ఇసుక రవాణా ఆపకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం మండలంలోని ల్యాబర్తి గ్రామం మీదుగా వెళ్లే ఆకేరు వాగు పరివాహక ప్రాంతాలను సీపీ పరిశీలించారు. అక్రమంగా అసైన్డ్ భూముల్లో వాగు శిఖం భూముల్లో తవ్వుతున్న మట్టి, ఇసుక తవ్వకాలను నేరుగా పరిశీలించారు. ఆకేరు వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుంటే స్థానికంగా ఉన్న పోలీసులు చర్యలు తీసుకోవడంలో ఎలాంటి పద్ధతులు అనుసరిస్తున్నారో తెలుసుకున్నారు. ఇక్కడి ఇసుకను వరంగల్ నగరానికి తీసుకెళ్లి అమ్ముతున్నారనే విషయాన్ని తెలుసుకుని, వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారిపై వెళ్తున్న క్రమంలో ఆయా పోలీస్ స్టేషన్ల ఆఫీసర్లు ఏం చేస్తున్నారని, ఎందుకు నేరుగా వరంగల్‌నగరానికి చేరుతున్నాయంటూ ప్రశ్నించారు? ఐనవోలు, మామునూరు, మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్ల పరిధి దాటి అమ్మకానికి వెళ్తున్న ట్రాక్టర్లపై నిఘా పెంచుతామన్నారు. అనంతరం సీపీ మీడియాతో మాట్లాడుతూ.. అక్రమ ఇసుక తవ్వకాలను, రవాణాను అరికట్టేందుకు కఠిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అవసర మైతే పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేసి శాశ్వతంగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు. దీనిపై మైనింగ్, రెవెన్యూ అధికారులతో సైతంమాట్లాడతామన్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచుతామని సీపీ చెప్పారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ చందన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలను అర్బన్ నక్సలైట్స్‌గా మార్చారు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలను రాష్ట్ర ప్రభుత్వం అర్బన్ నక్సలైట్స్‌గా మార్చేసిందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం హంటర్‌రోడ్డు దీన్‌దయాళ్‌నగర్ కాలనీలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకు రాష్ట్రంలో జరుగుతున్న గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికతో పాటు రెండు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు మేధావులకు దొరికిన మంచి అవకాశమన్నారు. పీఆర్‌సీ దేవుడెరుగు.. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను ఇప్పటి వరకు విడుదల చేయకుండా ఉద్యోగులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా మూతపడే స్థితికి వచ్చాయన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు రావాల్సిన రూ.7వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడంతో ఆత్మహత్యలే శరణ్యమని ప్రైవేట్ యజమాన్యాలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నాయన్నారు. అధికారం కోసం ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చి ఏ ఒక్క వర్గానికి న్యాయం చేయలేదని, పూర్తిగా వైఫల్యం చెందిన ఈ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టుగా ఉండాలని ఓటర్లను కోరారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. వేతన జీవులకు బీజేపీ ప్రభుత్వం ఆదాయపు పన్ను విషయంలో రూ.12లక్షల వరకు మినహాయింపు ఇచ్చి భారీ ఊరటను కల్గించిందన్నారు. రాష్ట్రంలోని 75 అసెంబ్లీ స్థానాల్లో జరగబోతున్న మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వరంగల్- నల్లగొండ - ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న పులి సరోత్తంరెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా నిజాయితీగా సేవలందించారని కొనియాడారు. నియోజకవర్గంలో 25,000 మంది ఓటర్లు ఉంటే.. అందులో సుమారు 11,000 మంది ఓటర్లు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందినవారే ఉన్నారన్నారు. సరోత్తంరెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వ్యక్తి అయినందున.. ఇక్కడి ఓటర్లు సరోత్తం రెడ్డిని అక్కున చేర్చుకొని ఆదరించాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ ఈరెల్లి చంద్రశేఖర్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రమేశ్, జిల్లా నాయకుడు ఆర్పీ జయంత్‌లాల్, కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

మెస్ నిర్వహణపై విద్యార్థుల ఆగ్రహం



ఆందోళన చేస్తున్న విద్యార్థులను సముదాయిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, డైరెక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్

- కేయూ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన
- రెండు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తాం..
- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం హామీ

6

పూడికతీత.. సాగదీత..

- ఇంకా మొదలుకాని భద్రకాళి చెరువు మట్టి తొలగింపు పనులు
- ముందుకు రాని మట్టి కొనుగోలుదారులు
- రేటు తగ్గించి మరోసారి పిలిచే యోచన
- జాప్యంపై ఎమ్మెల్యే నాయిని అసంతృప్తి
- మరో పక్షం రోజుల్లో పనులు మొదలయ్యే అవకాశం



నీటిని ఖాళీ చేయడంతో ఎండిపోయి కనిపిస్తున్న భద్రకాళి చెరువు

హనుమకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువులో పూడికతీత పనులు ఇంకా మొదలు కాలేదు. వర్షాలు కురిస్తే ఆ తర్వాత పూడిక తీయడం సాధ్యం కాదు. చెరువులోని మట్టినంతా తొలగించాలంటే మూడు నాలుగు నెలలైనా పడుతుంది. చెరువులోని మట్టిని తొలగించడానికి నీటిపారుదల శాఖ మీనమేషాలు లెక్కపెడుతోంది. బహిరంగ విక్రయం పేరుతో కాలయాపన చేస్తోంది.

ముందుకురాని కొనుగోలుదారులు

382 ఎకరాల విస్తీర్ణం కలిగిన భద్రకాళి చెరువులో 18 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి ఉంది. దీనిని తొలగించడానికి నీటి పారుదల శాఖ ఇప్పటికే ఒకసారి బహిరంగ ప్రకటన చేసింది. చెరువులోని మట్టి విలువను మొత్తంగా రూ.9.50 కోట్లుగా లెక్కకట్టారు. క్యూబిక్ మీటర్‌కు ధర రూ.162.56గా ధర నిర్ణయించారు. చెరువు మొత్తాన్ని మూడు బ్లాక్‌లుగా విభజించారు. మొదటిసారి పిలిచినా కొనుగోలుదారుల నుంచి స్పందన రాలేదు. మట్టి ధర ఎక్కువగా ఉండడంతో టెండర్లలో పాల్గొనడానికి వెనుకంజ వేశారు. దీంతో నీటి పారుదల శాఖ రెండోసారి బహిరంగ ప్రకటన చేయనున్నది. ఈసారి క్యూబిక్ మీటరు మట్టి ధరను సగానికి సగం తగ్గించి సుమారు రూ.70.80గా నిర్ణయించనున్నట్టు తెలుస్తోంది.

ఉచితంగా ఇవ్వాలి..

భద్రకాళి చెరువులో నుంచి నీటిని ఖాళీ చేస్తున్నప్పుడే ఇటుక బట్టీ యజమానులు కలెక్టర్‌ను, నీటిపారుదల శాఖ అధికారులను కలిసి మట్టిని ఉచితంగా ఇవ్వాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు. కలెక్టర్ అధ్యక్షతన గల భద్రకాళి చెరువు అభివృద్ధి కమిటీ ఇందుకు ఒప్పుకోకపోగా మట్టి విక్రయానికి బహిరంగ ప్రకటన చేయాలని నిర్ణయించింది. గత నెల మొదటిసారి పిలిచిన ప్రకటనకు కొనుగోలుదారులు ఎవరూ ముందుకు రాలేదు. రెండోసారి ఇదే పరిస్థితి ఎదురైతే ఏం చేయాలనే విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు తర్జన పడుతున్నారు. మట్టిధర తగ్గినందు వల్ల మట్టి కొనుగోలుకు పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు రావొచ్చని ఆశిస్తున్నారు. ఒక వేళ స్పందన లేక పోతే ఈ విషయాన్ని చెరువు అభివృద్ధి కమిటీ ముందు పెట్టి నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు. ఈ తతంగం పూర్తి కావడానికి పక్షం రోజులు పట్టవచ్చునని, ఆతర్వాతే పూడికతీత మొదలవుతుందని అధికారులు చెబుతున్నారు.

ఇంకా తడిగానే..

భద్రకాళి చెరువులోని నీరంతా పోయి రెండు నెలలవుతున్నా మట్టి ఇంకా ఆరలేదు. అడుగుభాగాన ఇంకా తడిగానే ఉంది. పూడికతీత ఆలస్యానికి ఇది కూడా ఒక కారణం. చెరువు పూర్తిగా ఎండడానికి ఇంకో పదిహేను రోజులు పట్టవచ్చు. ఎక్స్‌వేటర్ల ద్వారా చెరువులోని మట్టిని తీసే బాధ్యతను నీటిపారుదల శాఖే తీసుకోనున్నది. కొనుగోలు దారులు టిప్పర్లు, లేదా ట్రాక్టర్లను సమకూర్చుకొని మట్టిని తరలించుకోవలసి ఉంటుంది. మట్టిని తరలించేందుకు చెరువు నుంచి బయట ప్రధాన రోడ్డు వరకు ప్రస్తుతం రెండు దారులను ఎంపిక చేశారు. ఇందులో ఒకటి హనుమకొండ సిద్ధేశ్వరాలయం సమీపంలో గుట్ట పక్క నుంచి ఒక దారికాగా, చెరువు మత్తడి వద్ద నుంచి మరో దారి. అవసరమైతే మరో రెండు దారులను సిద్ధం చేయనున్నారు. పొలాల్లో వాడుకోవడానికి రైతులు సైతం చెరువు మట్టిని తోడుకొని వేళ్లే అవకాశాలు ఉన్నాయి. అయితే వీరికి ఉచితంగానే మట్టిని ఇవ్వనున్నారు.

ఎమ్మెల్యే నాయిని అసంతృప్తి

పూడికతీతలో జాప్యం జరుగుతుండడంపై వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. పూడికతీత విషయమై ఆయన సోమవారం హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ, కాకతీయ పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. పూడికతీత పనులపై ఆరా తీశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. దీనితో నీటిపారుదల శాఖ అధికారులు రెండోసారి టెండర్లు పిలుస్తున్నారు,

హత్యాయత్నం కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష

లింగాలఘణపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : దేవరుప్పుల మండలం రామచంద్రగూడెంకు చెందిన కైరిక ఆంజనేయులుపై హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటుగా రూ.5వేల జరిమానా విధిస్తూ బుధవారం జనగామ అసిస్టెంట్ సెషన్ జడ్జి సుచరిత తీర్పును వెలువరించారు. లింగాలఘణపురం ఎస్సై శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... దేవరుప్పుల మండలం రామచంద్రగూడెంకు చెందిన కైరిక ఆంజనేయులుకు అదే గ్రామానికి చెందిన కైరిక భాస్కర్, కైరిక నాగన్నలకు చిట్టి డబ్బుల మధ్య వర్తిత్వం విషయమై వాగ్వాదం జరిగింది. దీంతో ఆంజనేయులును హతమార్చాలని భాస్కర్, నాగన్నలు పథకం రచించారు. 2019 సెప్టెంబరు 27న ఆంజనేయులు జనగామ నుంచి రామచంద్రగూడెం వెళ్తుండగా మార్గమధ్యలో లింగాలఘణపురం మండలం కుందారం వద్ద హత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సంతోషం రవీందర్ కేసు నమోదు చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పర్చారు. కాగా, బుధవారం జనగామ కోర్టులో ఇద్దరి నిందితులు భాస్కర్, నాగన్నలను దోషులుగా తేల్చుతూ మూడేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్ జడ్జి తీర్పును వెలువరించారు. కోర్టు కానిస్టేబుల్ నరేశ్ సాక్షులను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టారు.

సైబర్ ఉచ్చులో మండల స్థాయి అధికారి

- ఏసీబీ అధికారులమంటూ బెదిరింపులు
- డబ్బులు చెల్లించాలని డిమాండ్.. సంగెంలో ఘటన

సంగెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సైబర్ ఉచ్చులో మండల స్థాయి ఓ అధికారి బలైన సంఘటన మండలంలో జరిగింది. బుధవారం ఉదయం సంగెం మండలంలో పనిచేస్తున్న ఓ అధికారికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాము ఏసీబీ అధికారులమని, మీ గురించి మాకు సమాచారం ఉందని, అడిగిన డబ్బు చెల్లించాలంటూ ఫోన్ ద్వారా బెదిరింపులు పాల్పడ్డారు. ఆ అధికారి విధిలేని పరిస్థితిలో సదరు సైబర్ మోసగాడికి సుమారు రూ.80వేలు ఆన్‌లైన్ ద్వారా చెలించినట్లు తెలిసింది. అనంతరం తాను మోసపోయానని గ్రహించిన సదరు అధికారి.. వెంటనే 1930కు ఫిర్యాదు చేయడంతో పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మండలంలో హల్‌చల్

సంగెం మండలంలో పనిచేస్తున్న పలువురు అధికారులకు బుధవారం ఉదయం ఫోన్లు చేసి తాము రాష్ట్రస్థాయి ఏసీబీ అధికారులమంటూ.. మీ సంగతి మాకు తెలుసు.. మాకు డబ్బులు ఇవ్వాల్సిందేనంటూ బెదిరింపులు చేసినట్లు తెలిసింది. అదేవిధంగా మండలంలోని ఆన్‌లైన్ షాపు నిర్వాహకుడికి ఫోన్ చేసి మీ మండలంలో ఏసీబీ దాడులు జరిగిన సంగతి తెలుసా..? మండలంలో పనిచేస్తున్న అధికారుల ఫోన్ నంబర్లు కావలంటూ అడిగినట్లు అతడు తెలిపాడు. మండలంలో హల్‌చల్‌గా మారిన సంఘటనలపై మండల అధికారులతో పాటు పలువురు భయపడుతున్నారు.

ఆహార పదార్థాలు నిల్వ ఉంచి విక్రయాలు

- రూ.20వేల జరిమానా విధించిన అధికారులు



రెడ్‌బకెట్ నిర్వాహకులకు జరిమానా విధిస్తున్న అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఫోర్టురోడ్డులోని రెడ్‌బకెట్ బిర్యానీ పాయింట్‌లో చాలా కాలంగా నిలువ చేసి విక్రయిస్తున్న ఆహార పదార్థాలను బుధవారం బల్దియా అధికారులు గుర్తించారు. స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు బల్దియా శానిటేషన్ విభాగం సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి ఆదేశాలతో తనిఖీలు చేయగా ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన మటన్, చికెన్ వంటకాలతో పాటు ఇతర పదార్థాలను గుర్తించి నట్లు ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నూరి శ్యాం రాజ్ వెల్లడించారు. ఇంకా అపరిశుభ్ర పరిస్థితిలో నిర్వహణ ఉందని వెల్లడిం చారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు నిర్వాకులకు రూ.20 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మరోసారి పునరావృత్తం అయితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్లాస్టిక్ వస్తువులు కూడా వాడుతున్నట్టు సిబ్బంది గుర్తించారు. ఈ తనిఖీల్లో హెల్త్ అసిస్టెంట్లు నరేశ్, శివకుమార్, సిబ్బంది ఉన్నారు.

మెస్ నిర్వహణపై విద్యార్థుల ఆగ్రహం

- కేయూ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన
- రెండు నెలల్లో సమస్యలను పరిష్కరిస్తాం..
- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం హామీ



కామన్ మెస్ ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులు మెస్ సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళనకు దిగారు. బుధవారం మధ్యాహ్నం కామన్ మెస్‌లో భోజనం చేసే క్రమంలో కొందరు విద్యార్థులు మెస్ మెయిన్ గేటు వద్ద బైఠాయించారు. మెస్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ నిరసనకుదిగారు. వర్సిటీ అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తమకు కామన్ మెస్‌లో నాణ్యమైన అల్పాహారంతో పాటు భోజనం, కూరలు, మజ్జిగ నాసిరకంగా ఉన్నాయని ఆరోపించారు. వర్సిటీ అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. కామన్ మెస్‌లో పారిశుద్ధ్యం లోపించిందని, దుర్గంధం వస్తోందని పేర్కొన్నారు. ఒకే దఫా ఎక్కువమంది విద్యార్థులు కూర్చొని మెస్‌లో భోజనం చేయలేకపోతున్నామని చెప్పారు. ఫ్యాన్లు తిరగడం లేదని వివరించారు.

కాగా, విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, డీవో ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డితో పాటు జాయింట్ డైరెక్టర్లు డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, ఇతర హాస్టల్ సిబ్బంది విద్యార్థుల వద్దకు చేరుకున్నారు. వారి సమస్యలను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం అడిగి తెలుసుకున్నారు. తమకు న్యూబాయ్స్ పీజీ హాస్టల్‌లో అసంపూర్తిగా ఉన్న మెస్ హాల్ పనులు త్వరితగతిన చేపట్టిన అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. బాయ్స్ హాస్టల్‌లో తక్కువ మందికి మెస్‌హాల్ నిర్మాణం జరిగిందని, అయితే విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం పెరిగిందని చెప్పారు. పెరిగిన విద్యార్థులకు అనుగుణంగా మెస్ హాల్ నిర్మిస్తామని, రెండు నెలల సమయం పడుతుందని విద్యార్థులకు చెప్పారు. మెస్‌లో నాణ్యమైన అల్పాహారం, భోజనం లేదని విన్నవించారు. నాసిరకం బియ్యంతో పాటు వంటకాలు బాగుంటడం లేదన్నారు. బియ్యం స్టాక్ మారుస్తామని స్పష్టం చేశారు. వంటకాలు నాణ్యతతో రుచికరంగా చేయిస్తామని, విద్యార్థులు ఇబ్బందులు పడొద్దని కోరారు. అయినా విద్యార్థులు తమ సమస్య లు పరిష్కరించలంటూ కేయూ మొదటి గేటు వద్దకు చేరారు. కొద్దిసేపు అక్కడ బైఠాయించి నిరసన చేపట్టారు. చివరకు అధికారుల హామీతో నిరసన ఆందోళనలను విరమించారు. పోలీసులు వర్సిటీలో విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో వర్సిటీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎస్సైతో పాటు సిబ్బంది విద్యార్థులను సముదాయించారు.

కామన్ మెస్ సిబ్బందికి హెచ్చరికలు

కామన్ మెస్ సిబ్బందిని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం హెచ్చరించారు. బుధవారం సాయంత్రం రిజిస్ట్రార్ చాంబర్‌లో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మెస్ కేర్ టేకర్లు, కుక్స్, ఇతర సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. ఇకనుంచి హాస్టల్ విద్యార్థులు మెస్‌లో భోజనం బాగోలేదని, ఇతర సౌకర్యాల్లేవని ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. వంటకాలు రుచిగా ఉండాలని పేర్కొన్నారు. తాను స్వయంగా వంటకాలను పరిశీలిస్తానని, విద్యార్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని అన్నారు.

భారీగా గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కమిషనరేట్ పరిధిలో విక్రయిస్తున్న ప్రభుత్వ నిషేధిత గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. హనుమకొండ పీఎస్ పరిధిలో కుమార్‌పల్లికి చెందిన ఎం.డి. హబీబుద్దీన్ అహ్మద్ ఇంట్లో సీఐ శ్రీధర్ బృందం తనిఖీలుచేసి రూ.1,15,000 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకుందన్నారు. మిల్స్‌కాలనీ పీఎస్ పరిధిలో సీఐ రంజిత్ బృందం కరీమాబాద్‌కు చెందిన తాళ్ల మురళి విష్ణు ఇంట్లో సోదాలు చేసి రూ.13,170 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకుందన్నారు. కాజీపేట పీఎస్ పరిధిలో సీఐ బాబులాల్ బాపూజీనగర్‌లోని చుంచు వెంకశ్వర్లు ఇంట్లో సోదాలు చేసి రూ.32,500 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

గిర్మాజీపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్ చింతల్‌వైపు సిగ్నల్ స్టార్టింగ్ పాయింట్ వద్ద మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి (47) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు, ఛామన ఛాయ శరీరం, పొట్ట కుడివైపు పుట్టుమచ్చ ఉన్నాయని, బూడిద రంగు ప్యాంటు, బ్లాక్ కలర్ బెల్ట్, ఎరుపు, అడ్డ నిలువు గీతలతో ఫుల్ షర్టు ధరించి ఉన్నాడని, మెడలో నల్లని దారంతో ఆకుపచ్చ తాయత్తు ఉందని వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. తల మొండెం విడిపోయాయని, మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామని తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, ముస్లిం వ్యక్తిగా అనుమానిస్తున్నామని, బంధువులు, కుటుంబసభ్యులు ఎవరైనా ఉంటే 8712658585, 9701747014 నంబర్లలో సంప్రదించాలని సీఐ కోరారు.

హత్య కేసులో లొంగిపోయిన నిందితుడు

- వివరాలు వెల్లడించిన ఈస్ట్‌జోన్ డీసీపీ



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్

పరకాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : 2023లో నమోదైన ఓ హత్య కేసులో నిందితుడు పోలీసుల ఎదుట బుధవారం లొంగిపోయాడు. వివరాలను ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, పరకాల ఏసీపీ సతీష్‌బాబు వెల్లడించారు. 2023 ఫిబ్రవరి 6వ తేదీన శాయంపేట మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన వాడికాల బొందమ్మ మృతదేహం నడికూడ మండలం ధర్మారం గ్రామ శివారులో అనుమానాస్పద స్థితిలో పడి ఉంది. గుర్తు తెలియని మృతదేహం లభించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు ఈ కేసును పరకాల, శాయంపేట సీఐలకు అప్పగించగా ప్రత్యేక చొరవతో టీములుగా ఏర్పడి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు వెతుకుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆరెపల్లి గ్రామానికి చెందిన నిందితుడు ఇంటి రాజిరెడ్డి పరకాల పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. నిందితుడిని విచారించగా మృతురాలికి చెందిన పది గుంటల భూమి పంపకం విషయంలో కుమారులు, కూతుళ్లకు మధ్య పంచాయితీ జరుగగా పెద్దమనిషిగా రాజిరెడ్డి వ్యవహరించినట్లు పేర్కొన్నారు. ఆ భూమి కుమార్తెలకు చెందకుండా కుమారులకు సపోర్టు చేస్తున్న రాజిరెడ్డిని మృతురాలు తిట్టడంతో ఎలాగైనా చంపాలనే ఉద్దేశంతో ఎవరూ లేని సమయంలో బొందమ్మను కొట్టడంతో మృతి చెందింది. ఆమె ఒంటిపై ఉన్న రెండు బంగారు గాజులు, మెడలోని బంగారు గొలుసు, కమ్మలు తీసుకొని మృతదేహాన్ని నిర్జన ప్రదేశంలో పడేద్దామని బెడ్‌షీట్‌లో చుట్టి కారు వెనుక సీటులో కూర్చుండబెట్టుకొని వెళుతుండగా రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో వేములవాడకు వెళ్లిపోయాడు. అక్కడి నుంచి మళ్లీ హుజూరాబాద్, నడికూడ వైపు నుంచి ధర్మారం గ్రామానికి చేరుకొని ధర్మారం శివారులోని కెనాల్ కాలువ పక్కన వ్యవసాయ భూమిలో మృతదేహాన్ని వేశాడు. బంగారం కోసమే ఆమెను హత్య చేసినట్లుగా ఉండాలనే ఉద్దేశంతో ఆమె ముఖంపై బండరాయితో మోది గుర్తు పట్టకుండా కొట్టినట్లు డీసీపీ వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి రెండు బంగారు ఉంగరాలు, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రత్యేక చొరవ చూపిన పరకాల, శాయంపేట సీఐలు క్రాంతికుమార్, రంజిత్‌రావులతోపాటు ఎస్‌ఐలను డీసీపీ అభినందించి రివార్డు అందజేశారు.

తెలంగాణలో బర్డ్ ఫ్లూ లేదు..

- నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

మిల్స్‌కాలనీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ లేదని నెక్ వరంగల్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ప్రకటించారు. బుధవారం ఓసిటీలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని, ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్లు స్పష్టంచేశారని అన్నారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ రాదన్నారు. గుడ్డు, చికెన్ తినడం వల్ల బర్డ్‌ఫ్లూ రాదని ఒకవేళ వస్తే వారికి రూ.కోటి ఇస్తామని గతంలోనే పౌల్ట్రీ రంగం ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రజలెవరూ ఈవిషయంలో భయపడవద్దని సూచించారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : సీపీ



2కే రన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న సీపీ, మున్సిపల్ కమిషనర్

మట్టెవాడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. బుధవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్ నుంచి కాకతీయ మెడికల్ కళాశాల వరకు నిర్వహించిన 2కే రన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత సరదా కోసం డ్రగ్స్ అలవాటు చేసుకొని బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ సేవిస్తే మానసికంగా శారీరకంగా అనేక సమస్యలు వస్తాయన్నారు. మాదకద్రవ్యాల నివారణ కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. డ్రగ్స్ వినియోగించినా, సరఫరా చేసినా శిక్ష పడుతుందన్నారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని పురుషోత్తం, నాయకులు తోకల అనిల్‌కుమార్, మెరుగు చంద్రమోహన్, కందికొండ మోహన్, ఏసీపీ నందిరాంనాయక్, వరంగల్ తహసీల్దారు ఎం.డి.ఇక్బాల్, కేఎంసీ ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, నార్కోటిక్ సీఐ రవిందర్, జర్నలిస్టు యూనియన్ నాయకులు నాగపురి నాగరాజు, రావుల నరేష్, కుమారస్వామి, లింగబత్తిని కృష్ణ, కందికొండ గంగరాజు, శ్రీనాథ్, అవినాష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ జయంతిని జయప్రదం చేయాలి

- గోర్ సభ జాతీయ అధ్యక్షుడు జైసింగ్ రాథోడ్



గిరిజన భవన్ వద్ద సమావేశంలో మాట్లాడుతున్న జైసింగ్ రాథోడ్

వడ్డెపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బంజారాల ఆరాధ్య దైవం భారత సమాజాన్ని ఆధ్యాత్మికం వైపు ప్రభావితం చేసిన సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని జయప్రదం చేయాలని గోర్‌సభ జాతీయ అధ్యక్షుడు జైసింగ్ రాథోడ్ బంజారాలకు పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ అంబేద్కర్ భవన్ రోడ్డులోని గిరిజన భవన్‌లో ఉత్సవ కమిటీ కన్వీనర్ భానోత్ నవీన్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఈ నెల 15న హనుమకొండలోని గిరిజన భవన్‌లో జరుగుతుందని అన్నారు. తొలుత ఉదయం 9 గంటలకు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి గిరిజన భవన్ వరకు సద్భావన మహా ర్యాలీ బంజారాల ఆట పాటలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని బోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహించి సేవాలాల్ చిత్రపటానికి పూలమాలాంకృతం చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ఈ జయంతి వేడుకల్లో హనుమకొండ, వరంగల్ జిల్లాలలోని బంజారాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జైసింగ్ రాథోడ్ కోరారు.

కార్యక్రమంలో హనుమకొండ, కాజీపేట తహసీల్దార్లు కె.శ్రీపాల్‌రెడ్డి, బావుసింగ్, సేవాలాల్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పోరిక ఈశ్వర్‌సింగ్ నాయక్, చినబాబు నాయక్, ధరావత్ రాంచంద్రు నాయక్, ఉదయ్ సింగ్‌నాయక్, డీటీడబ్ల్యూవో అధికారులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కేడీసీలో గెస్ట్ లెక్చరర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) కళాశాలలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 మార్కులు సాధించిన, నెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పిస్తామని వెల్లడించారు. ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు ఈనెల 15 వరకు కేడీసీలో దరఖాస్తులు అందచేయాలని, 17న ఇంటర్వ్యూలు కళాశాలలో ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్వ్యూలకు నిజ ధృవపత్రాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా జి.రెడ్డి బాధ్యతల స్వీకరణ



వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి 12: (ఆంధ్రజ్యోతి): ఏనుమాముల(వరంగల్) వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శిగా జి.రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఏనుమాముల మార్కెట్ కమిటీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం మార్కెటింగ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మార్కెట్ అధికారులు, సిబ్బంది, వ్యాపారులు, కార్మికులు జి.రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

ఆస్తి పంచివ్వలేదని..

- అన్నా, చెల్లె పంచాయితీ
- ఆగిన తండ్రి దహన సంస్కారాలు
- మూడురోజుల నుంచి ఫ్రీజర్‌లోనే మృతదేహం
- కొడకండ్ల మండలం ఏడునూతులలో ఘటన



ఫ్రీజర్‌లో ఉన్న యాదగిరి మృతదేహం

కొడకండ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రోజులు మారుతున్నాయి.. ఆప్యాయతలు తగ్గుతున్నాయి.. మనుషుల్లో మానవత్వం కరువవుతోంది. మనిషన్నవాడే మాయమవుతున్నాడు.. కనికరం లేని కన్నపిల్లలు.. కన్నతండ్రి శవాన్ని కాడికి తీసుకుపోలేని పరిస్థితులు దాపురిస్తున్నాయి. చనిపోయి 3 రోజులవుతున్నా అన్నా చెల్లె మధ్య ఆస్తి తగాదాతో తండ్రి దహన సంస్కారాలు చేయకుండా ఆపిన ఘటన కొడకండ్ల మండలంలోని ఏడునూతులలో తీవ్ర కలకలం సృష్టించింది. ఏడునూతులకు చెందిన ఎలికట్టె యాదగిరి(60)కి ఇద్దరు భార్యలు రేణుక, పద్మ. పెద్ద భార్యకు ఒక కుమారుడు రమేష్, రెండో భార్యకు ఒక కుమారుడు ఉపేందర్, ఒక కూతురు శోభారాణిలు ఉన్నారు. యాదగిరికి ఉన్న 15 ఎకరాల భూమిలో 5 ఎకరాలు రమేశ్‌కు, 5 ఎకరాలు ఉపేందర్‌కు పంచి విగతా 5 ఎకరాలు తమ వద్దే ఉంచుకున్నారు. ఈ రిజిస్ట్రేషన్ సమయంలో ఉపేందర్ మైనర్ కావడంతో ఆయన తల్లి పద్మ పేరుపై ఉపేందర్ భాగం భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. తండ్రి పేరుతో ఉన్న 5 ఎకరాల భూమిలో 3 ఎకరాలు అమ్మి కూతురు వివాహం చేసి 2 ఎకరాలు కట్నంగా కూతు రు పేరుపై రిజిస్ట్రేషన్ చేశారు. మూడేళ్ల క్రితం చిన్నభార్య కుమారుడైన ఉపేందర్ మృతి చెందాడు. ఆయనకు పంచిన భూమి ఆయన తల్లి పద్మ పేరుతోనే ఉండటంతో 3 ఎకరాలను పద్మ అమ్మి కూతురు శోభారాణికి హైదరాబాద్‌లో ఇల్లు కొనిచ్చింది. ఈ క్రమంలో యాదగిరికి పక్షవాతం రావడంతో గత రెండు సంవత్సరాలుగా కూతురు దగ్గరే హైదరాబాద్‌లో ఉంటున్నాడు. అనారోగ్య కారణాలతో 3 రోజుల క్రితం యాదగిరి మృతి చెందగా స్వస్థలమైన ఏడునూతులకు మృతదేహాన్ని సోమవారం ఉదయం తీసుకువచ్చారు. ఆ మిగిలిన 2 ఎకరాలను తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని పెద్దభార్య కుమారుడు రమేశ్ భీష్మించుకుని కూర్చోవడంతో దహన సంస్కారాలు ఆగిపోయాయి. ఎన్ని రోజులు శవం ఇంటిముందున్నా మేము భూమి ఇవ్వమని పద్మ, ఆమె కూతురు శోభారాణి అంటుండగా ఇప్పటికే 8 ఎకరాలు కూతురుకే ఇచ్చింది.. కనుక విగతా భూమైనా తనకు ఇస్తేనే దహన సంస్కారాలు చేస్తానని రమేశ్ అంటున్నాడు. దాంతో యాదగిరి మృతదేహం అనాథ శవంలా ఫ్రీజర్‌లోనే 3 రోజల నుంచి ఉండిపోవడంతో గ్రామమంతా విషాదఛాయలు నెలకొన్నాయి.

ఊరంతా బాధపడతున్నా కడుపులో పుట్టిన కొడుకు, కూతురు మాత్రం ఎన్నిరోజులు అలా ఉన్న పర్లేదు అన్నట్లు ప్రవర్తిస్తుండడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దమనుషులు మాట్లాడడంతో పద్మ రిజిస్ట్రేషన్ చేయడానికి ఒప్పుకున్నా గురువారం భూమి రిజిస్ట్రేషన్ అయ్యాకే దహన సంస్కారాలు చేయడానికి నిర్ణయించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2109	2100
పల్లికాయ (సూక)	6300	4600
పల్లికాయ (పచ్చిది)	4700	3100
కందులు	7083	5540
పెసళ్లు	6682	5645
పత్తి	6950	5800
పసుపు (కాడి)	7677	6425
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13300	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	14700	11500
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	13550	11500
దేశీ ఏసీ	25011	22500
దీపిక	16110	15245
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం


శ్రీతేజ్


జి. రమేష్


జి. తరుణ్


ఎన్. హన్సిక


అన్వర్‌పాషా

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శివాని విశ్వరూపం

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో హనుమకొండలోని శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించి విశ్వరూపం ప్రదర్శించారని కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి, ప్రిన్సిపాల్స్ జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, డైరెక్టర్లు టి. రాజు, ఎన్.రమేష్, ఎ.మురళీధర్, వి.సురేష్, ఎస్.సంతోష్‌రెడ్డి తెలిపారు. జేఈఈ మెయిన్స్ సెషన్-2025 ఫలితాల్లో కళాశాలకు చెందిన కె.శ్రీతేజ్ 97.97, జి.రమేష్ 95.88, జి.తరుణ్ 95.66, ఎన్.హన్సిక 95.30, ఎండి. అన్వర్ పాషా 94.84 ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారని పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరించిన కళాశాల అధ్యాపకులకు, విద్యార్థి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో షైన్ ప్రభంజనం


జి. వికాస్


శ్రీమహేష్


సీహెచ్ శ్రీతన్

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ -2025 ఫలితాలలో 98.59 పర్సంటైల్ సాధించి విజయదుందుభి సాధించామని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, డైరెక్టర్లు మూగల రమ, పి.రాజేంద్రకుమార్, మూగల రమేష్ సంయుక్తంగా తెలియజేశారు. మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో షైన్ జూనియర్ కళాశాల జాతీయ ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. షైన్ విద్యాసంస్థలు మొదటి నుంచి జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్‌లలో అత్యుత్తత శిక్షణను అందిస్తోందని తెలిపారు. అకడమిక్ ప్రోగ్రామింగ్, ప్రణాళికల ద్వారా విద్యార్థులను ఆణిముత్యాలుగా తయారు చేసి జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధిస్తున్నామని ఈ సందర్భంగా జి.వికాస్ 98.59, పి.శ్రీమహేష్ 97.23, సీహెచ్.శ్రీతన్ 96.04 పర్సంటైల్‌ను సాధించిన ర్యాంకులు విద్యార్థులను అభినందించారు. వీరితో పాటు 29 మంది విద్యార్థులు 90.0 పర్సంటైల్ పైగా ఫలితాలు సాధించారని చైర్మన్ మూగల కుమార్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో షైన్ విద్యా సంస్థల డైరెక్టర్ ఐబిటీ కోఆర్డినేటర్ రమేష్ యాదవ్, కళాశాల ప్రిన్సిపాల్ మారబోయిన రాజుగౌడ్, శ్రీనివాసన్, సంధ్యా ప్రశాంత్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కెరీర్ పాయింట్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కెరీర్ పాయింట్ చైర్మన్, ఫ్యాకల్టీ

న్యూశాయంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దేశంలోకెల్లా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జేఈఈ(మెయిన్స్) - 2025 ఫలితాలలో హనుమకొండ న్యూశాయంపేటలోని కెరీర్ పాయింట్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించినట్లు కెరీర్ పాయింట్ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ జూలపల్లి కరుణాకర్‌రావు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బుధవారం కెరీర్‌పాయింట్‌లో చైర్మన్, డైరెక్టర్‌లు అభినందించారు. కెరీర్ పాయింట్‌లకు చెందిన వి.రామ్‌చరణ్ 99.86, భవేష్ 99.71, శ్రీచైత్ర 99.49, సుధీష్ 99 పర్సంటైల్‌తోపాటు మరికొందరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు చైర్మన్ కరుణాకర్‌రావు తెలిపారు. చైర్మన్‌తో పాటు బ్రాంచ్ డైరెక్టర్లు, మధుపాల్‌రావు, ప్రిన్సిపాల్ దేవేందర్ కోటా ఫ్యాకల్టీ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

రెజోనెన్స్ విజయదుందుభి


జేఈఈ మెయిన్స్ సెషన్-1 విజేతలతో రెజోనెన్స్ చైర్మన్ రాజిరెడ్డి, ఫ్యాకల్టీ

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ సెషన్-1లో రెజోనెన్స్ కళాశాల విజయదుందుభి మోగించడం హర్షణీయమని రెజోనెన్స్ వరంగల్ విద్యాసంస్థల చైర్మన్ లెక్కల రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం హనుమకొండలోని కళాశాలలో జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎం.చరణ్ 99.89 పర్సంటైల్ సాధించడంతో పాటు ఫిజిక్స్‌లో 100 శాతం పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే బి.వెంకట్ జశ్వంత్ 99.66, సీహెచ్. సాయిదత్తు 99.59, కె.శిత్రీజ్ 99.56, వి.శశికౌశిక్ 99.48, ఎం.డి. ఉర్ రహ్మాన్ 99.27, వివి. ఫణి హర్షిత్ 99.26, వి.రాజశేఖర్ 99.25 పర్సంటైల్ సాధించినట్లు ఆయన వివరించారు. వీరితో పాటు మరికొంత మంది విద్యార్థులు దేశంలోని సుప్రసిద్ధ ఎన్ఐటీల్లో ప్రవేశాలు పొందేందుకు అర్హత సాధించారన్నారు. పోటీ పరీక్షలు ఏవైనా రెజోనెన్స్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. దీనంతటికీ విద్యార్థుల శ్రమ, అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సీఏవో లెక్కల రమ్యరెడ్డి, అకడమిక్ డీన్ బీఎస్. గోపాల్‌రావు, కళాశాలల ప్రిన్సిపాళ్ల తదితరులు పాల్గొన్నారు.

మోషన్ కళాశాల విజయ కేతనం


గుడి వంశీప్రియ


జీ అశ్విత


కే ప్రహర్షిత

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2025లో మోషన్ విద్యాసంస్థల విద్యార్థులు కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేఈఈ ఫలితాలలో గుడి వంశీప్రియ 97.56, గుండబోయిన అశ్విత 95.88, కొండపాక ప్రహర్షిత 92.53, ముడుతనపల్లి సహస్ర 92.34, బూర్ల వర్షిత 91.52, సామంతుల శ్రీనిధి 90.02, పర్సంటైల్ సాధించి మోషన్ కీర్తి ప్రతిష్ఠలను జాతీయ స్థాయిలో నిలబెట్టడం పట్ల హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఫలితాలు సాధించిన విద్యార్థులను వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్‌తో పాటు కళాశాల యాజమాన్యం అభినందించింది.


ఎం సహస్ర


బూర్ల వర్షిత


సామంతుల శ్రీనిధి


మండమెలిగె సందర్భంగా జాగారం కార్యక్రమంలో నృత్యం చేస్తున్న మంత్రి సీతక్క


మేడారం వన దేవతల గద్దెల వ్యూ

మండమెలిగె..

మేడారంలో ఘనంగా మినీ జాతర వేడుకలు

మది మురిసే

అంతర్గత పూజలు చేసిన పూజారులు | కిక్కిరిసిన వనదేవతల గద్దెల ప్రాంగణం

తాడ్వాయి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క- సారలమ్మల మినీ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. నాలుగు రోజుల పాటు జరిగే ఈ వేడకలో భాగంగా తొలిరోజు ప్రధాన ఘట్టంగా మండ మెలిగె కార్యక్రమాన్ని పూజారులు నిర్వహించారు. తెల్లవారుజామున గంగా స్నానాలు ఆచరించారు. అనంతరం మేడారంలోని సమ్మక్క మందిరం, కన్నెపల్లిలోని సారలమ్మల మందిరాన్ని మహిళలు శుద్ధి చేసి తల్లుల ఆది స్థానాలను అలుకు పూతలు చేసి ముగ్గులు వేశారు. వనదేవతల అంతర్గత మందిరాల్లో సమ్మక్కకు సిద్ధబోయిన వంశీయులు, సారలమ్మకు కాక వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలోని దేవతలను పూజించారు. దీప, ధూప నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డోలు వాయిద్యాల నడుమ గ్రామానికి నాలుగు వైపులా ద్వార స్తంభాలు ఏర్పాటు చేసి దిష్టి తోరణాలు కట్టారు. ఈ క్రమంలో వనదేవతల గుడుల్లో మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. ఆనవాయితీలో భాగంగా చర్ప వంశీయులు దివంగత మాజీ ఎమ్మెల్యే చర్ప భోజరావు కుటుంబ సభ్యులు సహా ఊరట్టం గ్రామం నుంచి డోలు వాయిద్యాల నడుమ సెలపెయ్యను గద్దెల వద్దకు తీసుకొచ్చి సమ్మక్క, సారలమ్మ పూజారులకు అందజేశారు. అనంతరం సాయంత్రం ఇలవేల్పులను ఘనంగా తమ తమ మందిరాలకు చేర్చారు. అనంతరం మేడారంలోని గద్దెలకు డోలు వాయిద్యాలు కొమ్ము శబ్దాల నడుమ మహిళలు నీళ్ల ఆరబోస్తుండగా పూజారులు వడ్డెలు గద్దెలకు చేరుకొని జాగారం చేశారు. గురువారం ఉదయం సూర్యోదయానికి ముందు వన దేవతల మందిరాలకు చేరుకొని తల్లులకు శనివారం వరకు అంతర్గత పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు.

జంపన్నవాగులో స్నానాలు ఆచరించి..

ముందుగా జంపన్నవాగులోని స్నానఘట్టాలపై ఏర్పాటు చేసిన నల్లాల కింద పుణ్యస్నానాలు చేసి వాగు ఒడ్డున ఉన్న కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క సారల మ్మలకు జేజేలు పలుకుతూ డోలు వాయిద్యాలు, డప్పు సప్పుల్ల నడుమ శివసత్తుల పూనకాలతో ఎత్తు బంగారం మోస్తూ గద్దెలకు చేరుకున్నారు. తల్లులకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరెలు, సారెలు, కొబ్బరికాయలు, ఎత్తు బంగారాని సమర్పిచారు. కోరికలు తీరాలని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

భద్రత

మినీ జాతరలో పోలీసులు భారీ భద్రత కల్పించారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో కీలకపాత్ర పోషించారు. అమ్మవార్ల గద్దెల వద్ద భక్తులు సులభంగా దర్శనాలు చేసుకొనేలా చర్యలు చేపట్టారు. ఈ బందోబస్తును ములుగు డీఎస్పీ రవీందర్ పర్యవేక్షించారు. అలాగే మినీ జాతర సందర్భంగా వనదేవతలు సమ్మక్క, సారలమ్మల దర్శనానికి తరలివచ్చిన భక్తులను దేవాదాయ శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. మేడారం పరిసరాలు, గద్దెల వద్ద దొంగలున్నారని, భక్తులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. కాగా, మేడారం మినీ జాతర సందర్భంగా వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు తప్పిపోతే తమ వద్దకు రావాలని దేవాదాయ శాఖ అధికారులు అనౌన్స్‌మెంట్ చేశారు. గద్దెల ప్రాంగణంలో రద్దీగా ఉడటంతో తప్పిపోయిన వారిని పోలీసులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బయ్యక్కపేటలో చందా వంశీయుల జాగరణ

తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో చందా వంశీయులు సమ్మక్క తల్లిని ఆడబిడ్డగా కొలుస్తారు. ఈ క్రమంలో గురువారం దేవర గుట్ట నుంచి సమ్మక్క ప్రతిమ రూపంలో కుంకుమ పువ్వును తీసుకువస్తారు. అయితే బుధవారం గ్రామంలోని వనదేవతల గద్దెల వద్ద జాగరణ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరయ్యారు.

చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం

మేడారం మినీ జాతరకు తరలి వచ్చిన భక్తుల పిల్లలకు, గర్భిణులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వనదేవతల గద్దెల ప్రాంగణంలో పంపిణీ చేశారు. బాదం పాలు, మల్టీ విటమిన్ పౌడర్, స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో ఆర్. విజయ, సూపర్‌వైజర్ జి.రమాదేవి, ఎన్. శ్రావణి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు


దేవతలకు పెయ్యను సమర్పిస్తున్న చర్ప వంశీయులు


సమ్మక్క గుడిలో ముగ్గులు వేస్తున్న మహిళలు


డోలు సన్నాయిలతో తరలి వస్తున్న పూజారులు

గద్దెలకు ప్రత్యేక అలంకరణ

మేడారంలో మినీ జాతర సందర్భంగా సమ్మక్క, సారలమ్మ గోవిందరాజులు, పగిడిద్దరాజు గద్దెలు, పరిసరాలు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పూలు, తోరణాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు కనువిందు కలిగేలా ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక ఏర్పాట్లతో నేరుగా దర్శనాలు

గత జాతరలకు విభిన్నంగా వనదేవతలను భక్తులు దర్శించుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భద్రతను పెంచి భక్తులకు నేరుగా దర్శనాలు కల్పించారు. గతంలో గేట్లు వేసి బయట నుంచే మొక్కులు చెల్లించుకునేవారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మేడారం మినీ జాతర సందర్భంగా భక్తులకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆదివాసీ మ్యూజియం ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివాసీల నృత్యాలు, గీతాలతో ఆ ప్రదేశమంతా మార్మోగింది.


గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


బందోబస్తును పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్


వన దేవతలను మొక్కుతున్న భక్తులు

కొత్త కానిస్టేబుళ్ల వేతన వెతలు!

- మూడు నెలలుగా జీతాలు రాక అవస్థలు
- ఇళ్ల అద్దెలు, హాస్టల్ ఫీజులు చెల్లించలేని పరిస్థితి
- తల్లిదండ్రుల వద్ద చేయి చాపాల్సిన దుస్థితి

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పోలీసు యూనిఫామ్‌పై ఉన్న ఇష్టంతో.. ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివి.. కఠినమైన శిక్షణ పూర్తి చేసి.. కానిస్టేబుళ్లుగా విధుల్లో చేరిన వారు వేతన వెతలు ఎదుర్కొంటున్నారు. మూడు నెలలుగా ప్రభుత్వం సక్రమంగా వేతనాలు విడుదల చేయకపోవడంతో వారంతా అవస్థలు పడుతున్నారు. నౌకరీ వచ్చిన సంబురం కూడా తమకు లేకుండా నెలనెలా ఖర్చుల కోసం తల్లితండ్రులు, తోబుట్టువుల దగ్గర చేయి చాచాల్సి వస్తోందని, స్నేహితుల వద్ద అప్పులు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన చెందుతున్నారు. వరంగల్ కమిషనరేట్‌కు 578 మంది మహిళ, పురుష కానిస్టేబుళ్లను నవంబరులో కేటాయించగా వారు డిసెంబరు నుంచి వివిధ జోన్లలోని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్నారు. పోస్టింగ్స్ ఇచ్చి అప్పుడే రెండు నెలల 10 రోజుల సర్వీసును పూర్తి చేసుకున్న ఆ యువ కానిస్టేబుళ్లకు ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు.

స్టైఫండ్ పైసలూ ఇంతవరకు అందలేదు..

శిక్షణ సమయంలో నెలకు రూ.13వేల వేతనాన్ని స్టైఫండ్ కింద ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా వసతి, మెస్ చార్జీలు పోను సుమారు రూ.8వేల పై చిలుకు నెలనెలా శిక్షణ కానిస్టేబుళ్ల ఖాతాల్లోకి జమ చేసేది. అలా 9 నెలల శిక్షణ కాలంలో 6 నెలలకు మాత్రమే చెల్లించి 3 నెలల స్టైఫండ్‌ను నిలిపివేశారు. ఇప్పటికీ ఆ డబ్బులు వారి ఖాతాల్లో జమచేయలేదు. శిక్షణ ప్రారంభ సమయంలో రూ.6వేలను ప్రతి అభ్యర్థితో డిపాజిట్ చేయించుకొని ఇప్పటి వరకు వాటి ఊసేత్తడం లేదని కొంత మంది కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఒక్కొక్కరికి సుమారు రూ.లక్ష 30వేల పై చిలుకు వేతనాలు చెల్లించాల్సి ఉందని కానిస్టేబుళ్లు పేర్కొంటున్నారు.

ఇంటి అద్దెలు, హాస్టల్ ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు

కొలువు వచ్చిందనే ఆనందం లేకుండా ఉందని పలువురు యువ కానిస్టేబుళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివి పెద్ద పెద్ద ఉద్యోగాలు కాదనుకుని ప్రజా సేవ చేసేందుకు పోలీస్‌శాఖలోకి వస్తే.. ఉద్యోగం వచ్చిన ప్రారంభంలోనే ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోతున్నారు. హాస్టల్ ఫీజు, రూమ్ అద్దెలు చెల్లించలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నామని, ఉద్యోగం చేస్తున్నా.. గత్యంతరం లేక తల్లితండ్రులను, తోబుట్టువులు, స్నేహితుల వద్ద చేయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తమ వేతనాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే వేతనాలు అందించాలని యువ ఖాకీలు కోరుతున్నారు.

సీపీవో సిబ్బంది నిర్లక్ష్యం

నవంబరు 21 న 578 మంది కానిస్టేబుల్స్ కమిషనరేట్‌లో రిపోర్ట్ చేస్తే సెంట్రల్ జోన్‌కు 145, వెస్ట్‌జోన్‌కు 119 మంది, ఈస్ట్‌జోన్ 68 మంది, మరో ఐదుగురిని ఇతర విభాగాలకు కేటాయించారు. వారంతా చాలా ఉత్సాహంగా విధుల్లో చేరారు. మొదటి జీతంతో తల్లిదండ్రులకు కానుక ఇవ్వాలని కొందరు, బైకు కొనుక్కోవాలని మరికొందరు, అక్కా చెల్లెళ్లకు, అన్నాదమ్ముళ్లకు తమ గుర్తుగా బహుమతులు ఇవ్వాలని కలలు కన్నారు. కానీ వారి కలలన్నీ అవిరయిపోయాయి. మూడు నెలలుగా జీతాలు ఎప్పుడోస్తాయని ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో వేతనాలు విడుదలైనా ఇక్కడి సీపీవో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే వేతనాలు ఆలస్యమవుతున్నాయని తెలుస్తోంది. వారి అశ్రద్ధ వల్ల పోలీసులకు సకాలంలో వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని సమాచారం. ప్రతీ పనిని వాయిదా వేస్తూ ఒక్క రోజులో పూర్తి చేయాల్సిన పనిని నాలుగైదు రోజులకు జరుపుతుండటంతో యువ ఖాకీలే కాదు కమిషనరేట్‌లోని మిగతా సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నట్టు తెలుస్తోంది.

ఖాతాల్లో సమస్యలున్నాయి.. త్వరలో విడుదలవుతాయి

రవి, అడ్మిన్ అడిషనల్ డీసీపీ

శిక్షణ సమయంలో ఇచ్చిన బ్యాంకు ఖాతాల వివరాలు కాకుండా వేరే ఇవ్వడం, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లలో తప్పులు దొర్లడం, పాన్ కార్డులు లింక్ కాకపోవడం లాంటి సమస్యలతో వేతనాలు నిలిచిపోయాయి. స్టైఫడ్‌కు సంబంధించిన 3 నెలల జీతం ఇప్పటికే కానిస్టేబుళ్ల ఖాతాల్లోకి జమయ్యాయి. సీపీవో సిబ్బంది 15 రోజులుగా ఖాతాల్లో తలెత్తిన సమస్యలను సరిదిద్దే పనిలో ఉన్నారు. త్వరలోనే వేతనాలు విడుదలవుతాయి.

నోటిఫికేషన్ లేకుండానే పోస్టు భర్తీ


ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ నియామకంపై ఆరోపణలు

వరంగల్ మెడికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా రాజీవ్ ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ పోస్టును ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే భర్తీ చేయడంపై వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల కిందట ఓ వైద్యుడు నియామకపత్రంతో కార్యాలయానికి రావడంతో ఆశావహులైన మిగతా వైద్యులు అవాక్కయ్యారు. ఒక పక్క ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే ఈ పోస్టు భర్తీ చేయడం వెనుక రూ.లక్షల వరకు చేతులు మారినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా ప్రైవేట్ ప్రాక్టీస్ ఉన్నవారికి ఈ పోస్టులో నియవించకూడదని నిబంధన ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు విస్మరించినట్లు విమర్శలు ఉన్నాయి. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించిన కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. రోగుల నుంచి ప్రైవేట్ ఆస్పత్రులు అదనంగా వసూలు చేస్తున్నాయా? సేవలు సమర్థవంతంగా అందుతున్నాయా? అనే విషయాలపై ఆరా తీయాల్సిన కో ఆర్డినేటర్‌కే ప్రైవేట్ క్లినిక్‌లు ఉంటే అజమాయిషీ ఎలా చేయగలరని ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు అర్హులైన వైద్యులను కో ఆర్డినేటర్‌గా నియమించాలని వైద్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు షురూ

న్యూశాయంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో బుధవారం రాజీవ్ ఆరోగ్య శ్రీ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆస్పత్రి రీజినల్ హెడ్ పగడాల రవికుమార్, సెంటర్ హెడ్ నమ్రత మాట్లాడుతూ.. మెడికవర్ ఆస్పత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు శుభపరిణామమన్నారు. 12 దేశాలలో ప్రపంచస్థాయి వైద్య సేవలు అందిస్తున్న ప్రఖ్యాత మెడికవర్ హాస్పిటల్స్ హనుమకొండలోని ఈ 300 పడకల ఆస్పత్రికి రాజీవ్ ఆరోగ్య శ్రీ అనుసంధానించడం ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా గుండె చికిత్సలు, గుండె ఆపరేషన్లు, మూత్ర సంబంధిత సమస్యలకు వైద్యం, కిడ్నీ ఆపరేషన్లు, డయాలసిస్ సేవలు, మెదడు ఆపరేషన్లు, క్యాన్సర్ వైద్య సేవలు (మెడికల్ సర్జికల్ అంకాలజీ)వంటి ఖర్చుతో కూడిన వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ద్వారా పొందవచ్చన్నారు. అనంతరం మెడికవర్ ఆస్పత్రిలో మొదటి ఆరోగ్య శ్రీ అడ్మిషన్‌ను పేషెంట్ బంధువులకు డాక్టర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.


మెడికవర్ ఆస్పత్రిలో అడ్మిట్ అయిన పేషెంట్‌కు రాజీవ్ ఆరోగ్య శ్రీ రిజిస్ట్రేషన్‌ను అందజేస్తున్న డాక్టర్లు



న్యాయవాది ప్రవీణ్ మృతికి బార్ అసోసియేషన్ సంతాపం

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది చిర్ర ప్రవీణ్ (48) మృతికి హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ల న్యాయవాదులు తమ సంతాపాన్ని తెలిపారు. బుధవారం కోర్టులోని నూతన బార్ అసోసియేషన్ హాల్‌లో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. అనారోగ్యంతో ఆయన ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. హసన్‌పర్తి మండలం మడిపెల్లి గ్రామానికి చెందిన చిర్ర ప్రవీణ్ 2022 నుంచి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈకార్యక్రమంలో హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు అధ్యక్షత వహించగా వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్ధన్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముదసిర్ అహ్మద్, ఉపాధ్యక్షులు సుదర్శన్, హనుమకొండ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విజేందర్, సీనియర్ న్యాయవాదులు ఎం.సహోదర్‌రెడ్డి, బత్తిని రమేష్‌గౌడ్, తాళ్లపెల్లి జనార్ధన్‌గౌడ్, పులి సత్యనారాయణ, ఆర్.నర్సింగరావు, చిర్ర సాంబశివరాజు, చిరంజీవి, సిరిమళ్ల అరుణ, భాగ్య, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రైవేట్ గర్ల్స్ హాస్టల్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పీఎస్ పరిధిలోని కిషన్‌పురలో ఉన్న గర్ల్స్ హాస్టల్స్‌ను హనుమకొండ ఏసీపీ దేవేందర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌లో కల్పిస్తున్న భద్రత చర్యలను పరిశీలించి హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థినులతో సమావేశమయ్యారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సతీష్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలనకు కృషి

▸▸ అడ్మిన్ అడిషనల్ డీసీపీ రవి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అడ్మిన్ డీసీపీ రవి

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరీ నిర్మూలనకు ప్రతీ ఒక్కరం కృషి చేయాలని అడ్మిన్ అడిషనల్ డీసీపీ రవి అన్నారు. ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్, ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ముద్రించిన మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి నిర్మూలన వాల్‌పోస్టర్ అదనపు డీసీపీ రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెట్టి చాకిరీ, అక్రమ రవాణా అనేది ప్రజల ప్రాథమిక హక్కును కోల్పోయే విధంగా ఉంటుందని, అందరం కలిసి వాటి వ్యాప్తిని గుర్తించి నిర్మూలనకు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్ రాజు, ఇన్‌స్పెక్టర్స్ వెంకన్న, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మనోహర్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా హిస్టరీ అండ్ టూరిజం విభాగం సీనియర్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ నుంచి ప్రిన్సిపాల్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మనోహర్‌ను పలువురు అధ్యాపక, విద్యార్థి సంఘాల నేతలు పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందచేసి ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా క్యాంపస్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్‌గా డాక్టర్ మమత బాధ్యతలు స్వీకరించారు. అలాగే సీడీసీ డీన్‌గా ప్రొఫెసర్ వరలక్ష్మి బాధ్యతలు చేపట్టారు.

బాలల హక్కుల రక్షణే 'సర్వోదయ' లక్ష్యం

హసన్‌పర్తి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బాలబాలికల హక్కుల రక్షణే సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ లక్ష్యమని సంస్థ కోఆర్డినేటర్ ఇందిర అన్నారు. మండలంలోని జయగిరి ప్రభుత్వ పాఠశాలలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు లింగాధారిత వివక్ష, లింగ సున్నితత్వంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కోఆర్డినేటర్ ఇందిర మాట్లాడుతూ.. బాలబాలికలు తమ లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. విద్యార్థినులు మంచి ఆలోచనలు, ఆశయాలతో వ్యక్తిగతంగా బలంగా ఎదుగుతారన్నారు. ఆడపిల్లల అవసరాలు, హక్కులు కల్పించాల్సిన బాధ్యత మనందరిదన్నారు. ఆడపిల్లల హక్కులకు భంగం కలిగినప్పుడు హింసకు దారితీస్తుందన్నారు. అనంతరం బాలబాలికలకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, విష్ణుమూర్తి, యాకయ్య, శ్రీహరి, శ్రీధర్, ఫీల్డ్ ఆఫీసర్ రవిందర్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాతత్పరులకు లయన్స్ ఆహ్వానం



స్పోర్ట్స్ మెటీరియల్‌ను బహూకరిస్తున్న రేవూరి రమణారెడ్డి

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సేవాభావం కలిగిన ముఖ్యంగా యువతకు అంతర్జాతీయ స్వచ్ఛంద లయన్స్ సంస్థ ఎల్లవేళలా స్వాగతిస్తుందని 320ఎఫ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ లయన్స్ భవన్‌లో మంగళవారం రాత్రి జీఎస్‌టీ కోఆర్డినేటర్ రేవూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా సేవా కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. ఈ సంవత్సరం జిల్లాలో మరిన్ని నూతన లయన్స్ క్లబ్‌లు ఆవిర్భవించేందుకు వీలుగా నాయకులు కృషిచేయాలని, తద్వారా సేవా కార్యక్రమాలు మరింతగా విస్తరిస్తాయన్నారు. జీఎస్‌టీ కో ఆర్డినేటర్‌గా రేవూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రతీ క్లబ్‌కు రూ.5వేల విలువజేసే స్పోర్ట్స్ మెటీరియల్, విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్‌లు ఇవ్వడం అభినందనీయమన్నారు. మల్టీపుల్ పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పరీక్షల సమయంలో విద్యార్థి లోకానికి ఉపయుక్తంగా ఉండేలా తమ క్లబ్ నాయకుడు రమణారెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమాలు ఇతర నాయకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. జిల్లా కేబినెట్ అడ్వయిజర్ సుధాకర్‌రెడ్డి, వీడీజీ-2 నరహరి సుధాకర్‌రెడ్డి, మల్టీపుల్ కౌన్సిల్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రావు, పొట్లపల్లి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మూడు రీజియన్లకు చెందిన 38 క్లబ్‌లకు రమణారెడ్డి స్పోర్ట్స్ మెటీరియల్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఆర్‌సీలు పెద్ది రేవతి, జే.రాజిరెడ్డి, డాక్టర్ జి.సురేశ్, లియో చైర్మన్ కె.సుభాష్, డాక్టర్ తాళ్ల రవి, కె.రాజమౌళి, రాంగోపాల్‌రెడ్డి, హరికిషన్‌రెడ్డి, జయశ్రీ, ఎన్.రాజిరెడ్డి పాల్గొన్నారు. పెండెం వేణుమాధవ్ కార్యక్రమ సంయోజకులుగా వ్యవహరించారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేత

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి మండలం 2వ డివిజన్ వంగపహాడ్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ హనుమకొండ, సేవామిత్ర క్లబ్‌ల సహకారంతో బుధవారం క్రీడా పరికరాలు అందజేశారు. విద్యార్థుల శారీరక దారుఢ్యం కోసం స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎర్రంరెడ్డి ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీనివాస్, క్లబ్ కోర్ కమిటీ మెంబర్ రంగారెడ్డి, రాంచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు రహీం దర్, రమేష్, రాజు, అజయ్‌కుమార్, శ్రీలత, అరుణకుమారి, రాణి, మాలతీదేవి పాల్గొన్నారు.

కేయూ దివ్యాంగుల స్టూడెంట్స్ నూతన కార్యవర్గం

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ దివ్యాంగ విద్యార్థుల నూతన కార్యవర్గాన్ని బుధవారం కేయూ అతిథిగృహం వద్ద పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్ఆర్ఎం విభాగాధిపతి ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాసరావు నేతృత్వంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిమ్మనగోటి రాములు, జనరల్ సెక్రటరీగా సీహెచ్.గోపి, యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్‌గా బి.రాంబాబు, యూనియన్ ఇన్‌చార్జ్‌గా బోస్కు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.స్రవంతిలను ఎన్నుకున్నారు.

నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లులు

▸▸ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

▸▸ భద్రకాళి బండ్‌పై సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశం



భద్రకాళి బండ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బల్దియా పరిధిలో జరుగుతున్న పనులు నిర్దేశిత ప్రమాణాలతో పూర్తిచేస్తేనే బిల్లుల చెల్లింపులు జరుగుతాయని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. వరంగల్ స్మార్ట్‌సిటీలో భాగంగా వరంగల్ నగరంలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూర్తయిన పనులను కొలతలు కొలిచి పరిశీలించారు. 21వ డివిజన్ ఎల్బీనగర్, రహమత్‌పుర, కాశిబుగ్గ, ఏనుమాముల, బాలాజీనగర్, సాయినగర్ కాలనీలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. అనంతరం భద్రకాళిబండ్‌లో జరుగుతున్న పనుల కొలతలతో పరిశీలించారు. ఇక్కడ జరుగుతున్న పనులు జనవరి మాసంలో పూర్తి చేయాల్సి ఉండగా.. ఇంకా పనులు కొనసాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల చివరిలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ శ్రీనివాస్, డీఈ రంగారావు, కృష్ణమూర్తి, రవికిరణ్, రాజ్‌కుమార్, ఏఈ రాగి శ్రీనివాస్, హబీబ్, స్మార్ట్ సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో లక్ష్యాన్ని చేరుకోవాలి

నిర్దేశిత గడువులోగా పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పన్ను వసూళ్ల పురోగతిపై రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గత వారం బల్దియా కార్యాలయంలో పన్నుల వసూళ్లపై సమావేశం ఏర్పాటు చేసినా.. పనిలో ఏ మాత్రం పురోగతి లేదని అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే వారంలోగా పన్నుల వసూళ్లలో పురోగతి లేకుంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పన్నుల వసూళ్ల తీరుపై డిప్యూటీ కమిషనర్‌ను పర్యవేక్షించాలని సూచించారు. డీసీలు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. బల్దియా ఆర్‌వోలు, డిప్యూటీ కమిషనర్లు పన్నుల వసూళ్లు బాధ్యతాయుతంగా జరిగేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్నరెడ్డి, ఈశ్వర్‌లతోపాటు పన్నుల విభాగం అధికారి రామకృష్ణతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో వేధింపులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఏఎన్‌వో(అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్)గా పనిచేస్తున్న ఉద్యోగి అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తల్లిదండ్రుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుధవారం కళాశాల ఎన్‌సీసీ మైదానంలో చోటు చేసుకున్న ఓ ఘటన అమ్మాయి తల్లిదండ్రులను ఆగ్రహావేశాలను లోను చేసింది. ఏఎన్‌వో తోటి విద్యార్థుల ఎదుట ఓ అమ్మాయి పట్ల అసభ్యంగా, అవహేళనగా మాట్లాడిన తీరు తోటి విద్యార్థులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఏఎన్‌వోపై కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత ఎన్‌సీసీ ఏఎన్‌వోను ఫోన్‌లోవివరణ కోరేందుకుప్రయత్నించగాఅందుబాటులోకి రాలేదు.

విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేత బాలు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు పి.అనూష, కన్వీనర్ బాలు డిమాండ్ చేశారు. బుధవారం కేయూలో నిర్వహించిన పీడీఎస్‌యూ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వానికి విద్యారంగంపై చిత్తశుద్ధి లేదన్నారు. విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫీజులు, స్కాలర్‌షిప్‌లు విడుదలచేయాలని కోరారు. యూజీసీనూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు గణేశ్, యాదగిరి, హరికృష్ణ, గణి, రాజశేఖర్, రాజ్‌కుమార్, నాగరాజు, చందన, సాధన, మానస, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

మడికొండ డంపింగ్ యార్డును తరలించాలి



ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం అందజేస్తున్న డంపింగ్ యార్డ్ బాధితులు

మడికొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మడికొండ డంపింగ్ యార్డును ఎత్తివేయాలని బాధితులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజును కోరారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న విషవాయువులతో కూడిన పొగ, మడికొండ పరిసర గ్రామాలను కమ్మేస్తూ చాపకింద నీరులా ప్రజల ప్రాణాలను హరిస్తుందని అన్నారు. గొంతు నొప్పి, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నామని ప్రధానంగా పిల్లలు, వృద్ధులు శ్వాస తీసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే డంపింగ్ యార్డును ఎత్తివేలయాలని వినతి పత్రంలో ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయంగా ఐదు చోట్ల డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చెత్తను రీసైక్లింగ్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. సమస్యను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం కృషి చేయాలి

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శ ప్రేమేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికపై బుధవారం జిల్లా పార్టీ కార్యాలయలంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో ప్రతీ ఒక్క ఓటరును బీజేపీ కార్యకర్తలు కలిసి ఓటు అభ్యర్థించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, జిల్లా నాయకులు జయంత్‌లాల్, ఆకుల శ్రీకాంత్, కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రానున్నటీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్టుటైమ్ లెక్చరర్స్ అసోసియేషన్ గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్లు పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు ప్రకటించారు. బుధవారం కేయూ దూరవిద్య కేంద్రంలో జరిగిన పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం సమావేశంలో కేయూ అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్ జనరల్ సెక్రటరీ ఎర్రం నాగేందర్ హాజరై మాట్లాడారు. వర్సిటీల్లో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలన్నారు. యుగేంధర్, చారి, రజనీకాంత్, రవీందర్, కుమారస్వామి, కృష్ణయ్య, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం మెరుగుదలతోనే నేవీలో రాణించవచ్చు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ నైపుణ్యాల మెరుగు పరుచుకుంటే ఇండియన్ నేవీలో రాణించవచ్చని ఇండియన్ నేవి అండమాన్ కమాండెంట్ కెప్టెన్ వివి.రామన్ అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వ విద్యాలయ ఆధ్వర్యంలో అండమాన్, నికోబార్ నౌకాదళానికి సాఫ్ట్ స్కిల్స్ బూస్ట్ శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఎస్సార్‌యూ, స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇండియన్ నేవి మధ్య కుదిరిన ఒప్పందంలో భాగంగా అండమాన్, నికోబార్ కమాండ్ ఉద్యోగుల కోసం మూడు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సార్‌యూ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆచార్యులు డాక్టర్ సుమన్, డాక్టర్ రమేష్‌బాబు నేతృత్వంలో మొదటి రోజు పరిపాలనా, కార్యనిర్వాహక సిబ్బందికి సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సాఫ్ట్ స్కిల్స్‌లో భాగంగా కమ్యూనికేషన్ ఎఫెక్టివ్‌నెస్‌పై సర్టిఫికేషన్ కోర్సుతో పాటు టీం బిల్డింగ్, డెలిగేషన్ ఆఫ్ వర్క్, వర్క్ లైఫ్ బ్యాలెన్స్‌పై, రెండవ, మూడవ రోజు ఆఫీసర్స్ క్యాడర్ సిబ్బందికి కమ్యూనికేసన్ డిస్టార్షన్, లీడర్షిప్, టీం మేనేజ్‌మెంట్, పని ఒత్తిడిని ఎలా తగ్గించుకోవాలని అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేందుకు ఇష్టంతో చదవండి



పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ పూజను సత్కరిస్తున్న డీఈవో వాసంతి, ఆదర్శ లా కాలేజ్ చైర్మన్ బూర విద్యాసాగర్

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు కష్టపడి వ్యయప్రయాసాలకు లోనై చదివిస్తున్న క్రమంలో వారి ఆశలు నెరవేర్చేందుకు ప్రతీ విద్యార్థి ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు ఉంటాయని పోలీస్ శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ పిలుపునిచ్చారు. హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో హనుమకొండ అన్ ఎయిడెడ్ ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ పేరిట నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రమశిక్షణ, సమయపాలనతో చదువుకోవాలని, మంచి వ్యక్తులతో స్నేహం చేసి మంచి అలవాట్లు పెంపొందించుకోవాలన్నారు. విలువైన జీవితాలకు పదో తరగతి ఒక మైలురాయి వంటిదని పేర్కొంటూ ప్రతీ ఒక్కరు ఉత్తమ ఫలితాల సాధనకు తమవంతుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

హనుమకొండ డీఈవో వాసంతి మాట్లాడుతూ.. ఈసారి పదో తరగతి ఫలితాల్లో హనుమకొండ జిల్లాను ఉన్నత స్థానంలో ఉంచేలా విద్యార్థులు చదవాలని, దానికి ప్రయివేట్ పాఠశాలలు కీలక పాత్ర పోషించాలన్నారు. ఆదర్శ లా కాలేజ్ చైర్మన్ బూర విద్యాసాగర్ గౌడ్ గౌరవ అతిథిగా పాల్గొని గడిచిన విద్యాసంవత్సరంలో జీపీఏ 10 సాధించిన విద్యార్థులను అభినందిస్తూ ఈ సంవత్సరం విద్యార్థులకు వీరు స్ఫూర్తిగా నిలుస్తారని చెప్పారు. హడుప్సా విద్యార్థుల కోసం ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. హడుప్సా జిల్లా అధ్యక్షుడు జనార్దన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి శంకర్, వేణుమాధవరావు, బుచ్చిబాబు, రాజేశ్వర్‌రావు, రామచంద్రమూర్తి, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యువత సమాజానికి రోల్ మోడల్‌గా ఉండాలి



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత సమాజానికి రోల్ మోడల్‌గా ఉండాలని కేయూ వీసీ ప్రొఫెసర్‌కర్నాటి ప్రతాప్‌రెడ్డి సూచించారు. బుధవారం కేయూ ఏబీవీపీ నేతృత్వంలో నిర్వహించిన ఖేల్ భారత్ క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లు, విద్యార్థులకు వర్సిటీ సెనెట్ హాల్‌లో బహుమతులను అందచేశారు ఈసందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడలు విద్యార్థులలో మానసిక స్థైర్యాన్ని పెంచుతాయని చెప్పారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. దేశ అభివృద్ధిలో యువతదే కీలక పాత్ర అని చెప్పారు. కేయూ పాలక మండలి సభ్యురాలు రమ మాట్లాడుతూ.. యువత దేశానికి ఆస్తి అని చెప్పారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, నిమ్మల రాజేశ్, గట్టు ప్రశాంత్, సాయికుమార్, అంబాల కిరణ్, చట్ల సతీశ్, అభి, పారుపాటి తిరుపతిరెడ్డి, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్, హరి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిపేట తల్లులకు ప్రత్యేక పూజలు

శంభునిపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజోతి) : నగరంలోని అమ్మవారిపేటలో సమ్మక్క-సారలమ్మ తల్లులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా బుధవారం తల్లుల గద్దెలను అలంకరించారు. పూజారులు బొరిశెట్టి శ్యాంసుదర్, నామని శివమూర్తి, జంపయ్య, రాములు, సంజీవరావు, సరోజన, శాలివాహనులు పూజలు చేశారు. జాతర నిర్వాహకులు బంగారం (బెల్లం)తో పాటు నైవేద్యాలను సమర్పించారు. రెండేళ్ళకోసారి నిర్వహించే ఈ జాతరలో భాగంగా ఆనవాయితీ ప్రకారం మినీ జాతరను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల కోసం తగిన ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనితరంజిత్, జాతర చైర్మన్ కొడూరి భిక్షపతి, ఆర్గనైజర్ దాసి రాందేవ్, కోశాధికారులు బైరి నాగరాజు, హరినాథ్, ప్రచారకర్తలు ఆవునూరి కుమారస్వామి, రామ్మూర్తి పాల్గొన్నారు.



గద్దెల వద్ద పూజలు చేస్తున్న జాతర నిర్వాహకులు

ఓఎస్‌డీ పదవి నుంచి మల్లారెడ్డిని తొలగించాలి

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఓఎస్‌డీ పదవి నుంచి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని తొలగించాలని కేయూ విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని తన చాంబర్‌లో కలిసి మల్లారెడ్డిపై ఫిర్యాదు చేశారు. ప్రొఫెసర్ మల్లారెడ్డి అసోసియేట్ ప్రొఫెసర్ నియామకంపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులు విచారణకు ఆదేశించారని పేర్కొన్నారు. వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమితులైన మల్లారెడ్డికి బోధన, పరిశోధన అనుభవం లేదని ఆరోపించారు. మల్లారెడ్డిని ఓఎస్‌డీ పోస్టు నుంచి తొలగించే వరకు విద్యార్థి సంఘాల నిరసనలు కొనసాగు తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఆత్మబంధువు కందాళ శోభక్క



శోభక్క చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ ఈసం నారాయణ, కాత్యాయనీ విద్మహే తదితరులు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు ఆత్మబంధువు, కేయూ తెలుగు విభాగం అధ్యాపకురాలు డాక్టర్ కందాళ శోభక్క మరణం తీరని లోటని కేయూ ప్రొఫెసర్ ఈసం నారాయణ అన్నారు. బుధవారం కేయూ రెండో గేటు విజయగణపతి కాలనీ వద్ద డాక్టర్ కందాల శోభారాణి రెండో యాది సభ జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ప్రొఫెసర్ ఈసంనారాయణ, ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక జాతీయ కార్యదర్శి అనిశెట్టి రజిత, అధ్యాపకల జ్వాల సంపాదకుడు ఎం.గంగాధర్‌లు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. సమాజం పరివర్తనలో కందాళ శోభక్క అంచెలంచెలుగా ఎదిగారని అన్నారు. విద్యార్థి దశ నుంచి ఎన్నో సమస్యలు ఎదుర్కొని విజయాలు సాధించారని అన్నారు. అలాగే సాహితీ రచనలతో సామాజికంగా చైతన్యం తెచ్చారని అన్నారు. శోభక్క భౌతికంగా మనతో లేకపోయినప్పటికీ ఆమె ఆశయాలను సాధించాలని అన్నారు.

ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ.. తెలుగు సాహిత్య పరంగా మహిళలకు అండగా శోభారాణి రచనలు చేసిందన్నారు. ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక జాతీయ కార్యదర్శి అనిశెట్టి రజిత మాట్లాడుతూ.. కందాళ శోభారాణి ఆశయాల సాధనకు అందరం ముందుండాలని అన్నారు. కార్యక్రమంలో సామాజిక వేత్త శోభారమేశ్, కేయూ అధ్యాపకులు గడ్డం కృష్ణయ్య, శేషు, అంజన్‌రావు, సోమ రామ్మూర్తి, విద్యార్థి నాయకులు శ్రావణ్, శివ, స్టాలిన్, అరుణ్, ప్రవీణ్, డాక్టర్ ధర్మరపు నాగయ్య, రాగిశెట్టి ఉపేందర్, జాటోతు స్వామి, పెండ్లి అశోక్‌బాబు, సోమరాతి భిక్షపతి పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకం

▸▸ ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు

▸▸ భీమారంలో ఘనంగా యశస్వి ఆస్పత్రి ప్రారంభోత్సవం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి

హసన్‌పర్తి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకమని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు అన్నారు. భీమారం టీబీ ఆస్పత్రి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన యశస్వి ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, డోర్నకల్ మాజీ శాసన సభ్యుడు రెడ్యా నాయక్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. నైపుణ్యం కలిగిన వైద్యులైన ఆస్పత్రి నిర్వాహకులు ఎంఎస్ వోబీజీ డాక్టర్ జి.చైతన్య, ఎంస్ జనరల్ లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ జి.పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఆస్పత్రి.. అధునాతన పరికరాలు అందుబాటులో ఉండడం హర్షణీయమన్నారు. ప్రధానంగా గైనిక్ సమస్యలతో బాధపడే రోగులకు గైనిక్ సర్జరీ, అనస్థీషియా కాస్మోటిక్ గైనిక్ లాంటి వైద్య సదుపాయాలు ఉన్నాయన్నారు. లాపరోస్కోపిక్ ద్వారా అపెండిక్స్, నరాల వాపులు, తదితర వ్యాధులకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. నగర ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, జక్కుల రజితవెంకటేశ్వర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చూపులు కలిసినంత సులువు కాదు మనసులు ముడిపడడం. ప్రేమంటే భావోద్వేగాల బంధం. ఒకరికి ఒకరుగా... ఇద్దరూ ఒకటిగా జీవించాలని తపించే అనుబంధం. ఇది బలమైన బంధమై... ప్రేమ ప్రయాణం కలకాలం సాగాలంటే రెండు వైపుల నుంచీ నిరంతర ప్రయత్నం అవసరమంటున్నారు లవ్ గురువులు. మనలోని లోటుపాట్లను తెలుసుకొని... ఒకరిపై ఒకరు నమ్మకంతో అడుగులు వేస్తే అంతా ఆనందకరమే అంటున్నారు. అందుకు వారు ఇస్తున్న సలహాలివే...

రేపు ప్రేమికుల రోజు

ప్రేమను గెలిపిద్దాం!

మ్యాజిక్ బాక్స్ కాదు...

ఒకరితో సాంగత్యం ఎప్పుడూ మధురానుభూతినిస్తుంది. కానీ అదే జీవితమనుకోవద్దు. వాస్తవానికి రిలేషన్‌షిప్ మ్యాజిక్ బాక్స్ కాదు... మీ బాధలన్నీ చిటికెలో పోగొట్టేసి జీవితాన్ని ఆనందమయం చేయడానికి! మీ సంతోషం వేరెవరి చేతుల్లోనో కాదు... మీ చేతుల్లోనే ఉందని గమనించండి.

భిన్నాభిప్రాయాలు సహజం...

మీ అలవాట్లు, అభిప్రాయాలు, జీవనశైలి, దృష్టికోణం లానే మీ భాగస్వామి కూడా ఉండాలని ఆశించవద్దు. ఏ ఇద్దరూ ఒకేలా ఉండరనేది గుర్తించండి. కొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయాలున్నా పట్టించుకోవాల్సిన పని లేదు. కావల్సిందల్లా ఒకరి మనోభావాలు ఒకరు గౌరవించుకోవడం... వాళ్లని వాళ్లలానే మీ జీవితంలోకి ఆహ్వానించడం.

ఇరువైపుల నుంచీ ప్రయత్నం...

ఏ ప్రేమ బంధమూ పర్‌ఫెక్ట్ కాదు! దాన్ని పక్కాగా తీర్చిదిద్దుకోవడానికి రెండు వైపుల నుంచీ నిరంతర ప్రయత్నం జరుగుతుండాలి. ప్రతి అనుబంధంలో ఎప్పుడో ఒకప్పుడు చేదు అనుభవాలు ఎదురవుతాయి. చిన్న చిన్న వాదనలు, గొడవలు జరుగుతాయి. ఇలాంటప్పుడే వాటిని ఎలా పరిష్కరించుకోవాలో నేర్చుకుని, బంధాన్ని ఆనందమయం చేసుకొంటూ ముందుకు సాగాలి.

విలువలు ముఖ్యం...

ప్రేమలో కొన్ని మంచి రోజులు... ఒకరికి ఒకరికి పడని రోజులూ ఉండవచ్చు. కానీ... నైతిక విలువలు దెబ్బతినేలా ఒకరి గౌరవానికి ఒకరు భంగం కలిగించే రోజు ఒక్కటి కూడా రాకూడదు. ఎందుకంటే ప్రేమన్నది బాధను పెంచడానికి కాదు... రెండు హృదయాలను దగ్గరకు చేర్చడానికని తెలుసుకోండి.

అతిగా ఆశించవద్దు...

మీలానే మీ భాగస్వామి కూడా ఉండాలని ఆశించడం సహజమే. కానీ... కొన్ని కొన్ని మీ నియంత్రణలో లేవని బాధపడుతూ కూర్చోకండి. జరిగినవి, జరగబోయేవీ తలుచుకుని చింతిస్తూ మానసిక ఒత్తిడిలోకి వెళ్లకుండా జాగ్రత్త పడండి. మీ స్నేహం ఆనందంగా సాగుతుంటే... దాన్ని మరింత అందంగా తీర్చిదిద్దుకోవడానికి కలిసి ప్రయత్నించండి. అంతే కానీ... జరగనివాటిని ఆశించి భంగపడవద్దు.

ఆ సత్యాన్ని అర్థం చేసుకోండి...

ఒక వేళ మీ ప్రేమ విఫలమైతే... అది మళ్లీ పుడుతుందన్న నిజాన్ని అర్థం చేసుకోండి. కొంత మంది తొలి ప్రేమే ఇక చివరిదని, నిజమైన ప్రేమ జీవితంలో ఒక్కసారే పుడుతుందనే దురభిప్రాయంలో ఉంటారు. ఒకసారి గుండె పగిలినంత మాత్రాన అది మళ్లీ అతకదనుకోవడం పొరపాటు. తొలి ప్రేమలోనే జీవిత భాగస్వామిని పొందితే హ్యాపీనే. ఒకవేళ పొందలేకపోతే... జీవితంలో ఇంకా ఎన్నో అద్భుతమైన విషయాలు మీ కోసమే వేచి ఉన్నాయని తెలుసుకోండి.

ఈ కథ ఇలా మొదలైంది!

ప్రేమ అనేది అపురూపమైన భావన. మనసులో ఉన్న ప్రేమను వ్యక్తపరచడానికి ప్రత్యేక సమయం అవసరం లేదు. అయినా తమ ప్రేమను తెలిపేందుకు ప్రేమికులంతా ఈ రోజు కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అదే ఫిబ్రవరి 14... ప్రేమికుల రోజు. ఈ రోజుకు సంబంధించి ఆసక్తికరమైన అంశాల సమాహారం... మీ కోసం.

వారం ముందు నుంచే...

ప్రేమికుల రోజుకి వారం ముందు అంటే ఫిబ్రవరి ఏడు నుంచే వాలెంటైన్స్ వీక్‌ను జరుపుకుంటారు. ఒక్కో రోజును ఒక్కో పేరుతో సెలబ్రేట్ చేసుకుంటారు. ఫిబ్రవరి 7న రోజ్ డే, 8న ప్రపోజ్ డే, 9న చాకొలెట్ డే, 10న టెడ్డీ డే, 11న ప్రామిస్ డే, 12న హగ్ డే, 13న కిస్ డే, 14న వాలెంటైన్స్ డే జరుపుకుంటారు. ప్రేమికులు ఒకరికొకరు బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపేస్తారు.

ఎలా మొదలైంది?

రోమ్‌లో వాలెంటైన్ అనే క్రైస్తవ ప్రవక్త... ప్రేమతో జీవించడాన్ని ఇష్టపడేవాడు. ఆ దిశలోనే యువతీ యువకులను ప్రోత్సహించేవాడు. సమాజంలో పెరుగుతున్న హింస, స్వార్థం, ద్వేషం లాంటి చెడు గుణాలపై పోరాడేందుకు ప్రేమను మించిన ఆయుధం లేదని చెప్పేవాడు. రోమ్ చక్రవర్తి కూతురు ఇతని పట్ల ఆకర్షితురాలవుతుంది. యువతను తప్పుదోవ పట్టిస్తున్నాడంటూ వాలెంటైన్‌కు రోమ్ చక్రవర్తి మరణశిక్ష విధిస్తాడు. ఈ సంఘటన జరిగిన రెండు దశాబ్దాల తరవాత అప్పటి పోప్ ఫిబ్రవరి 14ని ప్రేమికుల రోజుగా ప్రకటించాడు. అప్పటి నుంచి వాలెంటైన్ పేరు మీద ప్రేమికుల రోజు (వాలెంటైన్స్‌డే)ను జరుపుకుంటున్నారు.



- ప్రపంచంలోని చాలా దేశాల్లో ఈ ప్రేమికుల రోజు ఉత్సవాన్ని జరుపుకుంటారు. రకరకాల బహుమతులు, పువ్వులు, గ్రీటింగ్ కార్డులు, విందులు, వినోదాలతో తమ ప్రేమను తెలియజేస్తుంటారు.

ఏ దేశంలో ఎలా....?

- ఫిన్లాండ్‌లో ఈ రోజుని స్నేహితుల దినోత్సవంలా జరుపుకుంటారు. స్నేహితులను ప్రత్యేకంగా అభినందిస్తూ వారంటే తమకు ఎంత ఇష్టమో తెలియజేస్తూ రకరకాల బహుమతులు, బొకేలు ఇచ్చుకుంటారు.
- జపాన్‌లో మహిళలు తమ భాగస్వాములకు చాక్లెట్లు, ఆభరణాలు బహుమతిగా ఇస్తారు. జంటగా తమకు ఇష్టమైన ప్రదేశాలకు వెళతారు. ఒక నెల తరవాత అంటే మార్చి 14న బహుమతి పొందిన పురుషులంతా వైట్ డే ఉత్సవాన్ని జరుపుకుంటారు. ఈ రోజున వీరు తమ భార్యలకు బహుమతులు, నగలు ఇస్తారు.
- డెన్మార్క్, నార్వే దేశాల్లో ప్రేమికులు మాత్రమే కాదు...... స్నేహితులు, కుటుంబ సభ్యులు అందరూ బహుమతులు ఇచ్చి పుచ్చుకుంటారు. అందరూ కలిసి రకరకాల ఆటలు ఆడుకుంటారు. పేరు తెలియకుండా తమకు ఇష్టమైనవారికి బహుమతి పంపుతారు. ఇది అందుకున్నవారు ఎవరు పంపారో చెప్పాలి. లేదంటే వచ్చే ఏడాదికి ఒక బహుమతి బాకీ ఉన్నట్లు భావిస్తారు.
- ఇంగ్లాండ్‌లో పిల్లలంతా కలిసి స్వీట్స్, పండ్లు, వాలెంటైన్ బన్స్ పంచుకుంటారు.
- జర్మనీలో ప్రేమ, శృంగారం రెంటిని సూచించేలా పంది బొమ్మలతో కూడిన బహుమతులు ఇచ్చుకుంటారు.
- ఫిలిప్పీన్స్‌లో సామూహిక వివాహాలు జరుపుతారు. వందలాది జంటలను కలుపుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహిస్తుంది
- దక్షిణాఫ్రికాలో ఫిబ్రవరి 15న వాలెంటైన్స్ డేను జరుపుకుంటారు. ఇక్కడి మహిళలు తమ ప్రేమికుని పేరుని ధైర్యంగా దుస్తులకు పిన్ చేసుకుంటారు.
- తైవాన్‌లో ప్రేమికులు పువ్వులను ఇచ్చుకుంటారు. ఇక్కడి పురుషులు 108 ఎర్ర గులాబీలతో కూడిన పెద్ద గుత్తిని తమ ప్రేమికురాలికి పంపుతారు.
- దక్షిణ కొరియాలో జంటలు చాక్లెట్లు, బహుమతులు ఇచ్చుకుంటారు. జపాన్‌లోలాగే మార్చి 14న వైట్ డే జరుపుకుంటారు. ఏప్రిల్ 14న తాము సింగిల్‌గా ఉన్నామని సూచిస్తూ బ్లాక్ డే వేడుకలు చేసుకుంటారు. ఈ రోజున నల్ల బీన్ సాస్‌తో ఉన్న నూడుల్స్ తింటారు.

విజేత





ప్యాచీల బోటుతో

పతకాలు పట్టింది

నాన్నతో కలిసి సరదాగా నదిలో వేటకు వెళ్లినప్పుడు ఆ చిన్నారికి తెలియదు... ఒక రోజు తాను జల క్రీడల్లో చాంపియన్ అవుతానని. తెడ్డు వేయడం... వల విసరడం... చేపలను ఒడిసి పట్టుకోవడం... ఒక్కొక్కటీ నేర్చుకుంది. ఈత మొదలు ఇంజిన్ బోటు మరమ్మతుల వరకు అన్నీ తెలుసుకుంది. వాటర్ స్పోర్ట్స్‌లోకి అడుగుపెట్టి... నేడు జాతీయ క్రీడల్లో కనోయి స్లాలోం ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించింది. మత్స్యకార కుటుంబం నుంచి వచ్చి... అద్భుత ప్రతిభతో దూసుకుపోతున్న నాగిడి గాయత్రి... 'నవ్య'తో పంచుకున్న విశేషాలివి.

"కృష్ణా జిల్లా నాగాయిలంక మా స్వగ్రామం. నాన్న నాగబాబు, అమ్మ వెంకట నాగేశ్వరమ్మకు నేను రెండో సంతానం. నాన్న చేపల వేటపైనే మేము బతికేది. నాన్న నదిలోకి వేటకు వెళ్లేప్పుడు నన్ను తీసుకెళ్లమని చిన్నతనంలో మారాం చేసేదాన్ని. నా పోరు పడలేక నాన్న నన్ను వెంటబెట్టుకుని వెళ్లేవాడు. అలా ఈత దగ్గర నుంచి నదిలో తెడ్డు వేయడం, ఒడుపుగా పడవ నడపడం, వల, లంగర్ వేయడం, చేపలు పట్టడం, ఇలా ఒక మత్స్యకారుడికి కావాల్సిన మెళకువలన్నీ ఒక్కొక్కటి అవపోశన పట్టాను. ఒక విధంగా నాన్నే నా తొలి గురువు. ఒక పక్క చదువుకుంటూనే బడిలేని రోజుల్లో నాన్నతో కలిసి చేపల వేటకు వెళుతుండేదాన్ని. హైస్కూల్‌లో చదువుతున్నప్పుడు అన్ని క్రీడల్లో పాల్గొన్నాను. మండల, జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పలు పతకాలు కూడా సాధించా. ఆ సమయంలో మా కుటుంబానికి తెలిసిన ఒక కరాటే మాస్టారు ద్వారా ఆ క్రీడపై ఆసక్తి కలిగింది. కరాటేలో జాతీయ స్కూల్ గేమ్స్ జూనియర్ విభాగంలో స్వర్ణం పతకం కూడా సాధించా.

మలుపు తిప్పిన సంబరాలు...

2017లో నా జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఆ ఏడాది మా ఊళ్లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా వాటర్ స్పోర్ట్స్ (కనోయింగ్ కయాకింగ్) నిర్వహించారు. ఈ పోటీల్లో అంతకుముందు నేను చూడని బోట్లు కృష్ణా నది బ్యాక్ వాటర్‌లో దూసుకెళ్లాయి. ఆ బోట్లు, క్రీడాకారుల శైలి నన్ను ఆకర్షించాయి. పోటీలు నిర్వహించిన బలరామ్ నాయుడు సార్‌ను కలిసి వాటర్ స్పోర్ట్స్ గురించి తెలుసుకున్నా. కేరళ మాదిరి మా దగ్గరున్న వాతావరణం వాటర్ స్పోర్ట్స్‌కు బాగుంటుందని వాటర్ స్పోర్ట్స్ నిపుణుడు సాంబశివారెడ్డి సార్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అకాడమీ పెట్టడానికి సాధ్యసాధ్యాలను పరిశీలించడానికి ప్రభుత్వ బృందం వచ్చినప్పుడు మా పడవలోనే నాన్న, నేను వారికి నది మొత్తం తిప్పి చూపించాం. స్థానిక ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ గారి చొరవతో 2018లో అక్కడ 'శాప్' వాటర్ స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసింది.

అమ్మానాన్నల ప్రోత్సాహంతో...

అమ్మానాన్నల ప్రోత్సాహంతో వెంటనే అకాడమీలో చేరా. కోచ్‌లు నాగబాబు, శ్రీనివాస్ అప్పటివరకు మేము నేర్చుకున్న విద్యకంటే విభిన్నంగా ప్రొఫెషనల్ కోచింగ్ ఇవ్వడం ఆరంభించారు. అకాడమీలో మూడు బోట్లు ఉండగా మేము 30 మంది పిల్లలం ఉండేవాళ్లం. ఒకరి తర్వాత ఒకరు నేర్చుకునేవాళ్లం. ఆ సమయంలోనే 2019లో స్పోర్ట్స్ కోటాలో విజయనగరం జిల్లా గరివిడి వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాలలో డిప్లమో కోర్సులో సీటు వచ్చింది. ఈ కోర్సు చేస్తూనే శిక్షణ కొనసాగించి రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటా. నాన్న ఒక్కడి కష్టంపైన కుటుంబం మొత్తం బతకాలి. ఈ క్రమంలో చదువు పూర్తి చేసి ఏదైన ఉద్యోగం చేసి నాన్నకు అండగా ఉండాలా? లేదా వాటర్ స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకుని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలా? అనే ప్రశ్నలు ఉత్పన్నమైనప్పుడు, అమ్మానాన్న నాకు వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ ఇప్పిస్తామని అన్నారు.

డబ్బులు లేక...

గతేడాది థాయ్‌లాండ్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్, అంతర్జాతీయ వాటర్ వరల్డ్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించి, అందులో పాల్గొనే అవకాశం వచ్చింది. థాయ్‌లాండ్ వెళ్లడానికి రూ.1.80 లక్షలు కావాల్సి వచ్చింది. డబ్బులు లేక అవస్థలు పడుతుంటే... బాపట్లలో ప్రస్తుతం నేను చదువుతున్న వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ కళాశాల కరస్పాండెంట్ బుచ్చియ్య చౌదరి సహాయం చేశారు. ఆయన సహకారంతో అక్కడి వెళ్లాను కానీ, పతకాలు సాధించలేకపోయా. అయితే అక్కడి వాతావరణ పరిస్థితులు, నీటి ప్రవాహం తీరు, అంతర్జాతీయ స్థాయిలో పోటీ ఏ స్థాయిలో ఉంటుందో ఒక అవగాహన వచ్చింది. ఇక్కడలా నదీ జలాల్లో అక్కడ పోటీలు నిర్వహించడం లేదు. కృత్రిమ సరస్సు, అందులో కృత్రిమ అలలు సృష్టించి పోటీలు నిర్వహించడంతో నాకు కొత్తగా అనిపించి, అర్థం చేసుకోలేకపోయా.



తేజ, గిరిబాబు, చిన్నబాబు ప్రోత్సాహంతో శిక్షణకు మధ్యప్రదేశ్ వెళ్లా. అక్కడ జాతీయ కోచ్ కులదీప్ సార్ శిక్షణలో మరింత నైపుణ్యం సంపాదించాను.

తడి బట్టలతోనే..

రెండుసార్లు జాతీయ క్రీడల్లో పాల్గొన్నా పసిడి పతకం సాధించలేకపోయాననే బాధ నాలో ఎక్కువైంది. ఉత్తరాఖండ్‌లో ప్రస్తుతం జరుగుతున్న జాతీయ క్రీడలకు రెండు వారాలు ముందుగానే వెళ్లాను. పోటీలు జరిగే ప్రాంతానికి 10 కిలోమీటర్ల దూరంలో కానీ గదులు అద్దెకు దొరకలేదు. రోజూ ఆ కొండల మధ్యలోనే అంత దూరం ప్రయాణించి మా వంట మేమే చేసుకుంటూ సాధన చేశాను. ఎండ ఎక్కువ కాస్తే మంచు పర్వతాలు కరిగి ఉన్నఫలంగా నదిలో నీరు పెరిగేది. నీళ్లు చల్లగా ఉండడంతో పాటు ప్రవాహం వేగంగా ఉండేది. వీటన్నింటిపై ఒక అంచనాకు వచ్చా. గత రెండు జాతీయ క్రీడల్లో నేను ఓడిపోవడానికి ఒక కారణం మంచి బోటు లేకపోవడం కూడా. ఈసారీ అదే సమస్య. అయినా పతకం గెలవాలనే సంకల్పం. నాది ప్యాచీలు, రిపేర్లు చేసిన సాధారణ ఫైబర్ బోటు. ప్రత్యర్థులేమో అధునాతన కార్బన్ బోట్లు వేసుకొని సాధన చేస్తున్నారు. నా బోటు బరువు 27 కిలోలు ఉంటే వారి బోట్ల బరువు 13 కిలోలే. వారివి తేలికైన బోట్లు. నేను వేసుకునే బట్టలు ఒక్కసారి నీళ్లు పడితే ముద్దముద్దగా తడిసిపోయే సాధారణ దుస్తులు. వారివి శరీరమంతా తడవకుండా ఉండే ప్రత్యేకమైన సూట్లు. ఇవన్నీ నాకు పోటీలో ప్రతికూలాంశాలు. ఎలాగైనా ఈసారి స్వర్ణం సాధించాలనే పట్టుదల. నాన్నతో చెబితే 'అవన్నీ లేకుండానే నువ్వు ఇప్పటివరకు ఇన్ని పతకాలు సాధించావు. నీలో స్వర్ణం సాధించే సత్తా ఉంది' అంటూ మనోధైర్యం నింపారు. ఇప్పటివరకు కనోయి స్లాలోం ఈవెంట్‌లో స్వర్ణం మధ్యప్రదేశ్ రాష్ట్రాన్ని దాటి వేరే రాష్ట్రానికి పోలేదు. అంతటి పోటీని తట్టుకొని తొలిసారి నేను ఆంధ్రప్రదేశ్‌కు ఈ పతకాన్ని అందించా.

ఈ విజయం నాలో కొండంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. వచ్చే ఆసియా క్రీడలు, ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే నా ముందున్న లక్ష్యం. నాకు కావాల్సింది మంచి బోట్లు, దుస్తులు, జర్మనీ వంటి దేశాల్లో ప్రత్యేక శిక్షణ. రాష్ట్ర ప్రభుత్వం సాయం చేస్తే దేశం గర్వించే స్థాయికి ఎదుగుతా."

> **నాన్న అప్పులు చేసి...**
>
> దూర ప్రాంతాల్లో జరుగుతున్న పోటీల్లో పాల్గొనేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడ్డ సందర్భాలు అనేకం. నాన్న అప్పులు చేసి ఆ సమయానికి ఏదో విధంగా నన్ను పంపేవాడు. నాకు తొలిసారిగా 2022 గుజరాత్ నేషనల్ గేమ్స్‌లో పాల్గొనే అవకాశం లభించింది. అక్కడి వాతావరణం, నీటి ప్రవాహాన్నీ పూర్తిగా అంచనా వేయలేకపోవడంతో నాలుగో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తరువాత మరింత కసిగా శ్రమించాను. అదే ఏడాది చండీగఢ్‌లో జరిగిన జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, మధ్యప్రదేశ్‌లో జరిగిన అంతర్జాతీయ కనోయి స్లాలోంలో, ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో కాంస్య పతకాలు నెగ్గడంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. మరుసటి ఏడాది గోవాలో జరిగిన నేషనల్ గేమ్స్‌కు అర్హత సాధించా. అక్కడ రజత పతకం సాధించాను. దాంతో నా శక్తి సామర్థ్యాలపై నాకొక గురి కుదిరింది.

కోచ్‌లు లేకుండానే శిక్షణ...

2019లో ప్రభుత్వం మారాక మా ఊళ్లోని అకాడమీ మూత పడింది. అకాడమీ భవనం కూడా ఇప్పటికీ పూర్తికాలేదు. కోచ్‌లు లేకుండానే అక్కడున్న మూడు బోట్లతో మేమే సాధన చేసుకునేవాళ్లం. మా వెనుక ఇంట్లో పెద్దవాళ్లు తోడుగా వచ్చేవాళ్లు. సరైన సదుపాయాలు, శిక్షణ లేకపోవడంతో ఒక దశలో డీలా పడ్డా. ఆ తరుణంలో కొందరు క్రీడాకారులు

• ఎస్.ఎస్.బి.సంజయ్

కౌన్సెలింగ్

అందుకు ఒత్తిడి కారణమా?

డాక్టర్! నాకు ఒత్తిడి ఎక్కువ. ఆయనకు శారీరకంగా దగ్గరయ్యే సమయంలో అకస్మాత్తుగా ఆసక్తి సన్నగిల్లుతోంది. ఒత్తిడి తగ్గి, అందరిలా లైంగిక తృప్తి పొందే మార్గం సూచించండి?

- ఓ సోదరి, హైదరాబాద్



ముందు మీ ఒత్తిడికి చికిత్స తీసుకోవాలి. రోజు మొత్తంలో మీరు ఏ ఏ సమయాల్లో, ఏ పనులు చేసేటప్పుడు ఒత్తిడికి గురవుతున్నారో ఒక డైరీలో రాసుకోండి. ఇలా వారం పాటు రాస్తే ఒత్తిడికి అసలు కారణం తెలిసిపోతుంది. ఇలా రాసుకోవడం ద్వారా...ఉదయం నిద్ర లేచినప్పుడు, లేదా పడుకోబోయే ముందు, లేదా లైంగిక క్రీడకు ముందు... ఇలా ఏదో ఒక ఒత్తిడి క్రమం తెలుస్తుంది. ఆ క్రమాన్ని బట్టి కారణం ఏదో కూడా అర్థమవుతుంది. అలా తెలుసుకున్న ఒత్తిడి కారకాన్ని అదుపు చేసుకుంటే, ఒత్తిడి దానంతటదే అదుపులోకొస్తుంది. ఒక్కసారి ఒత్తిడి చేతిలో ఇరుక్కుంటే మీ జీవనశైలి, లైంగిక జీవితం రెండూ ప్రభావితమై, లైంగికాసక్తి పూర్తిగా సన్నగిల్లుతుంది. కాబట్టి మీ వారితో మాట్లాడి, లైంగికంగా దగ్గరయ్యే సమయంలో ఒత్తిడిని కలిగించే అంశాలకు దూరంగా ఉండే ప్రయత్నం చేయండి. అలా ఒత్తిడికి దూరంగా కాగలిగితే, ఒత్తిడి నుంచి తప్పించుకోగలిగే మెలకువలు కూడా మీకు అలవడతాయి. వాటిని అనుసరించి ఒత్తిడిని, దాని కారణంగా వస్తున్న అసంతృప్తినీ తేలికగా జయించవచ్చు. అలాగే మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం యోగా, ధ్యానం కూడా సాధన చేయవచ్చు.

- డాక్టర్ షర్మిలా మజుందార్,
చీఫ్ సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్,
హైదరాబాద్.

ఉప్పు ఇన్ని రకాలా?

వంటకాల తయారీకి ఉప్పు అత్యవసరం. రంగు, రుచి, ఆకారాన్ని అనుసరించి ఉప్పు ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఉప్పులో ఎన్ని రకాలు ఉన్నాయో తెలుసుకుందాం..!



టేబుల్ సాల్ట్ : ఇది మనం ప్రతిరోజూ వంటల్లో ఉపయోగించే సాధారణ ఉప్పు. సముద్రపు ఉప్పుని శుద్ధి చేసి దీనిని తయారు చేస్తారు. ఇందులో ఉండే అయోడిన్ థైరాయిడ్ పనితీరుని మెరుగుపరుస్తుంది.

సీ సాల్ట్ : సముద్రపు నీటిని ఆవిరి చేసి దీనిని ఉత్పత్తి చేస్తారు. ఇది చిన్న స్ఫటికాల మాదిరి మెరుస్తూ ఉంటుంది. ఇందులో ఆరోగ్యానికి ఉపకరించే మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం, జింక్, ఇనుము లాంటి ఖనిజాలు ఉంటాయి.

హిమాలయన్ పింక్ సాల్ట్ : ఇది హిమాలయ పర్వతాల్లో దొరుకుతుంది. దీనిని అత్యంత పరిశుభ్రమైన ఉప్పుగా పరిగణిస్తారు. ఇది ముతకగా కనిపిస్తూ ప్రత్యేకమైన రుచితో ఉంటుంది. ఇందులో సోడియం చాలా తక్కువ. వంటల్లో వాడడంవల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. శరీరంలో పీహెచ్ స్థాయి సమతౌల్యంలో ఉంటుంది. టాక్సిన్లు విసర్జితమవుతాయి. పోషకాలను శోషించుకునే శక్తి పెరుగుతుంది.

కోషెర్ సాల్ట్ : దీనిని కిచెన్ సాల్ట్ అని కూడా అంటారు. ఇది తెల్లగా చిన్న రాళ్ల మాదిరి ఉంటుంది. ఇందులో అయోడిన్ ఉండదు. దీనిని ఎక్కువగా మసాలా గ్రేవీలు, మాంసాహార కూరల తయారీలో ఉపయోగిస్తూ ఉంటారు.

బ్లాక్ సాల్ట్: ఇది లేత గులాబీ రంగులో ప్రత్యేకమైన రుచితో ఉంటుంది. ఇందులో సల్ఫర్ సహా పలు పోషకాలు ఉంటాయి. అందరూ ఇష్టపడే పానీపూరీ నీళ్లలో దీనినే కలుపుతారు. ఇది జీర్ణక్రియని వేగవంతం చేస్తుంది.

సైంధవ లవణం: సముద్రపు నీటిని ఆవిరి చేసినప్పుడు ఏర్పడే లేత ఎరుపు రంగు స్ఫటికాలను సైంధవ లవణంగా పరిగణిస్తారు. ఇందులో అయోడిన్ తక్కువ. ఎలక్ట్రోలైట్స్, న్యూట్రియెంట్స్ ఎక్కువ. దీనిని ఆయుర్వేద మందుల తయారీలో ఉపయోగిస్తారు.

పిల్లల షూ క్లీనింగ్ ఇలా...


పిల్లలు పాఠశాలకు వెళ్లేటప్పుడు వేసుకునే షూలను కనీసం రెండు రోజులకు ఒకసారి శుభ్రం చేయాలని నిపుణులు చెబుతున్నారు. తక్కువ సమయంలో షూలను ఎలా క్లీన్ చేయాలో తెలుసుకుందాం!



- షూలను ముందుగా పాత టూత్‌బ్రష్‌తో రుద్దుతూ వాటికి అంటిన మట్టిని తొలగించాలి. లోపల ఉండే సోల్‌ని తీసి షూని బాగా దులపాలి.
- డిటర్జెంట్, సర్ఫ్, షాంపూ కలిపిన నీళ్లలో పలుచని గుడ్డని ముంచి పిండాలి. దీనితో షూ లోపల, బయటా తుడవాలి. ఒక ట్రేలో ఈ నీళ్ల కొన్ని పోసి అందులో షూ అడుగు భాగం మునిగేలా ఉంచాలి. అయిదు నిమిషాల తరవాత మంచినీళ్లతో కడగాలి.
- టూత్ బ్రష్‌ను కొద్దిగా సర్ఫ్ లేదా షాంపూలో ముంచి దానితో తెలుపు రంగు షూల పై భాగాన్ని రుద్దాలి. మురికి మొత్తం వదిలాక కొన్ని నీళ్లు చిలకరిస్తూ పలుచని గడ్డతో తుడవాలి.
- షూలను శుభ్రం చేసిన తరవాత వాటి లోపల కాగితం ఉండలను లేదా పలుచని తువాలును గుండ్రంగా మడిచి ఉంచాలి. లోపలి భాగంలోని తడిని ఇవి పీల్చుకుంటాయి. అయిదు నిమిషాల తరవాత వీటిని తీసివేసి షూలకు బాగా గాలి తగిలేలా ఉంచి ఆరనివ్వాలి.
- షూ లేసులను, సోల్‌ని సబ్బునీటిలో ముంచి పది నిముషాలు నాననివ్వాలి. తరవాత మంచి నీళ్లలో ముంచి తీసి గాలికి ఆరబెట్టాలి.
- నైలాన్, కాటన్, పాలిస్టర్ పదార్థాలతో తయారైన కాన్వాస్ షూలను ముందుగా పైపైన శుభ్రం చేసి తరవాత పాత తువాలులో చుట్టి వాషింగ్ మెషిన్‌లో వేయవచ్చు.
- లెదర్, రబ్బర్, వినైల్ షూలను మాత్రం చేతితో క్లీన్ చేసుకోవాలి.
- షూలను శుభ్రం చేయడానికి గోరువెచ్చని నీటిని ఉపయోగించవచ్చు. బ్లీచ్, ఫ్యాబ్రిక్ సాఫ్ట్‌నర్‌లను వాడకూడదు.
- ప్రతిరోజూ పలుచని పొడి గుడ్డతో పైపైన తుడిచి పాలిష్ చేసుకుంటూ ఉంటే షూలు కొత్తవాటిలా మెరుస్తాయి.









అమ్మాయిల హాస్టల్ వార్డెన్‌లా అనిపించేది

చిరంజీవి



'బ్రహ్మ ఆనందం' ప్రీ రిలీజ్ వేడుకకు చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా కథాంశం తాతా-మనవళ్ల మధ్య జరిగే ఆసక్తికరమైన ప్రయాణం కావడంతో.. కార్యక్రమంలో తన తాతగారిని గుర్తుచేసుకున్నారు చిరు. "మా తాత పేరు రాధాకృష్ణ నాయుడు. ఆ మంచి బుద్ధి నాకు కొద్దిగా వచ్చింది. ఇక రామ్‌చరణ్ తాతయ్య అంటే మా నాన్నగారు చాలా అందగాడు. మా ఇంట్లో ఎవరికీ ఆయన అందం రాలేదు. నిజజీవితంలో మాకు హీరో అంటే ఆయనే. ఇక క్లీంకార తాతయ్య, అంటే నా గురించి చెప్పాలంటే.. ఇంట్లో ఉన్నప్పుడు నాకు మనవరాళ్లతో ఉన్నట్లు ఉండదు. ఓ లేడీస్ హాస్టల్ వార్డెన్‌లా ఉన్నట్లు ఉంటుంది. ఎందుకంటే నా చుట్టూ ఆడపిల్లలే ఉంటారు. అందుకే ఓ అబ్బాయిని కనమని చరణ్‌కు చెప్తుంటాను. మన వారసత్వం కొనసాగాలని అలా అంటుంటా" అని సరదాగా మాట్లాడారు. ఆడపిల్లలు కూడా వారసులేగా చిరు సార్ అంటూ కొందరు నెటిజన్లు చమత్కరిస్తున్నారు.



అల్లుఅర్జున్‌ను అన్‌ఫాలో చేసిన రామ్‌చరణ్

మెగా, అల్లు కుటుంబాల మధ్య విభేదాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రామ్‌చరణ్, అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేయడం చర్చనీయాంశం అయింది. రామ్‌చరణ్ ఇన్‌స్టాగ్రామ్‌లో అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేశారు. ఎంతో స్నేహభావంతో మెలిగే ఈ ఇరువురి మధ్య ఏం జరిగి ఉంటుందబ్బా అని అంతా చర్చించుకుంటున్నారు.

ఇలాంటి పాత్ర కోసమే తపించా

విష్వక్ సేన్



విష్వక్ సేన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'లైలా'. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రవిశేషాలను మీడియాతో పంచుకున్నారు విష్వక్ సేన్. "విభిన్న పాత్రల్లో నటించాలని ప్రతి నటుడికీ ఉంటుంది. 'భామనే సత్యభామనే', 'మేడం', 'చిత్రం భళారే విచిత్రం' 'రెమో' సినిమాలు చూసినప్పుడు నటుడిగా ఇలాంటి పాత్రలు చేయాలనిపించేది. ప్రేక్షకులు కూడా కొత్తదనాన్ని ఇష్టపడుతున్నారు. ప్రయోగాల్ని ఆదరిస్తున్నారు. దర్శకుడు ఈ సినిమా కథ చెప్పేటప్పుడు చాలా ఎంజాయ్ చేశాను. ఆయన చెప్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే సినిమా చేయాలని చాలా కాలంగా ఎదురుచూస్తున్నాను. ఈ కథతో కుదిరింది. థియేటర్లో ఉన్నంత సేపూ మీరు అన్ని విషయాలు మర్చిపోయి సినిమాను ఆస్వాదిస్తారు. ఒక్క క్షణం కూడా చూపు తిప్పుకోకుండా చూస్తారు. ఇందులో నేను పోషించిన 'సోనూ మోడల్, లైలా' రెండు పాత్రలు వేటికవే విభిన్నం. ఇందులో సోనూ.. లైలాగా మారడానికి గల కారణం అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ లుక్ కోసం తయారవ్వడానికి దాదాపు రెండు గంటలు పట్టేది. ఇంట్లో వాళ్లు ఈ లుక్‌లో నన్ను చూసి ఆశ్చర్యపోయారు. ఇందులో నటించిన ప్రతి ఒక్కరికీ గుర్తుండిపోయే పాత్ర దక్కింది. దర్శకుడు రామ్‌నారాయణ్ చాలా ప్రతిభావంతుడు. సినిమాను అనుకున్న దానికంటే బాగా తీశారు. నిర్మాత సాహు గారపాటి ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. లియోన్ జేమ్స్ అద్భుతమైన పాటలు ఇచ్చారు. ఈ సినిమా కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతరాన్ని తప్పక ఆకట్టుకుంటుంది. నా కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమా అవుతుంది. ఈ సినిమా కోసం రెండు పాటలు రాయడం మరిచిపోలేని అనుభూతి. ఇప్పటివరకూ 'లైలా' గెటప్ బాగుందని చాలా మంది ప్రశంసించారు. చిరంజీవి గారు 'నాకే కొరకాలనిపించింది' అని చెప్పడం మర్చిపోలేని ప్రశంస. ఈ సినిమాకు సీక్వెల్ తీయాలనే ఆలోచన ఉంది" అని చెప్పారు.



ఊరిలో వినోదం

వినోదం ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'బద్మాషులు'. మహేశ్, విద్యాసాగర్, మురళీధర్ గౌడ్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. శంకర్ చేగూరి దర్శకత్వంలో బీ బాలకృష్ణ, సీ శంకర్ నిర్మిస్తున్నారు. బుధవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. శంకర్ చేగూరి మాట్లాడుతూ 'సినిమా ఆద్యంతం నవ్వులు పంచుతుంది. కుటుంబంతో కలసి చూసేలా ఉంటుంది' అన్నారు. 'ఇది మన ఊరి కథ, ఇందులో పాత్రలు సహజంగా ఉంటాయి. సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: తేజ కూనూరు, సినిమాటోగ్రఫీ: వినీత్ పబ్బతి

రణభూమిలో రారాజు



'ఫ్యామిలీ స్టార్' చిత్రం తర్వాత విజయ్ దేవరకొండ కథానాయకుడిగా భారీ అంచనాలతో తెరకెక్కుతున్న చిత్రం 'వీడీ 12' (వర్కింగ్ టైటిల్). గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, టీజర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి 'కింగ్‌డమ్' అనే శక్తిమంతమైన టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన టీజర్ ఆద్యంతం కళ్లు చెదిరే యాక్షన్ సీక్వెన్స్, అనిరుధ్ నేపథ్య సంగీతం, విజయ్ నటనతో సరికొత్త అనుభూతిని పంచింది. మే 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈసారి థియేటర్లలోకి

నాలుగేళ్ల క్రితం ఓటీటీలో విడుదలై ఆకట్టుకున్న 'కృష్ణ అండ్ హిజ్ లీల' చిత్రం 'ఇట్స్ కాంప్లికేటెడ్' అనే టైటిల్‌తో వెండితెరపై ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌లో సిద్ధు



జొన్నలగడ్డ కథానాయకుడిగా నటించగా, రవికాంత్ పెరెపు దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సంజయ్ రెడ్డి నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్, సీరత్‌కపూర్ కథానాయికలు. కరోనా మహమ్మారి వల్ల ఏర్పడిన లాక్‌డౌన్ పరిస్థితుల నేపథ్యంలో 2020లో ఓటీటీలో విడుదల చేశారు. అక్కడ మంచి ఆదరణ దక్కించుకున్న ఈ చిత్రాన్ని ప్రేమికుల రోజు సందర్భంగా ఈనెల 14న థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం చిత్రబృందం నిర్వహించిన మీడియా సమావేశంలో రానా మాట్లాడుతూ 'ఈ సినిమాకు ఇది రీ రిలీజ్ కాదు. థియేటర్లలో తొలిసారి విడుదల చేస్తున్నాం' అన్నారు. ఈ సినిమాను ప్రేక్షకులు థియేటర్లలో చూడాలనే నా కోరిక నెరవేరబోతున్నందుకు ఆనందంగా ఉందన్నారు సిద్ధు జొన్నలగడ్డ. లాక్‌డౌన్‌లో ఎవరిళ్లలో వారు కూర్చొని చూశారు, ఈ సారి థియేటర్లలో అందరితో కలసి ఎంజాయ్ చేస్తూ చూడండి అని రవికాంత్ కోరారు.

అమ్మ సెంటిమెంట్ అలరిస్తుంది



దర్శకుడు అమ్మ రాజశేఖర్ తన తనయుడు అమ్మ రాగిన్‌ను హీరోగా పరిచయం చేస్తూ తెరకెక్కించిన చిత్రం 'తల'. అంకిత నస్కర్ హీరోయిన్. రాజీవ్ కనకాల, ఇంద్రజ కీలకపాత్రలు పోషించారు. శ్రీనివాస్ గౌడ్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ 'నా విమర్శకులకు ఈ సినిమాతో సమాధానం చెబుతాను. పోరాట ఘట్టాలతో పాటు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి' అని చెప్పారు. రాగిన్ రాజు మాట్లాడుతూ 'సినిమా కోసం టీం అంతా చాలా కష్టపడ్డాం. తల్లీ కొడుకుల సెంటిమెంట్, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అన్నారు. రాగిన్ రాజ్ అనుభవమున్న నటుడిలా చక్కగా నటించాడు, ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి అని శ్రీనివాస్ గౌడ్ కోరారు.

ప్రేమ కథ



'ప్రేమించుకుందాం రా, మనసంతా నువ్వే' తదితర చిత్రాల్లో బాలనటుడిగా ప్రేక్షకులను అలరించిన ఆనంద్ వర్ధన్ హీరోగా పరిచయమవుతున్నచిత్రం 'నిదురించు జహాపనా'. ప్రసన్న కుమార్ దేవరపల్లి దర్శకత్వంలో సామ్, వంశీ కృష్ణ వర్మ నిర్మించారు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా ఆనంద్ వర్ధన్ మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులకు కొత్త కథ చెప్పాలనే లక్ష్యంతో ఈ సినిమా చేశాం. ప్రేమకథకూ నిద్రకూ ఉన్న సంబంధం ఏమిటనేదే ఈ సినిమా కథ. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. నిద్ర చుట్టూ అల్లుకున్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం అని దర్శకుడు తెలిపారు. ఇంటిల్లిపాదిని అలరించే కంటెంట్ ఉన్న చిత్రమిదని నిర్మాత అన్నారు.



ఆ స్టెప్పులు వివాదాస్పదమవుతాయనుకోలేదు

ఊర్వశీ రౌతేలా

ఇటీవలే విడుదలై ఘనవిజయం సాధించిన 'డాకు మహారాజ్' చిత్రంలో ఊర్వశీ రౌతేలా ఓ ప్రత్యేక గీతంలో నర్తించడంతో పాటూ కీలక పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. ఇందులో కథానాయకుడు బాలకృష్ణతో ఆమె చేసిన 'దబిడి దిబిడి' పాటలోని స్టెప్పులు వివాదాస్పదమయ్యాయి. నెటిజన్లు విమర్శలు గుప్పించారు. దీనిపై ఆమె స్పందించారు. "ఈ పాట రిహార్సల్స్ అంతా ప్రశాంతంగా జరిగాయి. అన్ని పాటల్లో కొరియోగ్రఫీ ఏ విధంగా ఉంటుందో ఈ పాటలోనూ అలానే ఉండేలా చేశాం. శేఖర్ మాస్టర్ ఈ పాటకు స్టెప్పులు నేర్పించేటప్పుడు తప్పుగా, అసభ్యకరంగా అనిపించలేదు. సాధారణ స్టెప్పులలాగే అనిపించాయి. కానీ పాట విడుదలయ్యాక సోషల్‌మీడియాలో వచ్చిన నెగిటివ్ కామెంట్స్ షాకింగ్‌గా అనిపించాయి. అస్సలు ఈ పాటలోని స్టెప్పులపై ఇంత వ్యతిరేకత వస్తుందని.. ఇంతగా వివాదాస్పదమవుతాయని అనుకోలేదు. రిహార్సల్స్ క్లిప్ విడుదల చేసినప్పుడు ఎలాంటి విమర్శలు రాలేదు" అని చెప్పారు. సోషల్ మీడియాలో పనిగట్టుకుని చేసే కామెంట్స్‌ను నేను పట్టించుకోను. నిర్మాణాత్మక విమర్శలను ఎల్లప్పుడూ స్వాగతిస్తా" అని చెప్పారు.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● గురువారం 13 ఫిబ్రవరి 2025

'ముక్కోణం' ఫైనల్లో పాక్

కరాచీ: సల్మాన్ అఘా (134), రిజ్వాన్ (122 నాటౌట్) శతకాల మోతతో.. పాకిస్థాన్ ముక్కోణపు సిరీస్ ఫైనల్‌కు చేరుకొంది. తొలుత దక్షిణాఫ్రికా 352/5 స్కోరు చేసింది. క్లాసెన్ (87), మాథ్యూ బ్రీట్కే (83), బవుమా (82) రాణించారు. లక్ష్యాన్ని పాక్ 49 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వన్డేల్లో పాక్‌కిదే అత్యధిక ఛేదన. రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిన సఫారీలు టోర్నీ నుంచి నిష్క్రమించారు. శుక్రవారం జరిగే ఫైనల్లో పాక్-కివీస్ తలపడతాయి.

రిస్క్ తీసుకోకూడదనే..

» 'చాంపియన్స్' జట్టు నుంచి బుమ్రా అవుట్

» కోలుకున్నా.. బౌలింగ్ చేయలేని పరిస్థితి



న్యూఢిల్లీ: ఊహించినదే జరిగింది. భారత జట్టు పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్ చివరి టెస్ట్ సందర్భంగా బుమ్రా వెన్ను గాయానికి లోనైన సంగతి తెలిసిందే. దాంతో ఆస్ట్రేలియా పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత నుంచి అతడు బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పునరావాసం పొందుతున్నాడు. ఐదు వారాల పునరావాసం తర్వాత బుమ్రాకు స్కానింగ్ చేశారు. అందులో బాగానే ఉన్నట్టు తేలింది. కానీ చాంపియన్స్ ట్రోఫీ నాటికి బౌలింగ్ చేసే స్థాయికి అతడు ఫిట్‌నెస్ సంతరించుకున్నాడా..లేడా..అన్నది కచ్చితంగా తేల్చలేకపోయారు. దాంతో రిస్క్ తీసుకోకూడదని చీఫ్ సెలెక్టర్ అగార్కర్ నిర్ణయించాడు. ఫలితంగా చాంపియన్స్ ట్రోఫీ ప్రాథమిక జట్టు నుంచి బుమ్రాను తొలగించారు. అతడి స్థానంలో మరో పేసర్ హర్షిత్ రాణాకు చోటు కల్పించారు. అలాగే తొలుత ప్రకటించిన జట్టులో ఉన్న జైస్వాల్‌ను తప్పించారు. అతడికి బదులు మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఎంపిక చేశారు. చాంపియన్స్ ట్రోఫీలో భారత్ తన తొలి మ్యాచ్‌ను ఈనెల 20న దుబాయ్‌లో బంగ్లాదేశ్‌తో ఆడనుంది. ఇక జట్టులో కెప్టెన్ రోహిత్‌తోపాటు వైస్ కెప్టెన్ గిల్, కోహ్లీ, శ్రేయాస్, రాహుల్, పంత్, హార్దిక్, అక్షర్, వాషింగ్టన్, కుల్దీప్, హర్షిత్, షమి, అర్ష్‌దీప్, జడేజా, వరుణ్ చక్రవర్తి ఉన్నారు.

పునరాగమనం ఎప్పుడు?

బుమ్రా పోటీ క్రికెట్‌లోకి మళ్లీ ఎప్పుడు అడుగుపెడతాడనేది ప్రశ్న. చాంపియన్స్ ట్రోఫీకి దూరమవడంతో మరికొన్ని వారాలు అతడు ఎన్‌సీఏలోనే పునరావాసంలో ఉంటాడని సమాచారం. ఇక..ఐపీఎల్ వచ్చేనెల 21న ప్రారంభం కానుంది. ఆ టోర్నీలో బౌలింగ్ చేసే స్థాయికి సిద్ధమయ్యేలా అతడు ఎన్‌సీఏలో కొనసాగనున్నట్టు తెలిసింది. ఐపీఎల్‌లో బౌలింగ్ చేయడం ద్వారా..జూన్‌లో ఇంగ్లండ్‌తో జరిగే టెస్ట్ సిరీస్‌కు బుమ్రాను సిద్ధం చేయాలనేది ప్రణాళిక.



జిమ్నాస్ట్ నిషికకు స్వర్ణం

నిఖిల్ కాంస్య పట్టు » జాతీయ క్రీడలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ జిమ్నాస్ట్ నిషిక అగర్వాల్ జాతీయ క్రీడల్లో సంచలనం సృష్టించింది. ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ టేబుల్ వాల్ట్ పోటీల్లో టోక్యో ఒలింపియన్ ప్రణతి నాయక్ (ఒడిశా)ను ఓడించి స్వర్ణం కైవసం చేసుకుంది. డెహ్రాడూన్‌లో బుధవారం జరిగిన ఈ పోటీల్లో నిషిక 12.717 స్కోరుతో విజేతగా నిలిచింది. ప్రణతి (12.700) రజతం అందుకుంది. రెజ్లింగ్‌లో హైదరాబాదీ నిఖిల్ యాదవ్ కంచు పట్టు పట్టాడు. 65 కిలోల కాంస్య పతక పోరులో నిఖిల్ 12-2తో మహేష్ (కర్ణాటక)పై గెలిచి కాంస్యం నెగ్గాడు.

అసలంక శతకం.. లంక విజయం

కొలంబో: కెప్టెన్ అసలంక (127) శతకంతో కదం తొక్కడంతో బుధవారం జరిగిన తొలి వన్డేలో శ్రీలంక 49 పరుగులతో ఆస్ట్రేలియాని ఓడించింది. మొదట ఆతిథ్య జట్టు 46 ఓవర్లలో 214 పరుగులకే కుప్పకూలింది. ఛేదనలో స్పిన్నర్ తీక్షణ (4/40) దెబ్బకు ఆసీస్ 33.5 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌటైంది.

క్వార్టర్స్‌కు భారత్

కింగ్డావో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ గ్రూప్-డిలో తమ తొలి మ్యాచ్‌లో భారత్ 5-0తో మకావు జట్టును ఓడించింది. ఈ గెలుపుతో భారత్ తన గ్రూప్ నుంచి క్వార్టర్‌ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. తొలుత మిక్స్‌డ్‌లో సతీశ్/ఆద్య జోడీ 21-10, 21-9తో లియోంగ్/వెంగ్‌పై నెగ్గగా, పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-16, 21-12తో పంగ్ ఫాంగ్‌పై, మహిళల సింగిల్స్‌లో మాళవిక 21-15, 21-9తో హావో వాయిపై గెలిచారు. పురుషుల డబుల్స్‌లో చిరాగ్/అర్జున్ జంట 21-15, 21-19తో చిన్ పాన్/కొక్ వెన్‌ను, చివరిగా మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 21-10, 21-5తో ఎన్ వెంగ్ చి/హూయి చి వానును ఓడించడంతో భారత్ తిరుగులేని ఆధిక్యంతో క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. ఇక గ్రూప్‌లో తనకు చివరిదైన రెండో మ్యాచ్‌ను భారత్ గురువారం కొరియాతో ఆడనుంది. దీంతో ఈ గ్రూప్ టాపర్ ఎవరనేది తేలుతుంది. కొరియా ఇప్పటికే మకావును ఓడించింది.

రంజీ సెమీఫైనల్లో కేరళ

పుణె: కేరళ లోయరార్డర్ బ్యాటర్లు అజరుద్దీన్ (67 నాటౌట్), సల్మాన్ (44 బ్యాటింగ్) అద్భుతంగా ఆడి 43 ఓవర్లపాటు కశ్మీర్ బౌలర్లను ఎదుర్కొన్నారు. ఫలితంగా ఇరుజట్ల మధ్య రంజీ క్వార్టర్స్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. అయితే తొలిఇన్నింగ్స్‌లో లభించిన ఏకైక పరుగు ఆధిక్యంతో కేరళ సెమీస్ చేరింది. 399 పరుగుల లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 110/2తో బుధవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కేరళ 295/6 స్కోరుతో నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్మూ 280, కేరళ 281 రన్స్ చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో జమ్మూ 399/9 (డిక్లేర్) స్కోరు చేసింది.





శతకంతో సత్తాచాటిన ఓపెనర్

శుభ్‌మన్ గిల్ (112)

గిల్ సూపర్

● రాణించిన కోహ్లీ, అయ్యర్
● 142 పరుగులతో విజయం
● మూడో వన్డేలోనూ ఇంగ్లండ్ చిత్తు
● 3-0తో సిరీస్ భారత్ వశం

అహ్మదాబాద్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత్.. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. శుభ్‌మన్ గిల్ (102 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్సర్లతో 112) సెంచరీతో చెలరేగడంతో.. బుధవారం ఏకపక్షంగా సాగిన మూడో, ఆఖరి వన్డేలో భారత్ 142 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. తొలుత భారత్ 50 ఓవర్లలో 356 పరుగులకు ఆలౌటైంది. కోహ్లీ (55 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 52), శ్రేయాస్ అయ్యర్ (64 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 78), రాహుల్ (40) రాణించారు. రషీద్ నాలుగు, మార్క్ ఉడ్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో ఇంగ్లండ్ 34.2 ఓవర్లలో 214 పరుగులకు కుప్పకూలింది. అట్కిన్సన్ (38), బాంటన్ (38) టాప్ స్కోరర్లు. అక్షర్, అర్ష్‌దీప్, హర్షిత్, హార్దిక్ తలో 2 వికెట్లు దక్కించుకొన్నారు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు రోహిత్, కోహ్లీ టచ్‌లోకి రాగా.. తన ఎంపికను ప్రశ్నిస్తున్న వారికి గిల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'తో సమాధానమిచ్చాడు.

పోరాటమే లేకుండా..: భారీ లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు ఓపెనర్లు సాల్ట్ (23), డకెట్ (34) దూకుడైన ఆరంభాన్నిచ్చినా.. భారత స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఇంగ్లండ్ బ్యాటర్లు మరోసారి చేతులెత్తేశారు. ఈ దశలో బాంటమ్‌కి జతకలసిన రూట్ (24) జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. దీంతో 15వ ఓవర్లో ఇంగ్లండ్ వంద పరుగులు దాటింది. అయితే, సిక్స్‌తో గేర్ మార్చే ప్రయత్నం చేస్తున్న బాంటన్‌ను కుల్దీప్ బోల్తాకొట్టించాడు. 21వ ఓవర్‌లో రూట్‌ను అక్షర్ బౌల్డ్ చేయడంతో.. ఇంగ్లండ్ 136/4తో కష్టాల్లో పడింది. బట్లర్ (6), బ్రూక్ (19)ను హర్షిత్ పెవిలియన్ చేర్చడంతో.. మ్యాచ్ భారత్‌వైపు మొగ్గింది. అట్కిన్సన్ కొంత ప్రతిఘటించినా.. లివింగ్‌స్టోన్ (9), రషీద్ (0), ఉడ్ (9) అలా వచ్చి ఇలా వెళ్లారు.

బ్యాటర్లు భళా..: ఓపెనర్ గిల్ సూపర్ సెంచరీతో భారీ స్కోరుకు బాటలు వేయగా.. ఫామ్ కోసం తంటాలు పడుతున్న విరాట్ కోహ్లీ హాఫ్ సెంచరీతో టచ్‌లోకి రావడం అభిమానులకు ఊరటనిచ్చింది. ఇక, జోరుమీదున్న అయ్యర్ అదే తరహా దూకుడును ప్రదర్శించడంతో.. టీమిండియా సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. కోహ్లీతో కలసి రెండో వికెట్‌కు 116 పరుగులు జోడించిన గిల్.. అయ్యర్‌తో కలసి మూడో వికెట్‌కు 104 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టిదెబ్బ తగిలింది. గత మ్యాచ్‌లో శతకంతో జోరుమీదున్న రోహిత్ (1)ను ఉడ్ క్యాచవుట్ చేశాడు. అయితే, గిల్ మాత్రం ఆరంభం నుంచే చక్కని స్ట్రోక్ ప్లేతో బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. మరోవైపు క్రీజులో కుదురుకొనేందుకు కొంత సమయం తీసుకొన్న విరాట్ ఆ తర్వాత బ్యాట్‌కు పనిచెప్పడంతో తొలి పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 52/1తో నిలిచింది. 17వ ఓవర్‌లో ఫోర్ కొట్టిన గిల్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. జట్టు స్కోరు సెంచరీ మార్క్ దాటింది. ఆ తర్వాతి ఓవర్‌లో లివింగ్‌స్టోన్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన విరాట్.. సింగిల్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్నాడు. అయితే, కోహ్లీని అద్భుతమైన బంతితో క్యాచవుట్ చేసిన రషీద్ జట్టుకు కావాల్సిన బ్రేక్ అందించాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన అయ్యర్ కూడా ధాటిగా ఆడడంతో రన్‌రేట్ ఎక్కడా తగ్గలేదు. దీంతో సగం ఓవర్లు ముగిసే సరికి టీమిండియా 161/2తో పటిష్టంగా కనిపించింది. క్రమంగా 90ల్లోకి అడుగుపెట్టిన గిల్.. ఉడ్ బౌలింగ్‌లో ఫోర్‌తో శతకం పూర్తి చేసుకొన్నాడు. అయితే, రషీద్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ ఆడే క్రమంలో బౌల్డ్ అయ్యాడు. ఆ సమయానికి భారత్ స్కోరు 35 ఓవర్లలో 228/3. ఇక రషీద్ బౌలింగ్‌లో లెగ్ సైడ్ పడిన బంతిని ఆడే క్రమంలో అయ్యర్ అనవసరంగా వికెట్ పారేసుకోవడంతో.. చివరి 10 ఓవర్లలో భారత్ ఆశించినంత వేగంగా స్కోరు చేయలేక పోయింది. రాహుల్‌ను మహమూద్, హార్దిక్ (17)ను రషీద్ అవుట్ చేశారు. అక్షర్ పటేల్ (13), సుందర్ (14), హర్షిత్ (13) భారీ షాట్లు ఆడే క్రమంలో పెవిలియన్ చేరారు.

1 ఒకే వేదికపై మూడు ఫార్మాట్లలోనూ శతకం బాదిన తొలి భారత ఆటగాడిగా గిల్. గతంలో ఇక్కడ టెస్టులు, టీ20ల్లోనూ గిల్ సెంచరీ చేశాడు.

వేగంగా 2500 పరుగుల మార్క్ చేరుకొన్న తొలి ప్లేయర్‌గా శుభ్‌మన్. 50 ఇన్నింగ్స్‌లోనే గిల్ ఈ ఫీట్ సాధించాడు. హషీమ్ ఆమ్లా (51), ఇమాముల్ హక్ (52), వివ్ రిచర్డ్స్ (56) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

2 పరుగుల పరంగా వన్డేల్లో ఇంగ్లండ్‌పై భారత్‌కిది రెండో అతిపెద్ద (142 రన్స్) విజయం. 2008లో రాజ్‌కోట్ వేదికగా 158 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను భారత్ ఓడించింది.

స్కోరు బోర్డు

భారత్: రోహిత్ (సి) సాల్ట్ (బి) ఉడ్ 1, గిల్ (బి) రషీద్ 112, కోహ్లీ (సి) సాల్ట్ (బి) రషీద్ 52, అయ్యర్ (సి) సాల్ట్ (బి) రషీద్ 78, రాహుల్ (ఎల్బీ) మహమూద్ 40, హార్దిక్ (బి) రషీద్ 17, అక్షర్ (సి) బాంటన్ (బి) రూట్ 13, సుందర్ (సి) బ్రూక్ (బి) ఉడ్ 14, హర్షిత్ (సి) బట్లర్ (బి) అట్కిన్సన్ 13, అర్ష్‌దీప్ (రనౌట్) 2, కుల్దీప్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 50 ఓవర్లలో 356 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-6, 2-122, 3-226, 4-259, 5-289, 6-307, 7-333, 8-353, 9-353, 10-356; **బౌలింగ్:** మహమూద్ 10-0-68-1, ఉడ్ 9-1-45-2, అట్కిన్సన్ 8-0-74-1, రూట్ 5-0-47-1, రషీద్ 10-0-64-4, లివింగ్‌స్టోన్ 8-0-57-0.

ఇంగ్లండ్: సాల్ట్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 23, డకెట్ (సి) రోహిత్ (బి) అర్ష్‌దీప్ 34, బాంటన్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 38, రూట్ (బి) అక్షర్ 24, బ్రూక్ (బి) హర్షిత్ 19, బట్లర్ (బి) హర్షిత్ 6, లివింగ్‌స్టోన్ (స్టంప్డ్) రాహుల్ (బి) సుందర్ 9, అట్కిన్సన్ (బి) అక్షర్ 38, రషీద్ (బి) హార్దిక్ 0, మార్క్ ఉడ్ (సి) అయ్యర్ (బి) హార్దిక్ 9, మహమూద్ (నాటౌట్) 2; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 34.2 ఓవర్లలో 214 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-60, 2-80, 3-126, 4-134, 5-154, 6-161, 7-174, 8-175, 9-193. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 5-0-33-2, హర్షిత్ రాణా 5-1-31-2, సుందర్ 5-0-43-1, అక్షర్ 6.2-1-22-2, హార్దిక్ 5-0-38-2, కుల్దీప్ 8-0-38-1.

బిజినెస్

తగ్గిన నాట్కో ఫార్మా లాభం

ఒక్కో షేరుకు 75% మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాట్కో ఫార్మా.. డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికంలో రూ.132.40 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.212.70 కోట్లు)తో పోల్చితే లాభం 37.75 శాతం తగ్గింది. ఫార్ములేషన్స్ ఎగుమతులు తగ్గటం పనితీరుపై ప్రభావం చూపించిందని కంపెనీ పేర్కొంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.795.60 కోట్ల నుంచి రూ.651.10 కోట్లకు తగ్గింది. ఈ కాలంలో ఫార్ములేషన్స్ ఎగుమతులు రూ.605.60 కోట్ల నుంచి రూ.285.80 కోట్లకు తగ్గగా ఏపీఐ వ్యాపారం రూ.46.30 కోట్ల నుంచి రూ.66.60 కోట్లకు పెరిగినట్లు పేర్కొంది. దేశీయ ఫార్ములేషన్స్ వ్యాపారం కూడా రూ.99.40 కోట్ల నుంచి రూ.96.10 కోట్లకు తగ్గాయి. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ డైరెక్టర్ల బోర్డు మూడోసారి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.1.50 (75%) మధ్యంతర డివిడెండ్‌ను అందించనున్నట్లు తెలిపింది. డివిడెండ్ చెల్లింపునకు రికార్డు తేదీగా ఈ నెల 18ని ఖరారు చేయగా.. చెల్లింపులు 28వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు నాట్కో వెల్లడించింది.

సువెన్ ఫార్మా లాభంలో 53 % వృద్ధి

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో సువెన్ ఫార్మా ఏకీకృత ప్రాతిపదికన రూ.322.86 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.83.29 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.46.75 కోట్లు)తో పోల్చితే లాభం 53.25 శాతం వృద్ధి చెందింది. ఈ కాలంలో ఆదాయం రూ.234.16 కోట్ల నుంచి రూ.322.86 కోట్లకు పెరిగింది.

స్టాండర్డ్ గ్లాస్ ఆదాయం 143 కోట్లు

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్)..కాగా డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 142.83 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.15.89 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కాగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు గాను రూ.454.93 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.52.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. కాగా అనుబంధ సంస్థ ఎస్2 ఇంజనీరింగ్ యూనిట్ 5 కార్యకలాపాలు ఫిబ్రవరి నెలాఖరు నాటికి ప్రారంభం కావచ్చని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు ఎగుమతుల కోసం అమెరికాలో ఏర్పాటు చేస్తున్న కొత్త అనుబంధ సంస్థ మార్చి త్రైమాసికం ముగిసే నాటికి పూర్తి కావచ్చని తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,670 ▼	79,400 ▼	1,07,000 ▲
విజయవాడ	87,500 ▼	80,500 ▼	97,000 ▼
విశాఖపట్నం	85,040 ▼	77,950 ▼	94,530 ▲
రాజమండ్రి	86,620 ▼	79,400 ▼	97,800 ▼
ప్రొద్దుటూరు	87,750 ▼	81,260 ▼	95,700 ▼
ముంబై	84,845 ▼	77,718 ▼	94,189 ▲

భాష, నిబంధనలు సరళం

కాలం చెల్లిపోయిన నిబంధనలకు తిలోదకాలు

నేడే పార్లమెంటు ముందుకు కొత్త ఐటీ చట్టం



2026 ఏప్రిల్ 1 నుంచి అమలు

ఆదాయపు పన్ను (ఐటీ) చెల్లింపుదారులను గందరగోళానికి గురి చేస్తున్న అసెస్‌మెంట్ సంవత్సరం, గత సంవత్సరం వంటి పదాలు ఇక తెరమరుగు కానున్నాయి. గురువారం పార్లమెంటులో ప్రతిపాదించబోతున్న కొత్త ఐటీ బిల్లులో ఆ పదాల స్థానంలో "ట్యాక్స్ సంవత్సరం" అనే పదం జోడించారు. ఏ సంవత్సరంలో అయినా ఏప్రిల్ 1 నుంచి తదుపరి సంవత్సరం మార్చి 31 వరకు విస్తరించి ఉండే 12 నెలల కాలాన్ని ఇక నుంచి "పన్ను సంవత్సరం"గా వ్యవహరిస్తారు. ప్రస్తుతం ఐటీ చట్టంలో అసెస్‌మెంట్ సంవత్సరం (ఏవై), గత సంవత్సరం (పీవై) అనే పదాలున్నాయి. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వచ్చిన ఆదాయాన్ని 2025-26 అసెస్‌మెంట్ సంవత్సరంలో మదింపు చేసి పన్ను విధిస్తారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఐటీ చట్టం1961లో 298 సెక్షన్లు, 14 షెడ్యూల్స్ ఉండగా ప్రతిపాదిత కొత్త బిల్లు తగు మార్పులతో సరికొత్తగా రూపొందించిన 526 సెక్షన్లు, 23 అధ్యాయాలు, 16 షెడ్యూల్స్ కలిగి ఉంటుంది. మొత్తం పేజీల సంఖ్య 622. ప్రస్తుత చట్టంతో పోల్చితే పేజీల సంఖ్య సగం కన్నా తక్కువ ఉంటుంది. ఐటి చట్టం 1961ని రూపొందించినప్పుడు దానిలో 880 పేజీలున్నాయి.

భాష సరళతరం

అందరికి అర్థమయ్యే విధంగా కొత్త బిల్లులో భాషను సరళం చేశారు. పాత చట్టంలో ఉపయోగించిన భాషలోని పలు సంక్లిష్ట పదాలు, వాక్యాలు తొలగించారు. సుదీర్ఘమైన వాక్యాలను కుదించారు. అంతగా ఉపయోగంలో లేని, అనవసరమైనవిగా భావిస్తున్న సెక్షన్లను కూడా తొలగించారు. ఇందుకు ఉదాహరణ ఫ్రింజ్ బెనిఫిట్ ట్యాక్స్. తేలిగ్గా చదువుకోవడానికి, వివరించేందుకు వీలుగా "నిబంధనలు లేదా వివరణల"ను కూడా ఈ బిల్లులో తొలగించారు. ఐటీ చట్టం 1961లో నాట్‌విత్‌స్టాండింగ్ (అయినప్పటికీ) అనే పదం విరివిగా ఉపయోగంలో ఉంది. కొత్త బిల్లులో దాని స్థానంలో "ఇర్రెస్పెక్టివ్" అనే పదం ఉపయోగించారు. టీడీఎస్, ప్రిజంప్టివ్ టాక్సేషన్, వేతనాలు, మొండి బకాయిల మినహాయింపు వంటి అంశాల్లో నిబంధనల స్థానంలో పట్టికలు ప్రవేశపెట్టారు. అలాగే కొత్త బిల్లులో పొందుపరిచిన "పన్ను చెల్లింపుదారుల చార్టర్"లో వారికి గల హక్కులు, బాధ్యతలు వివరించారు. పన్ను వివాదాలు గణనీయంగా తగ్గించడం లక్ష్యంగా ఎంప్లాయీస్ స్టాక్ ఆప్షన్లపై (ఇసాప్) పన్నులో మరింత స్పష్టత ఇచ్చారు. చట్టం సరళతరం చేయడం లక్ష్యంగా మొత్తం ఆదాయంలో భాగంగా పరిగణించని ఆదాయాన్ని షెడ్యూల్స్‌లోకి మార్చారు.

లోక్‌సభలో గురువారం బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం అది ఆర్థిక వ్యవహారాల స్టాండింగ్ కమిటీ పరిశీలనకు వెళ్తుంది. స్టాండింగ్ కమిటీ సమూలంగా పరిశీలించి, పార్లమెంటు ఆమోదించిన అనంతరం కొత్త బిల్లు 2026 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తుంది. గత ఆరు దశాబ్దాల కాలంలో ఐటీ చట్టం 1961కి పలు సవరణలు జరిగాయని, ఫలితంగా చట్టంలో సరళత్వం లోపించి సంక్లిష్టంగా మారిందని కొత్త ఐటీ బిల్లు ప్రతిపాదించడానికి కారణాలను వివరించే ప్రకటనలో ప్రభుత్వం తెలిపింది. ఐటీ శాఖ అధికారులు, ప్రాక్టీషనర్లు, పన్ను చెల్లింపుదారులు సైతం వీటిపై ఆందోళన ప్రకటించడంతో ఐటీ చట్టం 1961ని సమగ్రంగా సమీక్షించనున్నట్టు 2024 జూలై బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించింది. తదుపరి సీబీడీటీ ఇంటర్నల్ కమిటీని నియమించింది. చట్టంలోని వివిధ అంశాలు పరిశీలించేందుకు మొత్తం 22 స్పెషలైజ్డ్ సబ్-కమిటీలు ఏర్పాటు చేశారు. భాష సరళీకరణ, లిటిగేషన్లు తగ్గింపు, కంప్లయెన్స్ భారం సడలింపు, కాలం చెల్లిపోయిను ఉపయోగంలో లేని నిబంధనల తొలగింపు అనే నాలుగు అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. వివిధ వర్గాల నుంచి 6500 వరకు సలహాలు అందాయి.

ఆదాయపు పన్ను బిల్లు 2025 ప్రధానాంశాలు

- ఈ బిల్లులో భాషను సరళీకరించడంతో పాటు అనవసరమైన నిబంధనలు తొలగించారు. వాక్యాలు కుదించారు.
- ఈ బిల్లు కొత్తగా ఎలాంటి పన్నులు విధించదు. ఆదాయపు పన్ను చట్టం 1961లోని పన్ను విధింపు నిబంధనలన్నింటినీ ఒక చోట చేరుస్తుంది.
- 622 పేజీలు గల ఈ కొత్త బిల్లులో మొత్తం 536 సెక్షన్లు, 23 అధ్యాయాలు, 16 షెడ్యూల్స్ ఉన్నాయి. గతంలోని 1961 చట్టంలో 298 సెక్షన్లు, 23 అధ్యాయాలు, 14 షెడ్యూల్స్ ఉన్నాయి.
- 2026 ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త చట్టం అమలులోకి వస్తుంది. ఒకసారి చట్టాన్ని నోటిఫై చేసిన అనంతరం నిబంధనలు పొందుపరుస్తారు.
- కొత్తగా "పన్ను సంవత్సరం" అనే కాన్సెప్ట్ ప్రవేశపెట్టారు. పన్ను చెల్లింపుదారులను గందరగోళానికి గురి చేస్తున్న "గత సంవత్సరం", "అసెస్‌మెంట్ సంవత్సరం" వంటి సంక్లిష్ట పదాలను కొత్త బిల్లులో తొలగించారు.
- "అయినప్పటికీ" (నాట్‌విత్‌స్టాండింగ్) పదాన్ని తొలగించి దాని స్థానంలో "దానితో సంబంధం లేకుండా" (ఇర్రెస్పెక్టివ్) పదం చేర్చారు.
- "వివరణలు లేదా నిబంధనలు" పక్కన పెట్టి వాటికి బదులుగా పట్టికలు, సూత్రాలను పొందుపరిచారు.
- పన్ను చెల్లింపుదారులకు హక్కులు, బాధ్యతలను నిర్దేశించే పన్ను చెల్లింపుదారుల చార్టర్‌ను ఈ బిల్లులో కొత్తగా జోడించారు.
- మార్కెట్ అనుసంధానిత డిబెంచర్ల విషయంలో పెట్టుబడి లాభాలను మదింపు చేసే ప్రత్యేక నిబంధన పొందుపరిచారు.
- వేతనాలకు సంబంధించిన మినహాయింపులన్నీ గతంలో విభిన్న సెక్షన్లు/నిబంధనలు విస్తరించి ఉండగా కొత్త బిల్లులో అవన్నీ ఒకే చోట ఉండేలా చూశారు.



ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	100	విజయవాడ	111
వరంగల్	100	గుంటూరు	116
కరీంనగర్	100	ఒంగోలు	116
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	90
కర్నూలు	100	నెల్లూరు	95
విశాఖపట్నం	103	అనంతపురం	95
గోదావరి	111		



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
13వ తేదీ		విజయవాడ	450
హైదరాబాద్	440	గోదావరి	455
వరంగల్	442	విశాఖపట్నం	465
చిత్తూరు	493	డజను గుడ్లు రూ. 72	

5 నెలల కనిష్ఠానికి ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ: దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం జనవరి నెలలో ఐదు నెలల కనిష్ఠ స్థాయి 4.31 శాతానికి దిగి వచ్చింది. కూరగాయలు, గుడ్లు, పప్పు దినుసుల ధరల్లో తగ్గుదల ఇందుకు దోహదపడింది. గత ఏడాది ఆగస్టులో నమోదైన కనిష్ఠ స్థాయి 3.65% కాగా ఆ తర్వాత నమోదైన కనిష్ఠ స్థాయి ఇదే. డిసెంబరు నెలలో ద్రవ్యోల్బణం 5.22%గా ఉంది. డిసెంబరుతో పోల్చితే జనవరిలో ఇది 0.91% తగ్గింది. కాగా జనవరిలో ఆహార వస్తువుల విభాగంలో ద్రవ్యోల్బణం 6.02% ఉంది. డిసెంబరుతో పోల్చితే గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 5.76 శాతం నుంచి 4.64 శాతానికి దిగి వచ్చినట్లు ఎన్‌ఎస్‌ఓ తెలిపింది. ప్రధానంగా ఆహార ద్రవ్యోల్బణం 8.65 శాతం నుంచి 6.31 శాతానికి తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో ఆహార ద్రవ్యోల్బణం 7.9 శాతం నుంచి 5.53 శాతానికి దిగిరాగా స్థూల ద్రవ్యోల్బణం 4.58 శాతం నుంచి 3.87 శాతానికి దిగి వచ్చింది.

కుంగిన పారిశ్రామికం: గనులు, తయారీ రంగం నీరసపడడంతో డిసెంబరు నెలలో పారిశ్రామికాభివృద్ధి రేటు మూడు నెలల కనిష్ఠ స్థాయి 3.2 శాతానికి తగ్గింది. ప్రభుత్వం గత నవంబరు పారిశ్రామికాభివృద్ధి రేటును 5.2% నుంచి 5 శాతానికి కుదించింది. కాగా డిసెంబరులో తయారీ రంగం వృద్ధిరేటు 4.6%నుంచి 3 శాతానికి, గనుల రంగం వృద్ధిరేటు 5.2% నుంచి 2.6 శాతానికి తగ్గాయి.

కావేరీ సీడ్ లాభంలో 29% వృద్ధి

కావేరీ సీడ్ కంపెనీ లిమిటెడ్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.154.77 కోట్ల ఆదాయంపై రూ.15.04 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 29.05 శాతం, ఆదాయం 30.63 శాతం వృద్ధి చెందింది. సమీక్షా కాలంలో ఎగుమతులపై కొద్దిగా ప్రభావం పడినప్పటికీ దేశీయంగా అమ్మకాలు పెరగటం ఎంతగానో కలిసి వచ్చిందని కంపెనీ పేర్కొంది.

స్ట్రింగ్ మెటావర్స్ లాభం రూ.10 కోట్లు: డిసెంబరు త్రైమాసికంలో స్ట్రింగ్ మెటావర్స్ లిమిటెడ్ (బయోగ్రీన్ పేపర్స్ లిమిటెడ్) రూ.115.69 కోట్ల ఏకీకృత ఆదాయంపై రూ.10.21 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఈ కాలంలో కంపెనీ.. డిజిటల్ అడ్వైజరీ ప్లాట్‌ఫామ్ విడుదలతో యూఏఈలోని రస్ అల్-ఖైమాకు కార్యకలాపాలు విస్తరించింది.

6 రోజుల్లో రూ.18 లక్షల కోట్ల నష్టం

» మరో 122 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్

ముంబై: వాణిజ్య యుద్ధ భయాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఆరో రోజూ నష్టాలు చవిచూశాయి. బుధవారం ట్రేడింగ్ తొలి గంటలోనే సెన్సెక్స్ 905 పాయింట్లు క్షీణించి 75,388 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. ఆర్థిక సేవలు, లోహ రంగాల షేర్లలో కొనుగోళ్లతో సూచీ మళ్లీ తేరుకుని మధ్యాహ్నం ఒక దశలో స్వల్ప లాభాల్లో ట్రేడైనప్పటికీ.. ఆయిల్, ఐటీ రంగ షేర్లలో అమ్మకాల కారణంగా తిరిగి నష్టాల్లోకి జారుకుంది. చివరికి సెన్సెక్స్ 122.52 పాయింట్ల నష్టంతో 76,171.08 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 26.55 పాయింట్లు కోల్పోయి 23,045.25 వద్ద ముగిసింది. గడిచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,412.73 పాయింట్లు (3.07 శాతం), నిఫ్టీ 694 పాయింట్లు (2.92 శాతం) క్షీణించాయి. ఆరు రోజుల్లో రూ.18 లక్షల కోట్ల మార్కెట్ సంపద తరిగిపోయింది. దాంతో బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాప్ రూ.407.46 లక్షల కోట్లకు (4.69 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

క్లెయిమ్ చేయని ఎంఎఫ్‌ల శోధన కోసం మిత్రా

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ.. మదుపరుల కోసం మరో సౌలభ్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. క్రియారహిత లేదా క్లెయిమ్ చేసుకోని తమ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)ను శోధించి, రీక్లెయిమ్ చేసుకునేందుకు వీలుగా మిత్రా పేరుతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను బుధవారం ప్రవేశపెట్టింది. గతంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టి మరిచిపోయినవారు మిత్రా ద్వారా తమ పోలియోను శోధించి, ప్రస్తుత నియమావళికి అనుగుణంగా కేవైసీని అప్‌డేట్ చేసి క్లెయిమ్ చేసుకునే వీలుంటుందని సెబీ పేర్కొంది. మదుపరులకు ఈ విషయాన్ని తెలియజేయాలని ఫండ్ మార్కెట్ సంబంధిత వర్గాలందరినీ సెబీ నిర్దేశించింది.

హైదరాబాద్‌లో ఎన్‌ఫ్యాబ్రికా కార్యకలాపాలు షురూ

హైదరాబాద్‌లోని తన కొత్త కార్యాలయం, ఆర్ అండ్ డీ కేంద్రంలో కార్యకలాపాలను ప్రారంభించినట్లు అమెరికాకు చెందిన ఫ్యాబ్‌లెస్ సెమీకండక్టర్ కంపెనీ ఎన్‌ఫ్యాబ్రికా కార్పొరేషన్ బుధవారం ప్రకటించింది. భారత మార్కెట్లో ప్రవేశానికి ఎన్‌ఫ్యాబ్రికా హైదరాబాద్‌ను ఎంచుకుంది. తమ కార్యకలాపాల కోసం అత్యున్నత నిపుణులను నియమించుకోనున్నట్లు, 2025 చివరికల్లా ఉద్యోగులను నాలుగింతల స్థాయికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎన్‌ఫ్యాబ్రికా వెల్లడించింది.

హోంగార్డులకు జీతాలివ్వకపోవడం సిగ్గుచేటు

» సీఎం రేవంత్ ఏం జవాబు చెబుతారు?: హరీశ్‌రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామంటూ.. ప్రచారం చేసుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 12వ తేదీ వరకు కూడా హోంగార్డులకు జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటని మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో 16 వేలమందికిపైగా ఉన్న హోంగార్డులు.. తమకు వచ్చే చిన్న జీతం పైనే ఆధారపడి జీవిస్తున్నారని, చేతిలో చిల్లిగవ్వ లేక వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బుధవారం 'ఎక్స్' వేదికగా ఆయన తెలిపారు. మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీరికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు.. ఇది ప్రజాపాలన కాదు, ప్రజావ్యతిరేక పాలన అని పేర్కొన్నారు. హోంగార్డులకు వేతనాలు తక్షణం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాగా, దక్షిణాది రాష్ట్రాల విషయంలో 'చోటీ సోచ్' అంటూ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని హరీశ్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణ చేస్తూ, ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు మరింత వృద్ధి చెందేలా చేయూతనివ్వాలని దక్షిణాది రాష్ట్రాలు డిమాండ్ చేస్తే.. అవమానకరంగా మాట్లాడటం కేంద్ర మంత్రి స్థాయికి తగదని అన్నారు. గ్రోత్ ఇంజన్‌గా ఉన్న తెలంగాణ సహా ఇతర దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధే దేశాభివృద్ధికి తోడ్పడుతుందన్న విషయాన్ని గుర్తించాలని హరీశ్‌రావు సూచించారు.

ప్రజలు నిలదీస్తారనే రాహుల్ పర్యటన రద్దు

» మార్చి 8న మహిళా శంఖారావం: కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు నిలదీస్తారనే భయంతోనే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వరంగల్ పర్యటన రద్దు చేసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. వరంగల్ రైతు డిక్లరేషన్ అమలు చేయలేదు కాబట్టి రైతులు ప్రశ్నిస్తారని, ప్రజల ముందుకు వచ్చే ధైర్యం లేకనే ఆయన పారిపోయారని అన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మార్చి 8న చేపట్టనున్న మహిళా శంఖారావం పోస్టర్‌ను బుధవారం ఆమె తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహిళలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్న డిమాండ్‌తో మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మార్చి 8న హైదరాబాద్‌లో మహిళా శంఖారావం చేపట్టనున్నట్లు తెలిపారు.

సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

» కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ బీజేపీ ఎంపీల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని దేశ వ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి బీజేపీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గోడం నగేష్, రఘునందన్‌రావు, డీకే అరుణ తదితరులు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఎంపీల వెంట ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, మాజీ ఎంపీ సీతారాంనాయక్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఎంపీలు తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. 15వ తేదీన సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశామని చెప్పారు. కాగా, కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో భేటీ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జోగులాంబ ఆలయం, కురుమూర్తి, మన్నెంకొండ, మల్దకల్ తిమ్మప్ప దేవాలయాల అభివృద్ధికి నిధులివ్వాలని ఎంపీ డీకే అరుణ కోరారు.

కాంగ్రెస్ కలిసి రాకుంటే ఒంటరిగానే పోటీ

» 'స్థానికం'లో బలమున్న చోట్ల పోటీ: కూనంనేని

హైదరాబాద్/మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కలిసి వస్తే ఆ పార్టీతో ముందుకు సాగుతామని, లేదంటే సీపీఐకి బలం ఉన్న చోట్ల ఒంటరిగా పోటీ చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. బుధవారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీ తప్ప కలిసి వచ్చే అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకునే ఆలోచనలో సీపీఐ ఉందన్నారు. ప్రజాప్రతినిధుల పట్ల మంత్రులు, అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఏ మాత్రం బాగోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండియా కూటమిలో పార్టీలన్నింటిని కలుపుకొని పోయేలా కాంగ్రెస్ వ్యవహరించడంలేదని పేర్కొన్నారు. కాగా, చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌పై దాడికి పాల్పడడం బాధాకరమని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాముడి పేరుతో దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఫిల్మ్‌నగర్ దైవసన్నిధానంపై 'పీఠ'ముడి

» ట్రస్టీగా శారదా పీఠాధిపతిని చైర్మన్ మోహన్‌బాబు తొలగించడంతో వివాదం

» హంపీ పీఠం, సన్నిధానం కలిపి ఉన్న లోగో బయటికిరావడంతో దుమారం

» నేడు సన్నిధానానికి విరూపాక్ష విద్యారణ్య భారతీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లోని దైవసన్నిధానం పాలకమండలికి సంబంధించిన ఓ విషయం వివాదాస్పదంగా మారుతుంది. ఫిల్మ్‌నగర్ ఆలయం(దైవ సన్నిధానం) ట్రస్టీగా ఉన్న శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్టు చైర్మన్ మోహన్‌బాబు లేఖ రాయగా దీనిపై శారదాపీఠం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మరోపక్క, శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థాన సంచలిత, ఫిల్మ్‌నగర్ దైవ సన్నిధానం పేరిట ఉన్న లోగో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. దీంతో సన్నిధానం హంపీ పీఠం చేతుల్లోకి వెళుతుందనే దుమారం రేగింది. తెలుగు సినీ ప్రముఖులు జూబ్లీహిల్స్ ఫిల్మ్‌నగర్‌లో 2004లో దైవ సన్నిధానం ప్రారంభించారు. నటుడు జగపతిబాబు తండ్రి వీబీ రాజేంద్రప్రసాద్, శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ట్రస్టీలుగా వ్యవహరించారు. మురళీమోహన్, చిరంజీవి సతీమణి సురేఖ, పరుచూరి గోపాలకృష్ణ, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి, చుక్కపల్లి సురేష్ తదితర 12 మంది బోర్డు సభ్యులుగా ఉన్నారు. మురళీమోహన్ పలుమార్లు బోర్డు చైర్మన్‌గా వ్యవహరించగా మోహన్‌బాబు 2018లో చైర్మన్‌గా నియమితులయ్యారు. రెండేళ్లకోసారి ట్రస్టీలు, బోర్డు సభ్యులు కలిసి చైర్మన్‌ను నిర్ణయిస్తారు. అయితే, కరోనా తదనంతర పరిణామాల తర్వాత ఇప్పటిదాకా చైర్మన్ నియామకం జరగలేదు. మోహన్‌బాబు తనని తాను చైర్మన్‌గా ప్రకటించుకున్నారు. అయితే, మోహన్‌బాబు చైర్మన్‌గా కొనసాగడాన్ని శారదాపీఠం తప్పుబట్టింది. దీంతో స్వరూపానందేంద్ర సరస్వతిని ట్రస్టీగా తొలగిస్తున్నామని చైర్మన్ మోహన్‌బాబు పీఠానికి లేఖ పంపారు. అయితే, ట్రస్టీని తొలగించే అధికారం చైర్మన్‌కు లేదని శారదాపీఠం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. బోర్డు సభ్యులకు నోటీసులు పంపింది. ఈ కేసు విచారణలోనే ఉండగా.. దైవసన్నిధానాన్ని అధీనంలోకి తీసుకోవాలని బోర్డు పలు పీఠాలను సంప్రదించిందని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో హంపీ పీఠం నుంచి విరూపాక్ష విద్యారణ్య భారతీస్వామి గురువారం ఆలయాన్ని సందర్శిస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో ఫిల్మ్‌నగర్ దైవసన్నిధానం విషయంలో పడిన పీఠముడి ఎలా వీడుతుందనేది చర్చనీయాంశంగా మారింది.

మార్జాలం.. మాంసం ముక్క.. మందిరం!

మాంసం ముక్కను ఆలయంలో వదిలేసిన పిల్లి.. విషయం తెలియక భక్తుల గుస్సా

ఇతర వర్గాల వారి పనేనని.. ఆలయాన్ని అపవిత్రం చేశారని ఆవేదన

టప్పాచబుత్ర సంకట విమోచన హనుమాన్ ఆలయంలో ఘటన

సీసీ ఫుటేజీ పరిశీలన.. పిల్లి పనేనని తేలడంతో ఊపిరి పీల్చుకున్న భక్తులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆ పిల్లికి నోట కరచుకొనేందుకు మాంసం ముక్కే దొరకాలా! దొరికింది పో.. ఆ మాంసం ముక్కను నేరుగా తెచ్చి ఆలయ ప్రాంగణంలోనే వదిలేయాలా! వదిలేసింది పో.. ఎవ్వరూ చూడని, అసలు ఆలయమే తెరుచుకోని ప్రాతఃకాలంలోనే వదిలేయాలా! మరి.. ఆ మాంసం ముక్క, ఆలయానికొచ్చిన భక్తుల కంట పడితే? టప్పాచబుత్రలోని సంకట విమోచన హనుమాన్ ఆలయంలో ఇదే జరిగింది. బుధవారం ఉదయం 8:30గంటలకు లోపలున్న శివాలయం వద్ద భక్తులకు మాంసం ముక్క కనిపించింది. అది పిల్లి వదిలేసిన మాంసం ముక్క అని ఎవ్వరికీ తెలియకపోవడంతో అలజడి రేగింది. ఇది.. ఇతర వర్గాలకు చెందిన వారి పనేనని.. ఆలయాన్ని అపవిత్రం చేశారని భక్తులు ఆగ్రహంతో ఊగిపోయారు. వారిలో కొందరు పోలీసులకు సమాచారమిచ్చారు. టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొద్దిసేపటికి ఏసీపీ, అడిషనల్ డీసీపీ, డీసీపీలూ వచ్చారు. ఆలయ పరిసరాల్లోని సీసీ ఫుటేజీని పరిశీలించేందుకు అప్పటికప్పుడు ప్రత్యేకంగా 4 బృందాలు ఏర్పాటు చేశారు. అన్ని సీసీ కెమెరాలు పరిశీలించి.. ఓ రెండు కెమెరాల్లో పిల్లిని, అది నోట్లో మాంసం ముక్కను కరచుకొని ఆలయ ప్రాంగణం వైపు వస్తుండటాన్ని గుర్తించారు. ఉదయం 6:30 గంటలకు నోట్లో మాంసం ముక్కతో ఆలయంలోకి పిల్లి ప్రవేశించినట్లు.. కొద్దిసేపటికి ఆ ముక్కను వదిలేసి ఆ జీవి బయటకు వెళ్లిపోయినట్లు పోలీసులు నిర్ధారించారు. ఇది తెలిసి.. మార్జాలం ఎంత కంగారు పెట్టిందో కదా! అంటూ భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రతి ప్రార్థనా మందిరంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని పోలీసులు సూచించారు.



మాంసం ముక్కతో సీసీ ఫుటేజీలో కనిపించిన పిల్లి

స్థానికంలో ఏకగ్రీవాలకు చెల్లుచీటీ!?

బరిలో ఒక్కరున్నా నోటాతో పోటీ పడాల్సిందే.. ఒక వేళ నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ఏంచేద్దాం?

» పార్టీల అభిప్రాయాలు కోరిన రాష్ట్ర ఎన్నికల కమిషన్



రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెల్లు చీటీ పాడనుంది. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఒక్క అభ్యర్థి బరిలో ఉన్నా సరే.. ఎన్నిక నిర్వహించనుంది. అందులో సదరు సింగిల్ అభ్యర్థి.. నోటాతో పోటీ పడాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎన్నికల నియమావళిని మార్చేందుకు కసరత్తు చేస్తున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్.. బుధవారం ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో భేటీ అయింది. సింగిల్ అభ్యర్థి కంటే నోటాకే ఎక్కువ ఓట్లు వస్తే ఏం చేయాలన్న అంశంపై వారి అభిప్రాయాలను సేకరించింది. సమావేశంలో కాంగ్రెస్ తరపున సీనియర్ నేతలు కమలాకర్, రాహుల్, బీఆర్ఎస్ తరఫున సోమ భరత్, పల్లె రవి, రాకేశ్ రెడ్డి, బీజేపీ నుంచి మల్లారెడ్డి, ఆంటోనీరెడ్డి, సీపీఎం నుంచి డీజీ నర్సింహారావు, సీపీఐ నుంచి శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు టీడీపీ, జనసేన, ఆమ్‌ఆద్మీ పార్టీల ప్రతినిధులూ హాజరయ్యారు. తొలుత రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లోనూ నోటా ఆప్షన్‌ను అందుబాటులో ఉంచాలని 2013లో సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. తదనుగుణంగా 2016లో ఖమ్మం కార్పొరేషన్, అచ్చంపేట, సిద్దిపేట మున్సిపాలిటీల ఎన్నికల్లో తొలిసారి నోటాను అమలు చేశామన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018, తెలంగాణ మునిసిపాలిటీల చట్టం-2019లో పేర్కొన్న ఎన్నికల నియమావళిని అనుసరించి జరిగిన తొలి సార్వత్రిక పంచాయతీ, మునిసిపాలిటీ ఎన్నికల్లో నోటాను అమలు చేసినట్లు తెలిపారు. దీని ప్రకారం ఒకటి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఉన్నప్పుడు మాత్రమే పోలింగ్ జరుగుతుందని, నోటాకు పోలైన ఓట్లు పరిగణనలోకి తీసుకోకుండా పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారు ఎన్నికైనట్లు ప్రకటించే విధానం అమల్లో ఉందన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత ఒకే అభ్యర్థి బరిలో ఉంటే ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తున్నామని అన్నారు. అయితే, అభ్యర్థి ఒకరే ఉన్నప్పుడు సుప్రీం కోర్టు ఉత్తర్వు అమలు కావడం లేదన్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు తెలిపారు. బరిలో ఒక్క అభ్యర్థే ఉన్నా.. బ్యాలెట్‌లో నోటాను జత చేసి ఎన్నిక నిర్వహించడం, ఆ ఎన్నికలో నోటాకు ఎక్కువ ఓట్లు పోలైతే రీఎలక్షన్ పెట్టాలా? వద్దా? అనే అంశాలపై అభిప్రాయాలు చెప్పాలని కోరారు. మహారాష్ట్ర, హరియాణా, ఢిల్లీ రాష్ట్ర ఎన్నికల సంఘాలు.. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే.. ఆ ఎన్నికను రద్దు చేసి.. తిరిగి ఎన్నికను నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు. ఆ తర్వాత కూడా నోటాకే ఎక్కువ ఓట్లు వస్తే వాటిని పరిగణనలోకి తీసుకోకుండా.. ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి గెలిచినట్లుగా ప్రకటిస్తున్నాయన్నారు. ఈ అంశంపైనా అభిప్రాయాలు చెప్పాలని సూచించారు. నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ఏం చేయాలన్న అంశంపై సుప్రీం కోర్టులో పిల్ దాఖలైందని, వచ్చే నెల 10వ తేదీలోగా ఆ తీర్పు వెలువడే అవకాశం ఉందని, ఆ తర్వాతే తమ అభిప్రాయం చెబుతామని బీజేపీ ప్రతినిధి మల్లారెడ్డి చెప్పారు. సింగిల్ అభ్యర్థి ఉన్నప్పుడు నోటాను చేర్చి ఎన్నిక నిర్వహించే అంశానికి మిగిలిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులూ మద్దతు పలికారు. నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చినా.. వాటిని పరిగణనలోకి తీసుకోవద్దని, అభ్యర్థుల్లో ఎక్కువ ఓట్లు వచ్చిన వారిని గెలిచినట్లుగా ప్రకటించాలని కాంగ్రెస్, సీపీఎం డిమాండ్ చేశాయి. సింగిల్ అభ్యర్థి ఉన్నప్పుడు నోటాను చేర్చి పోలింగ్ జరిపినా ఇదే విధానాన్ని అనుసరించాలని అభిప్రాయపడ్డారు. మళ్లీ ఎన్నిక అంటే ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని చెప్పారు. బీఆర్ఎస్, సీపీఐ, జనసేన, ఆమ్‌ఆద్మీ పార్టీల ప్రతినిధులు మాత్రం.. అభ్యర్థుల కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే తిరిగి ఎన్నిక నిర్వహించాల్సిందేనని స్పష్టం చేశారు. నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులు రీ ఎలక్షన్‌లో పోటీ చేయకుండా నిబంధన పెట్టాలని సీపీఐ అభిప్రాయపడింది. అయితే, ఆయా అంశాలపై వారంలోగా రాతపూర్వక అభిప్రాయాలు ఇవ్వాలని పార్టీల ప్రతినిధులను రాణి కుముదిని కోరారు. ఈ విషయమై ఎన్నికల నియమావళి సవరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడమా? లేక నిర్ణయం తీసుకోవాలా? అనేది త్వరలో తేలుస్తామన్నారు.



బీసీలకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

» అసెంబ్లీలో తీర్మానం తప్పేనని అంగీకరించాలి

» కాంగ్రెస్‌ను బీసీలు నమ్మే పరిస్థితి లేదు: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీల జనాభాను తగ్గించి ఆ వర్గం ప్రజలను మానసిక వేదనకు గురిచేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోని బీసీలందరికీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. అసమగ్ర సర్వేపై బీఆర్ఎస్‌తోపాటు.. బీసీ సంఘాలు ముక్తకంఠంతో అభ్యంతరం వ్యక్తం చేసినా వినకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తి లెక్కల ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేయడం కూడా ముమ్మాటికీ తప్పేనని అంగీకరించాలన్నారు. కులగణన సర్వే తప్పుల తడక అని.. సర్వే పూర్తి చేస్తామని కాంగ్రెస్ సర్కారు ఎట్టకేలకు ఒప్పుకోవడాన్ని స్వాగతిస్తున్నామని బుధవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. రెండోసారి సర్వేనైనా సమగ్రంగా చేయడంతో పాటు.. బీసీలకు చట్టబద్ధంగా 42% రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. తూతూమంత్రంగా తీర్మానం చేసి.. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం పరిధిలోకి నెట్టి చేతులు దులుపుకొందామంటే మాత్రం బీఆర్ఎస్ తోపాటు.. బీసీ సంఘాలు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాటను సంపూర్ణంగా నిలబెట్టుకునే వరకూ కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలోని బీసీలెవరూ నమ్మే పరిస్థితిలో లేదనే విషయాన్ని సీఎం గుర్తుపెట్టుకుంటే మంచిదని అన్నారు.

భూదాన్ భూములకు పట్టాలు ఎలా ఇచ్చారు?

» 103 ఎకరాలను నిషేధిత జాబితాలోకి చేరుస్తూ ఇచ్చిన మెమో ఇవ్వండి: హైకోర్టు



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భూదాన్ భూములని ప్రభుత్వం పేర్కొంటున్న భూములు నిషేధిత జాబితాలో ఉండగా ప్రైవేటు వ్యక్తులకు పట్టాలు ఎలా ఇచ్చారు ? అని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రస్తుతం వివాదంలో ఉన్న 103.35 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేరుస్తూ జారీ అయిన మెమో ప్రతులను న్యాయస్థానానికి సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 181లోని 103.35 ఎకరాల భూమి నిషేధిత జాబితాలో ఉందని, కానీ వాటిని 2021లో ప్రైవేటు వ్యక్తుల పేరిట పట్టా చేశారని ఆరోపిస్తూ సదరు భూమిపై హక్కులు ఉన్నాయని పేర్కొంటున్న మొహమ్మద్ ఫరూఖ్ అలీఖాన్, మరో ఐదుగురు హైకోర్టులో రిట్ అప్పీల్ దాఖలు చేశారు. ఇందులో ఈబీఎల్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ సహా భూదాన్ యజ్ఞ బోర్డు, మహేశ్వరం సబ్‌రిజిస్ట్రార్, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్, రంగారెడ్డి కలెక్టర్ తదితరులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పిటిషనర్ పేర్కొంటున్న విషయాలకు వివరణ ఇస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. కాగా, ఇదే సర్వే నంబర్‌లో 10.29 ఎకరాలను ఖాదర్ ఉన్నీసా బేగం పేరిట అక్రమంగా పట్టా చేశారని ఇదే పిటిషనర్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో హైకోర్టు సింగిల్ జడ్జి వద్ద పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై సీఎస్ స్పందించకపోవడంతో వ్యక్తిగతంగా హాజరుకావాలని జస్టిస్ భాస్కర్‌రెడ్డి ఆదేశించడంతో సీఎస్ శాంతికుమారి మంగళవారం అఫిడవిట్ దాఖలు చేశారు. భూదాన్ భూములకు పట్టాలిచ్చిన వ్యవహారంపై సుమోటోగా విచారణ చేపడుతున్నారని 4 వారాల గడువు ఇవ్వాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోసం ఆటో డ్రైవర్ల ఆందోళన బాట

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఆటో డ్రైవర్లు ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఈనెల 15న నారాయణగూడలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తామని, 24న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని జేఏసీ నాయకుడు సత్తిరెడ్డి వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

విదేశీ ఇంజన్లు రాకనే ఆలస్యం

(మొదటిపేజీ తరువాయి)

పనిచేశారు. ఆయన తర్వాత మళ్లీ ఇప్పుడు.. తేజస్ ఎంకే 2 ప్రాజెక్టుకు సైతం తెలుగువాడే అయిన మధుసూదనరావు డైరెక్టర్ కావడం గర్వకారణం. 'ఎంబెడెడ్ సిస్టమ్స్'లో పీహెచ్‌డీ చేసిన డాక్టర్ మధుసూదనరావు.. బెంగళూరులోని ఇస్రో శాటిలైట్ సెంటర్‌లో సైంటిస్టుగా 1990లో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఇన్‌శాట్-2ఏ, ఐఆర్ఎస్-1సీ శాటిలైట్ ప్రాజెక్టుల్లో పనిచేశారు. 1993లో ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలో చేరి.. ఏవియోనిక్స్ సిస్టమ్స్ తేలికపాటి యుద్ధవిమానాల్లో డిజిటల్ ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్స్, ఇంటిగ్రేటెడ్ ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్ వంటివాటిలో అపార అనుభవాన్ని గడించారు. ఎల్‌సీఏ ఎంకే1ఏ ప్రధాన సమన్వయకర్తగా పనిచేశారు. ఆయన రాసిన పరిశోధన వ్యాసాలు పలు అంతర్జాతీయ జర్నళ్లలో ప్రచురితమయ్యాయి. ఫ్లైట్ కంట్రోల్స్, ఏవియోనిక్స్‌కు సంబంధించి పలు జాతీయ అంతర్జాతీయ పేటెంట్లు ఆయన పేరిట ఉన్నాయి. ప్రస్తుతం బెంగళూరులో జరుగుతున్న 'ఏరో ఇండియా' షోకు హాజరైన ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ముఖ్యాంశాలు..

తేజస్ ఎంకే1ఏ తయారీలో భారత్ వెనకబడి ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి కదా.. దీనిపై మీ అభిప్రాయమేమిటి?

మన దేశం వెనకబడడం కాదు. దాని తయారీకి సంబంధించిన కీలక పరిజ్ఞానాల విషయంలో మనం విదేశాల మీద ఆధారపడి ఉన్నాం. ఉదాహరణకు.. ఇంజన్, ఎజెక్షన్ సీటు వంటివి. మనకు ఆ టెక్నాలజీ ఇంకా లేదు. అభివృద్ధి చేస్తున్నాం. త్వరలోనే ఆ పరిజ్ఞానాన్ని కూడా మనం కలిగి ఉంటాం. ఇప్పుడు ఇంజన్లు సమయానికి రాకపోవడం వల్ల హెచ్‌ఏఎల్ ఉత్పత్తి కొంత ఆలస్యమైంది. అంతే తప్ప ఆ సంస్థ సామర్థ్యంలో ఎలాంటి లోపమూ లేదు. వారికి సామర్థ్యం ఉంది. కానీ, సప్లై చైన్‌లో సమస్యల వల్ల ఉత్పత్తి రేటు తగ్గుతుంది. ఆ విషయాన్ని మనం అర్థం చేసుకుని ఓపిగ్గా వ్యవహరించాలి. ఇప్పుడు జనరల్ ఎలక్ట్రిక్ ఏరోస్పేస్ కూడా ముందుకొచ్చి వాటిని సరఫరా చేస్తామని చెప్పింది. కాబట్టి, మనం ఆందోళన చెందాల్సిన పని లేదు. ఇది మన దేశ రక్షణ రంగ సంస్థ తప్పు కాదు.. వేరే దేశానికి చెందిన సంస్థ సమస్య. మనచేతుల్లో ఏమీ లేదు. మన హెచ్‌ఏఎల్ మాత్రం సమయానికి వాయుసేనకు సరఫరా చేయగలదు.

తేజస్ ఎంకే 2 ఎప్పటికి సిద్ధమవుతుంది? ఈ ప్రాజెక్టు ఏ దశలో ఉంది?

ఈ విమానం 4.5+ జనరేషన్ టెక్నాలజీతో అభివృద్ధి చేస్తున్నాం. ఎంకే 1 (4+ జనరేషన్)తో పోలిస్తే చాలా అధునాతనమైనది. వచ్చే ఏడాది మార్చిలోగా ఫస్ట్ ఫ్లయిట్‌కు సిద్ధమవుతుంది. దీంట్లో వాడే పరిజ్ఞానాలు అత్యంత అధునాతనమైనవి. ఉదాహరణకు ఐఆర్ఎస్‌టీ (ఇన్‌ఫ్రారెడ్ సెర్చ్ అండ్ ట్రాక్) టెక్నాలజీ.. ఇది యాక్టివ్ రేడార్‌కు సమానమైనది. కానీ పాసివ్ రేడార్. రెండోది.. మిసైల్ అప్రోచ్ వార్నింగ్ సిస్టమ్. ఏదైనా క్షిపణి మన ఎయిర్‌క్రాఫ్ట్ దగ్గరకు వస్తుంటే దాన్ని గుర్తించి, పైలట్‌కు దాని వివరాలు తెలియజేస్తుంది. దాన్ని తప్పించుకోవాలా? లేక కౌంటర్ మెజర్స్ తీసుకోవాలా? సూచనలిస్తుంది. అయితే, ఈ విమానాల అభివృద్ధికి కావాల్సిన మెటీరియల్ లభ్యత కష్టంగా ఉంది. ఎందుకంటే మార్క్2 ఎయిర్‌క్రాఫ్ట్.. మార్క్1 కంటే పెద్దది. అందుకే మేం దగ్గరుండి మిధాని, ఓఎఫ్‌ఏజేలో మెటీరియల్స్ తయారుచేయించి, ఎయిర్‌క్రాఫ్ట్‌ను అభివృద్ధి చేస్తున్నాం. విమానం డిజైన్ పూర్తయ్యింది. డిజైనింగ్‌లో సీడీఆర్, పీడీఆర్ అనే దశలుంటాయి. అవి రెండూ పూర్తయ్యాయి. డ్రాయింగ్ రిలీజ్ ప్రాసెస్ కూడా పూర్తయింది. కాంపొనెంట్ల తయారీ మొదలుపెట్టాం. ఈ మార్క్-2 డిజైన్.. మాడ్యూలార్ తరహాలో చేశాం. అంటే చిన్న చిన్న భాగాలుగా తయారు చేశాం. వాటిని అసెంబుల్ చేస్తాం. ఇలా మాడ్యూల్ తరహాలో చేయడం వల్ల వాటన్నింటినీ కలిపి.. విమానాన్ని వేగంగా ఉత్పత్తి చేసి, ఎగిరేలా చేయొచ్చు. ఎంకే1కు మాడ్యులారిటీ లేదు కాబట్టే.. దాని ఉత్పత్తి రేటు తక్కువగా ఉంది. కానీ, ఇప్పుడీ మాడ్యులారిటీ విధానం వల్ల ఏడాదికి 24 ఎంకే2 విమానాలు తయారుచేయొచ్చు. వాటి నిర్వహణ కూడా సులువుగా ఉంటుంది. ఏమాడ్యూల్‌లో సమస్యఉంటే ఆ మాడ్యూల్‌ను మార్చేస్తే సరిపోతుంది. అది లేకపోవడం వల్లే మార్క్1 విమానాల నిర్వహణ కష్టం. ఉండడానికి 100 విమానాలున్నా.. 60మాత్రమే అందుబాటులో ఉంటాయి. డిజైన్ నుంచే ఇవన్నీ దృష్టిలో పెట్టుకోవడంవల్ల ఎంకే2 విషయంలో ఆ సమస్యలేవీ ఉండవు.



నౌకాదళం కోసం ప్రత్యేకంగా ఎలాంటి విమానాలను అభివృద్ధి చేస్తున్నారు?

నేవీ కోసం విమానవాహక యుద్ధనౌకల మీద ల్యాండ్, టేకాఫ్ అయ్యే ఎయిర్‌క్రాఫ్ట్‌ను మనం ఇప్పటికే అభివృద్ధి చేశాం. 2003లో ఆ ప్రాజెక్టు మనకు మంజూరైంది. దాన్ని అభివృద్ధి చేసి.. 2009లో టేకాఫ్, ల్యాండింగ్ చేయగలిగాం. ప్రపంచంలోనే ఆ టెక్నాలజీ ఉన్న ఐదో దేశంగా నిలిచాం. ఆ టెక్నాలజీని ఉపయోగించుకుని నేవీ కోసం అడ్వాన్స్‌డ్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ 'టెడ్‌బీఎఫ్ (ట్విన్ ఇంజన్ డెక్ బేస్డ్ ఫైటర్)'ను అభివృద్ధి చేస్తున్నాం. డిజైన్ ఫైనలైజ్ అయ్యింది. ప్రభుత్వ మంజూరు కోసం ఎదురుచూస్తున్నాం. అదెప్పుడైనా రావచ్చు. వస్తే దాన్ని కూడా వేగంగా అభివృద్ధి చేసి ఇవ్వగలం.

తేజస్ ఎంకే 2 ఐదో తరం విమానాలతో సమానంగా ఉండే అవకాశం ఉందా?

తేజస్ మార్క్2 అనేది ఎయిర్ సుపీరియారిటీ తరహా విమానం. ఎంకే1 ఎయిర్‌క్రాఫ్ట్.. 'ఎయిర్ డిఫెన్స్' కేటగిరీకి చెందినది. ఎయిర్ సుపీరియారిటీ కేటగిరీ విమానాల్లో పెద్ద సంఖ్యలో ఆయుధాలను మోసుకెళ్లగలదు. మన డీఆర్‌డీవో దేశీయంగా అభివృద్ధి చేస్తున్న అన్ని రకాల ఆయుధాలనూ దీన్నుంచి ప్రయోగించవచ్చు. పరిస్థితులను బట్టి 45 రకాల కాన్ఫిగరేషన్లతో ఎగరగలదు. మార్క్-1 విమానాలు 1500 కిలోమీటర్లు ప్రయాణించగలిగితే.. ఇవి 3000 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలవు. మార్క్1 విమానాల మిషన్ ఎండ్యూరెన్స్ 51 సెకన్లుగా ఉంటే.. మార్క్2లో అది 126 సెకన్లుగా ఉంటుంది. దీని నిర్మాణంలో అత్యంత ఆధునిక సెన్సర్లు.. ఆయుధాలను ఇంటిగ్రేట్ చేశాం. ఈ విమానంలో కాక్‌పిట్ కూడా అత్యంత అధునాతనమైనది. ఎఫ్-35తో సమానమైన కాక్‌పిట్ ఎంకే2లో ఉంది. వీటన్నింటి వల్ల.. పైలట్లు ఈ యుద్ధవిమానాన్ని ఎంతగానో ఇష్టపడతారు.

ఐదో తరం యుద్ధవిమానాల తయారీలో భారత్ వెనకబడిందని రక్షణ రంగ విశ్లేషకుల అభిప్రాయం.. దీనికి మీరేమంటారు?

అది అంత నిజం కాదు. మనం ఐదో తరం యుద్ధవిమానం ఆమ్కా (ఏఎంసీఏ) డిజైన్‌ను ఇప్పటికే పూర్తిచేశాం. మార్క్2లో సైతం ఐదో తరం పరిజ్ఞానాలను పొందుపరచాం. ఆమ్కా ఐదో తరం ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ అయినా.. అందులో పొందుపరుస్తున్న సాఫ్ట్‌వేర్, ఇతర పరిజ్ఞానాలను బట్టి చూస్తే అది 5.5 లేదా 6వ తరం విమానాలతో సమానం. అవి ఆరోతరం విమానాల్లాగా.. ఆప్షనల్లీ పైలెటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్‌లవి. మన భారతదేశం కూడా మరికొన్నేళ్లలోనే ఐదో తరం విమానాలను కలిగి ఉన్న దేశాలతో సమానంగా నిలుస్తుంది.

ఆమ్కా ఎప్పట్నుంచీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది? ఇప్పుడది ఏ దశలో ఉంది?

ఆమ్కా డిజైన్ పూర్తయింది. అదో స్టెల్త్ విమానం. దాని తయారీలో పలు రకాల స్టెల్త్ పరిజ్ఞానాలను వినియోగించాం. ఈ విమానాల ప్రోటోటైప్‌లు రెండేళ్లలో సిద్ధమవుతాయి. ఆ తర్వాత మరో మూడు, మూడున్నరేళ్లలో ఫస్ట్ ఫ్లయిట్ జరుగుతుంది.

ప్రైవేటు సంస్థలను రంగంలోకి దింపడం వల్ల ఈ విమానాల తయారీ వేగవంతమవుతుందా?

కచ్చితంగా ఉంటుందని చెప్పొచ్చు. ఎందుకంటే.. ఈ ఎయిర్‌క్రాఫ్ట్‌ల తయారీలో మన ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీకి ప్రధాన భాగస్వామి హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్. ఆ దిశగా హెచ్‌ఏఎల్ ఎంతగానో శ్రమిస్తోంది. అయినప్పటికీ వారికి ఇతరత్రా చాలా బాధ్యతలున్నాయి. వారికి ఇది కాకుండా వేరే ప్రోగ్రాములు కూడా ఉన్నాయి. కాబట్టి, ప్రైవేటు సంస్థలను కూడా భాగస్వాములను చేస్తే.. అవి తయారుచేసే 90 శాతం పరికరాలను హెచ్‌ఏఎల్ ఇంటిగ్రేట్ చేస్తే ఉత్పత్తి రేటు పెరుగుతుంది. లేదా మన వైమానిక దళానికి ఏం కావాలో వాటిని హెచ్‌ఏఎల్ ఉత్పత్తి చేసి, ఎగుమతి చేయాల్సిన వాటిని ప్రైవేటు సంస్థల ద్వారా తయారు చేయిస్తే సరిపోతుంది.

మార్చి మొదటివారంలో

'బిల్డ్ నౌ' అందుబాటులోకి!

- తొలుత జీహెచ్ఎంసీ, హెచ్ఎండీయే పరిధిలో అమలు
- భవన నిర్మాణ అనుమతుల వేగవంతం, పారదర్శకత కోసం బిల్డ్ నౌ పేరుతో కొత్త ఆన్‌లైన్ అనుమతుల వ్యవస్థ
- టీజీ-బీపాస్ స్థానంలో తీసుకువచ్చేందుకు నిర్ణయం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణాలు, లేఅవుట్ అనుమతుల వేగవంతం, పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'బిల్డ్ నౌ' వెబ్ పోర్టల్, మొబైల్ అప్లికేషన్ మార్చి మొదటి వారంలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. టీజీ-బీపాస్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం దీన్ని తీసుకువస్తోంది. 'బిల్డ్ నౌ' ద్వారా తొలుత హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ పరిధిలో అనుమతులను మంజూరు చేయనున్నారు. మిగతా ప్రాంతాల్లో కొద్దికాలం పాటు టీజీ-బీపాస్ ద్వారానే భవన అనుమతులు మంజూరు చేస్తారని అధికారులు తెలిపారు. బిల్డ్ నౌపై అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ఆర్కిటెక్చర్లు, బిల్డర్లు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందిన తర్వాత టీజీ-బీపాస్‌ను మొత్తంగా ఎత్తివేయనున్నారు. దీనికి రెండు నెలల సమయం పట్టొచ్చని భావిస్తున్నారు. బిల్డ్ నౌ పోర్టల్, యాప్‌ను ఫ్లో డబ్ల్యూ అనే సాఫ్ట్‌వేర్ సంస్థ రూపొందించింది. దీని ద్వారా అనుమతులు ఇచ్చే విధానంపై హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ)లకు చెందిన అధికారులు,

సీఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



రాజేంద్రనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. మైలార్‌దేవుపల్లి పల్లెచెరువు నుంచి దుర్గానగర్ వరకు ఫ్లై ఓవర్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని సీఎంను కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఫ్లై ఓవర్ నిర్మాణం, ఆరాంఘర్ చౌరస్తాలో రెండు రోడ్డు అండర్ బ్రిడ్జీల నిర్మాణాలకు రూ.259 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. అయితే.. నిధులు మాత్రం మంజూరు చేయలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నిధులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారని ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

సంత్ సేవాలాల్ ఉత్సవాలకు రండి

- సీఎంను ఆహ్వానించిన మంత్రి సీతక్క, గిరిజన సంఘాల నాయకులు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 15న మహవీర్ సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఉత్సవాలకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం మంత్రి సీతక్క, గిరిజన సంఘాల నాయకులు ఆహ్వానం అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ ఉన్నారు. కాగా, హైదరాబాద్ గచ్చిబౌలిలో నిర్మించిన మైక్రోసాఫ్ట్ కొత్త కార్యాలయాన్ని సీఎం గురువారం ప్రారంభించనున్నారు.

నిబంధనల మేరకే ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ల నియామకం

- వారంతా 28-44 ఏళ్ల మధ్య వయస్కులే..
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేయట్లేదు
- వివరణ ఇచ్చిన ఆరోగ్య శ్రీ ట్రస్టు సీఇవో

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త(కోఆర్డినేటర్)ల నియామక ప్రక్రియ అంతా నిబంధనల మేరకే చేపట్టినట్లు ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో టీ శివశంకర్ వెల్లడించారు. 'ఆరోగ్యశ్రీలో అక్రమ నియామకాల' పేరిట బుధవారం 'ఆంధ్రజ్యోతి' పత్రికలో వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్తల పోస్టులు పది ఉన్నాయని తెలిపారు. వాటిలో 8 ఖాళీగా ఉండగా 6 పోస్టులను భర్తీ చేశామని వెల్లడించారు. నిజామాబాద్, మెదక్ జిల్లా పోస్టులు ఇంకా భర్తీ కాలేదని తెలిపారు. నియామకం చేపట్టిన ఆరు చోట్ల ఎంపికైన అభ్యర్థుల వయసు 28- 44 ఏళ్ల మధ్య ఉందని పేర్కొన్నారు. తాజాగా ఎంపికైన అభ్యర్థులెవ్వరూ ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేయడం లేదని తెలిపారు. ఒకవేళ ఎవరైనా ప్రైవేటులో పనిచేస్తున్నట్లు తేలితే తొలగిస్తామని తెలిపారు. ఇక ఉద్యోగుల ఆరోగ్య పథకంలో ప్రైవేటు వ్యక్తులెవ్వరూ పనిచేయడం లేదని, ప్రస్తుతం పనిజేస్తున్న డాక్టర్ బాలకృష్ణ ప్రభుత్వ వైద్యుడని వెల్లడించారు.

ప్యారానగర్ డంపింగ్ యార్డు పనులపై స్టే

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యార్యానగర్ గ్రామ పరిధిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాసెసింగ్ యూనిట్, పవర్ ప్లాంట్ నిర్మాణాలను తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు నిలిపేయాలని హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. అయితే, అధికారులు భూసర్వే చేసుకోవచ్చునని, రోడ్డు వేసుకోవచ్చని ప్రహరీ మాత్రం నిర్మించరాదని స్పష్టం చేసింది. మునిసిపల్ డంపింగ్ యార్డు ఏర్పాటుపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వం, జీహెచ్ఎంసీకి ఆదేశాలు జారీ చేసింది. పక్కనే ఉన్న తమ భూమిలో పనులు చేపడుతుండటంతోపాటు డంపింగ్ యార్డు వల్ల పర్యావరణానికి నష్టం కలుగుతుందని, అటవీ అనుమతులు లేకుండా పనులు చేస్తున్నారని హైదరాబాద్‌కు చెందిన స్వర్ణలత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదిస్తూ.. ప్యారానగర్ గ్రామం దుండిగల్ ఎయిర్‌బేస్‌కు 15కిమీల పరిధిలోనే ఉందని.. అటవీశాఖ అనుమతులు తీసుకోకుండా పనులు చేస్తున్నారని, డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దని ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ లేఖ కూడా రాశారని తెలిపారు. ఇప్పటికే దాఖలైన పలు కేసుల్లో స్టేటస్ కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ఆరోపించారు. ఇక, ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, కలెక్టర్ తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ.. పనులు ఆపాలని ఏ కోర్టు ఉత్తర్వులు లేవని, ప్రైవేటు పట్టాదారులకు నోటీసులు ఇచ్చి మళ్లీ భూసర్వే చేయాలనే ఉత్తర్వులు ఉన్నాయని, సర్వే చేస్తున్నామని చెప్పారు. పిటిషనర్ ఆరోపిస్తున్నట్లుగా అది చెత్త డంపింగ్ యార్డు కాదని.. బయోగ్యాస్ యూనిట్, పవర్‌ప్లాంట్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. అటవీ, పర్యావరణ అనుమతులు లేకపోవడంతోపాటు వింగ్ కమాండ్ లేఖపై ఆందోళన వ్యక్తం చేసింది. అటవీ అనుమతులు లేకుండా ప్రహరీ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించింది. ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసిన తర్వాత కేసు విచారణ చేపడతామని పేర్కొంటూ విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది.

రేషన్‌కార్డులకు 3 రోజుల్లో 2.5 లక్షల దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో రద్దీ కొనసాగుతోంది. కొత్త రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల దరఖాస్తుకు కోసం జనం బారులు తీరుతున్నారు. సోమవారం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనప్పటి నుంచి మూడు రోజుల్లో 2.6 లక్షల మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని మీసేవ అధికారులు తెలిపారు. బుధవారం 3,858 మీసేవ కేంద్రాల్లో 1,13,298 వివిధ దరఖాస్తులు స్వీకరించగా.. ఇందులో దాదాపు లక్ష దరఖాస్తులు రేషన్ కార్డులకు సంబంధించినవే ఉన్నాయన్నారు. మీసేవ కేంద్రాల్లో భారీ రద్దీ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ స్పందించింది. మీసేవల్లో రేషన్ కార్డుల దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తు కోసం తొందరపడవద్దని ఓ ప్రకటనలో సూచించింది.

వివరాలివ్వని వారికి మళ్లీ కులగణన

మిగిలిపోయిన 3.1% కుటుంబాల కోసం ఈ నెల 16 నుంచి 28 వరకు ఇంటింటి సర్వే

- ఆన్‌లైన్, ఎంపీడీవో వద్ద, టోల్‌ఫ్రీ నంబర్
- 3 మార్గాల ద్వారా వివరాల నమోదు!
- వచ్చేనెల అసెంబ్లీ ప్రత్యేక భేటీలో బీసీ బిల్లు
- సీఎం వద్ద సమీక్షలో ప్రభుత్వం నిర్ణయం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం
- బిల్లును ఆమోదించి.. కేంద్రానికి పంపిస్తాం
- పార్లమెంటులో ఆమోదించేలా ఒత్తిడి
- బృందంగా వెళ్లి ప్రధానిని కలుస్తాం: భట్టి



సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల (సమగ్ర ఇంటింటి కుటుంబ) సర్వే విషయంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇదివరకు నిర్వహించిన సర్వేలో మిగిలిపోయిన 3.1 శాతం కుటుంబాల కోసం మరోమారు సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ఈ నెల 16 నుంచి 28 వరకు ఈ సర్వేను చేపట్టనుంది. సర్వే పూర్తయిన తర్వాత బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదం పొందనుంది. దీనికి ముందు క్యాబినెట్ ఆమోదం కూడా తీసుకోనుంది. ఈ బిల్లు ఆమోదం కోసం మార్చి మొదటి వారంలో శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనుంది. అసెంబ్లీలో బిల్లు ఆమోదం తర్వాత బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇదే బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపించి, పార్లమెంటులో ప్రవేశపెట్టేలా ఒత్తిడి తేవాలని నిర్ణయించింది. ఇందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసి విజ్ఞప్తి చేయనుంది. కేంద్రంలోని ఇతర రాజకీయ పార్టీలు, రాష్ట్ర అసెంబ్లీలోని పార్టీల మద్దతును కూడగట్టనుంది. బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్న దృఢ నిశ్చయంతో ఉన్నామని, మార్చి మొదటి వారంలో ఇంటింటి సర్వే వివరాలను సంపూర్ణంగా ప్రకటిస్తామని తెలిపింది. బుధవారం ఉదయం స్థానిక సంస్థల ఎన్నికలపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసుకోవడం, పార్లమెంటుకు బిల్లును పంపడం వంటి పలు అంశాలపై చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త గ్రామపంచాయతీలు ఏర్పడినందున ఆయా చోట్ల బీసీలకు ఏమైనా రిజర్వేషన్లు పెరిగాయా? అని అధికారులను అడిగారు. అయితే హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న గ్రామాలు మునిసిపాలిటీల్లో విలీనం కావడంతో బీసీలకు కేటాయించిన పంచాయతీల సంఖ్య పెరగలేదని వారు బదులిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీలకు ఎక్కువ శాతం రిజర్వేషన్లు ఎలా ఇవ్వగలిగారని సీఎం ప్రశ్నించగా.. ఉమ్మడి రాష్ట్రంలో చివరి స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చే నాటికి రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలు అమల్లో లేవని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అనంతరం ఉన్నతాధికారులందరినీ బయటకు పంపి.. సీఎం, మంత్రులు, సలహాదారులు మాత్రమే సుమారు రెండున్నర గంటలపాటు చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

మిగిలిపోయిన వారి కోసమే సర్వే..

ఇంటింటి సర్వేలో మిగిలిపోయిన 3.1 శాతం కుటుంబాల కోసమే మరోసారి సర్వే చేయనున్నామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రకటించారు. కులగణనలో వివరాలు ఇచ్చేందుకుగాను వారికి మూడు రకాల మార్గాలను సూచిస్తున్నామని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వద్దగానీ, ఆన్‌లైన్‌లోగానీ, టోల్ ఫ్రీ నంబర్ ద్వారా గానీ వివరాలను నమోదు చేసుకోవచ్చునని అన్నారు. సీఎం సమీక్ష అనంతరం వివరాలను మంత్రి పొన్నంతో కలిసి డిప్యూటీ సీఎం మీడియాకు వివరించారు. "రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ఇంటింటి సర్వే 2024 నవంబరు 6న ప్రారంభమై డిసెంబరు 25న ముగిసింది. హౌస్ లిస్టింగ్ చేసిన మొత్తం 1,15,71,457 కుటుంబాలకుగాను 1,12,15,134 కుటుంబాల (96.9%)ను సర్వే చేయడం జరిగింది. ఇంకా 3.1 శాతం (3,56,323) కుటుంబాలను సర్వే చేయలేదు. ఈ 3.1 శాతం కుటుంబాల కోసం ఈ నెల 16 నుంచి 28 వరకు మరోసారి సర్వేను చేపడుతున్నాం" అని భట్టివిక్రమార్క వివరించారు. ఇప్పటికే ఈ సర్వేపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో లెక్కలతో సహా వివరించారని గుర్తు చేశారు. రాజకీయ పార్టీలు, రాష్ట్రంలోని కొన్ని బీసీ సంఘాలు పలు రకాల సలహాలు, సూచనలు ఇచ్చాయన్నారు. ప్రభుత్వం ఈ సర్వేను చాలా శాస్త్రీయంగా, సహేతుకంగా చేసిందని తెలిపారు. దేశ చరిత్రలో ఎక్కడా జరగని విధంగా లెక్కలు తీసి, శాసనసభలో పెట్టామన్నారు. 3.1 శాతం గృహాల సర్వే జరగకపోవడానికి కారణాలను కూడా వివరించామన్నారు. "కొంత మంది తమ వివరాలు ఇవ్వడానికి ఉద్దేశపూర్వకంగా ముందుకు రాలేదు. కొందరు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లారు. ఇలాంటి కారణాల వల్ల 3.1 శాతం కుటుంబాలు మిగిలిపోయాయి. కేసీఆర్, కేటీఆర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి వంటివారు సర్వేకు సహకరించలేదు. అయినా.. అలాంటివారి కోసం మరోసారి అవకాశం ఇవ్వొచ్చు కదా! అని శాసనసభలో అడిగారు. దీనిని పరిశీలించిన ప్రభుత్వం.. ఆ మిగిలిన 3.1% కుటుంబాలకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. కేసీఆర్, కేటీఆర్ సహా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. మీరు జనాభా లెక్కల్లోకి వచ్చేటట్లు చూసుకొని జనజీవన స్రవంతిలోకి వస్తే మంచిదని చెబుతున్నాం. తప్పిపోయినవారు తిరిగి నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం" అని భట్టివిక్రమార్క అన్నారు.

కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపై రేపు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

- టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి

కులగణన సర్వే, ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ నేతలకు అవగాహన కోసం శుక్రవారం గాంధీభవన్‌లోని ప్రకాశం హాల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. మంత్రి ఉత్తమ్ నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం ఈ ప్రజెంటేషన్ ఇవ్వనుంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఆఫీస్ బేరర్లు, ముఖ్యనాయకులు పాల్గొననున్నారు.

మార్చి మొదటి వారంలో శాసనసభ భేటీ

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను మార్చి మొదటి వారంలో అమలు చేయాలన్న దృఢ నిశ్చయంతో ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ లెక్కలను మొదట క్యాబినెట్‌లో ఆమోదించి, శాసనసభలో బిల్లు పెట్టి ఆమోదింపజేస్తామన్నారు. దీని కోసం మార్చి మొదటి వారంలో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. బీసీలు, ఓబీసీలకు రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని పేర్కొన్నారు. కొన్ని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బలహీనవర్గాల వారి కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. బిల్లును అసెంబ్లీలో ఆమోదించడమే కాకుండా.. కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. పార్లమెంటులో కూడా బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో తమ పార్లమెంటు సభ్యుల సహాయ సహకారాలతో ఒక ప్రతినిధి బృందంగా ప్రధానిని కలుస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఇతర పెద్దలను, పార్లమెంటులోని అన్ని రాజకీయ పార్టీల నేతలను కలుస్తామని, వారందరి మద్దతు కూడగడుతామని చెప్పారు. పార్లమెంటులో కూడా ఈ బిల్లును పాస్ చేయించుకుని, పూర్తి చట్టబద్ధత కల్పించేలా ప్రక్రియను మొదలు పెడుతున్నామని వివరించారు.

అందరూ మద్దతు తెలపాలి..

బీసీల చిరకాల వాంఛ అయిన 42 శాతం రిజర్వేషన్లను కల్పించడమే తమ ముందున్న లక్ష్యమని డిప్యూటీ సీఎం తెలిపారు. ఓబీసీలకు మేలు జరగకూడదని కుట్ర చేసేవారికి కూడా స్పష్టంగా చెబుతున్నామని, రాజకీయాలను పక్కన పెట్టి మద్దతు తెలపాలని కోరారు. మేధావులు, రాజకీయ నేతలు, ప్రగతిశీల భావాలు కలిగిన వారందరూ కలిసి రావాలని, సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. 56 శాతం ఉన్న ఓబీసీల కోరిక బలమైనదని, వారికి న్యాయం చేయడానికి అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. ఈ విషయంలో తాము తప్పకుండా విజయం సాధిస్తామన్నారు. మన రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా 50 శాతానికి పైగా ఉన్న ప్రజల ఆలోచనల్ని మన్నించాల్సిందేనన్నారు. ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సిందిగా దేశంలోని రాజకీయ నేతలను కలిసి కోరతామని చెప్పారు. మార్చి మొదటి వారంలో కులగణనకు సంబంధించి సంపూర్ణ సమాచారాన్ని ప్రకటిస్తామని తెలిపారు. కొంత మంది నాయకులు రీసర్వే చేయాలని కోరుతున్న విషయాన్ని డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకురాగా.. దేశమంతా కులగణన జరగాలని తాము కోరుకుంటున్నామన్నారు.కానీ, దేశమంతా చేయాల్సి వస్తుందేమోనని భయపడేవాళ్లే రీసర్వే కోరుతున్నారని పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సర్వేలో పాల్గొననివారు ఇది తప్పుడు సర్వే అంటున్నారని విమర్శించారు. బీసీలకు న్యాయం చేయాలని కోరుకుంటే.. సర్వేలో పాల్గొననివాళ్లు ఇప్పటికైనా పాల్గొనాలని సూచించారు.

జూన్‌లో స్థానికం!

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్‌ను కల్పిస్తూ బిల్లుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేయనుంది. మార్చి మొదటి వారంలో ప్రత్యేకంగా అసెంబ్లీ నిర్వహించి ఈ బిల్లును ఆమోదించనుంది. అలాగే తెలంగాణ స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేసేందుకు వీలుగా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే సవరణలు తీసుకువచ్చి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానాన్నీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఆమోదించనుంది. అనంతరం బిల్లును, అసెంబ్లీ తీర్మానాన్ని ప్రభుత్వం.. కేంద్రానికి పంపనుంది. అంతే కాకుండా అఖిలపక్ష పార్టీలు, సంఘాలను ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమాలనూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 4 వరకూ జరగనున్నాయి. అప్పటి దాకా కేంద్రంపై వివిధ రూపాల్లో ఒత్తిడి కార్యక్రమాలు చేపట్టనుంది. కేంద్రం నుంచి స్పందన రాని పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ పరంగా 42% రిజర్వేషన్‌ను అమలు చేస్తామని ప్రకటించి.. పాత రిజర్వేషన్ ప్రకారమే స్థానిక ఎన్నికలకు వెళ్లనున్నట్లు చెబుతున్నారు.

పరీక్షలూ అడ్డంకే..

అసెంబ్లీ తీర్మానాన్ని కేంద్రానికి పంపి.. బడ్జెట్ సమావేశాలకు ముందే స్థానిక ఎన్నికలు నిర్వహించాలనుకున్నా ప్రభుత్వానికి కుదరని పరిస్థితి ప్రస్తుతం నెలకొని ఉంది. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్, మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులు మొత్తం ఈ పరీక్షల నిర్వహణ, ఆ తర్వాత పేపర్ మూల్యాంకనం ప్రక్రియలోనే ఉంటారు. ఈ నేపథ్యంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో స్థానిక ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదంటున్నారు. నడి వేసవి కాలం కావడంతో ఏప్రిల్, మే నెలల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించకపోవచ్చునని చెబుతున్నారు. మొత్తంగా చూస్తే జూన్, జూలై నెల వరకూ స్థానిక ఎన్నికలు వాయిదా పడేందుకు ఆస్కారం ఉందంటున్నారు. ఈ లోపున స్థానికంగా ఎంతో కొంత ఉన్న వ్యతిరేకతనూ సర్దుబాటు చేసుకునేందుకు అధికార పార్టీకి అవకాశం చిక్కుతుందనీ రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

మళ్లీ కులగణన హర్షణీయం

- బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కులగణనలో పాల్గొనని కుటుంబాల కోసం మరోసారి సర్వే చేయాలని నిర్ణయించడం పట్ల బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ హర్షం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి శాసనసభలో బిల్లు పెట్టి.. ఆమోదించి కేంద్రానికి పంపే నిర్ణయం రిజర్వేషన్ల సాధనలో గణనీయమైన ముందడుగు అని బుధవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు కులగణన సర్వేలో పాల్గొనని వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీసీ సంఘాలు, కార్యకర్తలు సర్వే సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి కుటుంబాల వివరాలు నమోదు చేయించాలని, ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని అన్నారు.

కులగణన పేరిట బోగస్ సర్వే

ఇంటింటా రీ సర్వే చేపట్టాల్సిందే.. గ్రామసభల ఆమోదం పొందాల్సిందే

- బీసీల్లో ముస్లింలను చేరిస్తే ఊరుకోం
- బీసీల సంఖ్య తగ్గించడం వెనుక కుట్ర
- కులగణనపై కాంగ్రెస్ నేతల్లోనే విభేదాలు
- కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కులగణన పేరిట రాష్ట్ర ప్రభుత్వం బోగస్ సర్వే నిర్వహించిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆధార్ కార్డులను లింక్ చేస్తూ.. ఇంటింటా రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. అలా సర్వే పూర్తయిన వెంటనే పంచాయతీల్లో ముసాయిదా జాబితాను ప్రదర్శించి.. అభ్యంతరాలను స్వీకరించాలని సూచించారు. గ్రామ సభలు, వార్డు సభల ఆమోదంతోనే తుది జాబితాను ప్రకటించాలని అభిప్రాయపడ్డారు. అప్పుడే శాస్త్రీయ పద్ధతిలో కులగణన జరిగినట్లుగా భావిస్తామని తెలిపారు. అలాకాకుండా రాజకీయ ప్రయోజనాలు, ప్రచారం కోసం తూతూమంత్రంగా సర్వే చేయడం వల్ల ఏ మాత్రం ఉపయోగం ఉండదని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని హితవు పలికారు. ఈ మేరకు బుధవారం ఆయన కార్యాలయం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది. ముస్లింలను బీసీ జాబితాలో చేర్చాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని బండి సంజయ్ హెచ్చరించారు. బీసీ సామాజికవర్గ జనాభాను ఉద్దేశపూర్వకంగా తగ్గించే కుట్ర చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కుల గణన విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రుల మధ్యే ఏకాభిప్రాయం కొరవడిందని పేర్కొన్నారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడాన్ని సొంత పార్టీ వాళ్లే తప్పు పడుతుండగా, దాన్ని సరిదిద్దుకోకుండా కేంద్రంపై నిందలు వేయడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణలో 3.95కోట్ల మందికి ఆధార్ కార్డులు ఉండగా.. సర్వేలో తెలంగాణ జనాభా 3.70కోట్లుగా చూపించడం ఏంటని నిలదీశారు. కులగణన సర్వేలో 3.1 శాతం మంది పాల్గొనలేదని, వారి కోసం మళ్లీ రీ సర్వే చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

'స్థానికం' తర్వాతే మంత్రివర్గ విస్తరణ!

- త్వరలోనే రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మార్పు
- వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిస్తే మరింత సమర్థంగా పనిచేస్తా
- మీడియాతో చిట్‌చాట్‌లో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ చేపట్టే అవకాశం ఉందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రేపో.. మాపో మంత్రి వర్గ విస్తరణ జరగనుందన్న ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై ఇప్పటికే పార్టీ తరఫున ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించినట్లు చెప్పారు. ఢిల్లీలో బుధవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. టీపీసీసీ కమిటీలపై కసరత్తు చివరి దశకు చేరిందని, ఇప్పటికే పీసీసీ తరఫున అభ్యర్థుల పేర్లను అధిష్ఠానానికి సూచించినట్లు పేర్కొన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మీ పేరు వినిపిస్తుంది కదా? అనే ప్రశ్నకు స్పందిస్తూ.. అవకాశం వస్తే మరింత సమర్థవంతంగా పనిచేస్తానని బదులిచ్చారు. "ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఉన్న దీపాదాస్ మున్షినే కేరళ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా ఉన్నారు. వచ్చే ఏడాది కేరళ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున.. త్వరలోనే తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జిగా మరొకరిని నియమించే అవకాశం ఉంది" అని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతంగా పని చేస్తోందని, దేశంలో ఎక్కడా లేని పథకాలను ఏడాదిలోనే అమలు చేసి చూపించామని తెలిపారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేశామని, రైతు భరోసా ఇచ్చామని, మహిళలకు ఉచిత బస్సు.. ఇలా ఎన్నో పథకాలను విజయవంతంగా అమలు చేసినట్లు చెప్పారు. పీసీసీ, డీసీసీ, నియోజకవర్గ, మండల కమిటీల నియామకం పూర్తయితే.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లే అవకాశం ఉంటుందన్నారు. పథకాల ద్వారా లబ్ధి పొందిన వాళ్లు ప్రతీ గ్రామంలో ఉన్నారని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాన్ని వాళ్లు పట్టించుకోరని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ మాదిరిగా తాము వ్యవహరించి ఉంటే.. ఐదేళ్ల క్రితమే అధికారంలోకి వచ్చి ఉండే వాళ్లమని అభిప్రాయపడ్డారు.

అడ్మిషన్లు ప్రారంభిస్తే కఠిన చర్యలు : ఇంటర్ బోర్డు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలను కొన్ని ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఇప్పటి నుంచే ప్రారంభిస్తున్నాయన్న వార్తలపై ఇంటర్ బోర్డు స్పందించింది. 2025-26 విద్యా సంవత్సరానికి అనుబంధ నోటిఫికేషన్, ప్రవేశాల షెడ్యూల్‌ను ఇంకా జారీ చేయలేదని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. నోటిఫికేషన్‌కు ముందే ప్రవేశాలు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఆ నిబంధనలు అతిక్రమించిన కళాశాలల అనుబంధ గుర్తింపును రద్దు చేస్తామని ఆయన బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హెచ్చరించారు.

మూడెకరాల వరకు అందిన రైతుభరోసా

- 9.56 లక్షల మంది రైతులకు రూ.1,230.98 కోట్లు జమ
- ఇప్పటివరకు 58.13లక్షల ఎకరాలకు 3,487.82 కోట్లు జమ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా పథకం కింద బుధవారం మూడెకరాల రైతులకు ప్రభుత్వం నిధులను జమ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 9,56,422 మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో రూ.1,230.98 కోట్లను జమ చేసినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా రికార్డులను నవీకరించిన తరువాత 2 ఎకరాలలోపు ఉన్న 56,898 మంది రైతులకు రూ.38.34 కోట్లు జమ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. జనవరి 26న పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన రైతుభరోసా పథకం కింద ఇప్పటి వరకు మూడు విడతలుగా నిధులు జమ చేశామని తెలిపారు. దీనిప్రకారం ఇప్పటివరకు ఎకరం నుంచి మూడు ఎకరాల వరకు మొత్తం 58.13లక్షల ఎకరాలకు చెందిన 44.82 లక్షల మంది రైతులకు రూ.3,487.82 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు వివరించారు.ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం వినియోగించుకోవాలని, మిగిలిన వారికీ త్వరలోనే నిధులు జమ చేస్తామని ఆయన తెలిపారు.

పథకం ప్రారంభమైన జనవరి 26 నుంచి ఇప్పటివరకు జమ అయిన నిధులు ఎకరాల వారీగా వివరాలు

తేదీ	రైతులు	ఎకరాలు	నిధులు (రూ.కోట్లలో)	అందిన ఎకరాలు
27-1-25	4,41,911	9,48,332.35	568.99	577 పైలట్ గ్రామాలు
05-2-25	17,03,419	9,29,234.20	557.54	ఎకరం రైతులు
10-2-25	13,23,615	18,19,919.09	1,091.95	2ఎకరాల రైతులు
12-2-25	56,898	63,900.15	38.34	2ఎకరాల రైతులు
12-2-25	9,56,422	2,051,649	1,230.98	3 ఎకరాలున్న రైతులు
మొత్తం	44,82,265	58,13,034.79	3,487.8	

జేఈఈలో బీసీ గురుకుల విద్యార్థుల హవా

» అర్హత సాధించిన 27మంది బాలురు, 26మంది బాలికలు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీలలో ప్రవేశం కోసం(2024-25)లో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ప్రవేశపరీక్షలో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో అర్హత సాధించారు. ప్రవేశ పరీక్షలో ఎం.నవదీప్ 97.43 పర్సంటైల్ సాధించగా, ఎం.జాహ్నవి 92.08, స్వాతి, శ్రీకాంత్, ఆకాష్ 91, సాయి, ప్రసన్నలు 90.46 శాతం సాధించి ప్రతిభ నిరూపించుకున్నారు. బీసీ గురుకుల పాఠశాలల్లో చదివిన మొత్తం 53 మంది విద్యార్థులు అర్హత సాధించడం విశేషం. రాష్ట్రంలోని బీసీ గురుకుల పాఠశాలల్లో మెరుగైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి 'కాలేజీ ఫర్ ఎక్సలెన్సీ'లో ప్రత్యేకంగా పోటీ పరీక్షల కోసం శిక్షణ అందిస్తున్నారు. 2024-25 సంవత్సరంలో 27 మంది బాలురు, 26 మంది బాలికలు అర్హత సాధించినట్టు బీసీ గురుకుల పాఠశాలల సంస్థ అధికారులు తెలిపారు. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి శ్రీధర్, కమిషనర్ బాలమాయ దేవి, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు.

చర్లపల్లి-కాకినాడ టౌన్, చర్లపల్లి-నర్సాపూర్‌ల మధ్య ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు వారాంతపు రోజుల్లో చర్లపల్లి-కాకినాడ, చర్లపల్లి-నర్సాపూర్‌ల మధ్య ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 14, 21వ తేదీల్లో చర్లపల్లి-కాకినాడ టౌన్(07031), 16, 23 తేదీల్లో కాకినాడ టౌన్-చర్లపల్లి(07032) ప్రత్యేక రైళ్లు నడుస్తాయని వివరించారు. ఈ ప్రత్యేక రైళ్లు వెళ్లి వచ్చేటప్పుడు నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు. అలాగే ఫిబ్రవరి 14, 21 తేదీల్లో చర్లపల్లి-నర్సాపూర్(07233), 16, 23తేదీల్లో నర్సాపూర్-చర్లపల్లి (07234) రైళ్లను నడుపుతున్నట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ రైళ్లు వచ్చి వెళ్లేటప్పుడు నల్లగొండ, మిర్యాలగూడెం, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగుతాయని రైల్వే అధికారులు తెలిపారు.

తపాల శాఖలో 21,413 ఉద్యోగాలు

» తెలంగాణలో 519, ఏపీలో 1,215 పోస్టులు

దేశవ్యాప్తంగా తలపాశాఖలో 21,413 గ్రామీణ డాక్ సేవక్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. వీటిలో తెలంగాణలో 519, ఆంధ్రప్రదేశ్‌లో 1,215 పోస్టుల ఉన్నాయి. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా నియామకాలు చేపడతారు. ఎంపికైన వారు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, డాక్ సేవక్ హోదాలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. పోస్టును బట్టి ప్రారంభ వేతనం పది నుంచి పన్నెండు వేల రూపాయలు ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు 2025 మార్చి 3 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థుల వయస్సు 18-40 సంవత్సరాల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల వారికి గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. పూర్తి వివరాల కోసం https://indiapostgdsonlineవెబ్‌సైట్.inసందర్శించవచ్చు.

ఐవోసీఎల్‌లో 457 అప్రెంటిస్ ఖాళీలు

ప్రభుత్వరంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ పైప్ లైన్స్ డివిజన్ పరిధిలో 457 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. టెక్నికల్, నాన్ టెక్నికల్ ట్రేడుల్లోని ఈ పోస్టులకు ఇంటర్, ఐటీఐ/డిప్లొమా, డిగ్రీ చేసిన వారు మార్చి 3వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయస్సు 2025 ఫిబ్రవరి 28 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్యలో ఉండాలి. పూర్తి వివరాలకు https://iocl.com వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

10/10 జీపీఏ సాధిస్తే విమాన ప్రయాణం చేయిస్తా

» విద్యార్థినులకు హామీపత్రం రాసిచ్చిన కలెక్టర్

» నల్లగొండ జిల్లా కనగల్ కేజీబీవీలో ఘటన



ఫ్లైట్ జర్నీ చేయిస్తానని విద్యార్థినికి హామీ పత్రం ఇస్తున్న కలెక్టర్

కనగల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధిస్తే విమాన ప్రయాణం చేయిస్తానని కేజీబీవీ విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ హామీ పత్రం రాసి ఇచ్చారు. బుధవారం రాత్రి నల్లగొండ జిల్లాలోని కనగల్ కేజీబీవీ పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారితో సెల్ఫీ తీసుకున్నారు. బాలికలు బాగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడాలన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం కావాలనుకునే వారు ఇప్పటినుంచే ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవాలని సూచించారు. అవసరమైన స్టడీమెటీరియల్‌ను త్వరలోనే పాఠశాలకు పంపిస్తానని తెలిపారు. ఇక పదో తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధిస్తే విజయవాడ, చెన్నై వంటి నగరాలకు విమాన ప్రయాణం చేయిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈమేరకు విద్యార్థినులకు హామీ పత్రం కూడా రాసిచ్చారు.

ఆమన్‌గల్‌లో బీఆర్ఎస్ ధర్నాకు అనుమతి

హైదరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఈ నెల 18న ఆమన్‌గల్‌లో చేపట్టిన ధర్నాకు హైకోర్టుకు అనుమతినిచ్చింది. 3,500 మందికి మించకుండా శాంతియుతంగా ధర్నా చేసుకోవచ్చని తెలిపింది. ధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ ఆమన్‌గల్ పట్టణ అధ్యక్షుడు పాత్యానాయక్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది.

2018 నాటి కేసు కొట్టేయాలని సునీత పిటిషన్

2018లో తమపై నమోదైన కేసుకు సంబంధించి నాంపల్లి ఎక్సైజ్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న ప్రొసీడింగ్స్‌ను కొట్టేయాలని కోరుతూ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఆమె అనుచరులు మరో తొమ్మిది మంది హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. మెదక్ జిల్లా ఎల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా నిరసన కార్యక్రమం చేపట్టారని వారిపై కేసు నమోదైంది. ఫిర్యాదుదారులను ఈ పిటిషన్‌లో ప్రతివాదిగా చేర్చాలని పిటిషనర్‌కు సూచించిన ధర్మాసనం విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది.

సీఎంఏలో మాస్టర్‌మైండ్స్ విద్యార్థికి మొదటి ర్యాంకు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించారని అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని మెయిన్ క్యాంపస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఏ ఫైనల్‌లో తమ విద్యార్థులు రిషబ్ ఓత్సాల్ మొదటి ర్యాంకు, ఎల్.వాగ్దేవి 2, ఎం.మోహన్‌కృష్ణ 5వ ర్యాంకులు సాధించారని తెలిపారు. 50లోపు 14మంది ర్యాంకులు సాధించారన్నారు. సీఎంఏ ఇంటర్‌లో జి.తనూషారెడ్డి 4వ ర్యాంకు, బి.ఉజ్జిన్నప్ప 10వ ర్యాంకు సాధించారని, 50లోపు మరో 16మంది ర్యాంకులు సాధించారన్నారు. విద్యార్థులను మాస్టర్‌మైండ్స్ డైరెక్టర్లు అభినందించారు.

మందుబాబులను పట్టిస్తే 10 వేల నజరానా

» బెల్టు దుకాణం నిర్వహిస్తే రూ.లక్ష, తాగితే 20వేల జరిమానా

» నల్లగొండ జిల్లా ఏపూరులో నిర్ణయం

చిట్యాల రూరల్, లింగంపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి గ్రామంలో తిరిగేవారిని గుర్తించి సమాచారమిస్తే రూ.10 వేల నజరానా ఇస్తామని మహిళా సంఘం నేతలు ప్రకటించారు. బుధవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూరులో మహిళలు, గ్రామస్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలో తక్షణమే బెల్టు దుకాణాలు మూసివేయాలని, సిగరెట్లు విక్రయించవద్దని డిమాండ్ చేశారు. ఈ నెల 5న ఏపూరు యువకుడు మద్యం తాగి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి 10న మృతి చెందాడు. ఈ ఘటన తమను ఎంతో కలిచివేసిందని మహిళలు తెలిపారు. ఈ నేపథ్యంలో మద్యం విక్రేతలకు రూ.లక్ష జరిమానా, మద్యం తాగిన వారికి రూ.20 వేల జరిమానా విధించనున్నట్లు గ్రామపంచాయతీ వద్ద గ్రామస్థులు నిర్ణయించారు. మద్యం తాగిన వారిని పట్టిస్తే రూ.10వేల బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గ్రామంలో బెల్టుషాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని, లేకుంటే పోలీస్ స్టేషన్‌ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.



నల్లగొండ జిల్లా ఏపూరు గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, గ్రామస్థులు

కామారెడ్డి జిల్లా సజ్జన్‌పల్లిలోనూ..

తమ గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా విధిస్తామని కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం సజ్జన్‌పల్లి గ్రామస్థులు బుధవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మద్యం విక్రయిస్తే తామే ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చి కేసులు నమోదు చేయిస్తామన్నారు.

ఊడిపడ్డ పెచ్చులు!

(మొదటిపేజీ తరువాయి)

మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి కారుపై పడడంతో కొంతమేర దెబ్బతింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. డిజైన్ కోసం అమర్చిన జీఆర్‌సీ ఫ్రేమ్‌లు ఊడిపడ్డాయి. అయితే పలు అవసరాల నిమిత్తం వివిధ కేబుళ్లు, లైటింగ్ పనులు నిర్వహిస్తుంటారని, అందుకు డ్రిల్లింగ్ కూడా చేస్తున్నారని.. ఆ కారణంగానే జీఆర్‌సీ ఫ్రేమ్ దెబ్బతిని ఊడిపడి ఉంటుందని నిర్మాణ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. అది నిర్మాణ లోపం కాదని, కింద పడిన పెచ్చులు కాంక్రీట్‌వి కాదని సదరు సంస్థ తెలిపింది. నిర్మాణం పూర్తయి రెండేళ్లవుతోందని, ఎలాంటి నాణ్యతా లోపం లేదని, ఘటనపై సమీక్ష చేస్తున్నట్లు సంస్థ ప్రకటించిందని సమాచారం. మరోవైపు సచివాలయం లోపలి భాగంలో నాలుగువైపులా అమర్చిన ఎత్తయిన పిల్లర్లకు అమర్చిన ఫ్రేమ్స్‌లోనూ చాలా పగుళ్లు కనిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి, సీఎస్ చాంబర్ల వైపు ఉన్న పిల్లర్లకు అమర్చిన ఫ్రేమ్స్‌లో కూడా పగుళ్లు ఏర్పడగా.. ఇప్పటికీ మరమ్మతులు చేయకపోవడం గమనార్హం. దాదాపు రూ.1,500 కోట్లతో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయం ఏదో ఒక విషయంలో వార్తల్లో నిలుస్తూనే ఉంది. ప్రారంభోత్సవానికి ముందే ప్రధాన ద్వారం బాహుబలి తలుపుల పక్కన సీలింగ్ లైట్‌లో నుంచి నీరు కారింది. ఆ తర్వాత కొద్ది రోజులకు కురిసిన వర్షం కారణంగా మీడియా సెంటర్ వద్ద నీళ్లు లీకయ్యాయి. తాజాగా ఐదో అంతస్తుపై ఏర్పాటు చేసిన జీఆర్‌సీ ఫ్రేమ్ ఊడిపడింది. నిత్యం సీఎం, మంత్రులు, ఉన్నతాధికారులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తిరిగే సచివాలయంలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతుండడంతో భవనం నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.





సచివాలయంలో పెచ్చులు ఊడి పడింది ఇక్కడి నుంచే; ఊడిపడిన పెచ్చులు

నాణ్యత పరీక్షలు చేశారా..?

వందల కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన సచివాలయానికి ఇప్పటివరకు నాణ్యతా పరీక్షలు నిర్వహించలేదని తెలుస్తోంది. నిర్మాణం జరుగుతున్న సమయంలోనే ఎప్పటికప్పుడు నాణ్యత పరీక్షలు చేపట్టాల్సి ఉన్నా అలాంటివేమీ జరగలేదని అధికార వర్గాల సమాచారం. నాణ్యతా పరీక్షలు చేయాలని నిర్మాణ సమయంలోనే అధికారులు సూచించినప్పటికీ పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. మరోవైపు ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచే రేవంత్‌రెడ్డి సచివాలయ నిర్మాణంపై అనుమానాలు వ్యక్తం చేశారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సచివాలయ నిర్మాణం, నాణ్యతా ప్రమాణాలపై సమగ్ర వివరాలను సమర్పించాలంటూ విజిలెన్స్ విభాగాన్ని ఆదేశించారు. ప్రస్తుతం విజిలెన్స్ అధికారులు విచారణ చేస్తున్నారు.

కారును పరిశీలించిన భట్టి, పొన్నం

రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్, రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి పలు పనుల నిమిత్తం బుధవారం సచివాలయానికి వచ్చారు. సాయంత్రం వారు తిరిగి వెళ్లేందుకు సిద్ధమవగా.. తిరుపతికి చెందిన కారును డ్రైవర్ దక్షిణంవైపు పోర్టికో ముందు నిలిపి ఉంచాడు. కొద్దిసేపటికే పైనుంచి ఒక పెచ్చు ఊడిపడింది. మళ్లీ కొద్దిసేపటికి మరో రెండు పెచ్చులు వరుసగా కారుపై పడ్డాయి. దీంతో పైభాగంలో కొంత మేర దెబ్బతింది. అనంతరం ఎమ్మెల్యే, తిరుపతి డిప్యూటీ సీఎం భట్టిని కలిసేందుకు ప్రజాభవన్‌కు వెళ్లగా.. విషయం తెలుసుకున్న భట్టి, అక్కడే ఉన్న పొన్నం బయటకువచ్చి కారును పరిశీలించారు.

మా అదృష్టం బాగుంది..

ఐదో అంతస్తు నుంచి పెచ్చులు ఊడి మా కారుపై పడ్డాయి. ఆ సమయంలో మా అబ్బాయి కూడా కారు దగ్గరే ఉన్నాడు. మొదటి పెచ్చు ఊడిపడగానే పక్కకు వెళ్లారు. లేదంటే పెద్ద ప్రమాదమే జరిగేది. కారు పైభాగమే వంగిపోయిందంటే.. అదే మనుషులపై పడితే పరిస్థితి ఏంటి? ఆ సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నాం. ఈ రోజు మా అదృష్టం బాగుంది.

- గడ్డం తిరుపతి, రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

కుటుంబ సర్వే సమాచారాన్ని ప్రభుత్వం దాస్తోంది

3.1% కుటుంబాల సర్వే పూర్తి చేయాలి

తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మేధోమథన సదస్సులో పలువురి అభిప్రాయం

బంజారాహిల్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వే సమాచారాన్ని ప్రభుత్వం దాస్తోందని, మహిళలు, పురుషులు, మతం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ కేటగిరీల జనాభా వివరాలను మాత్రమే ప్రకటించి మిగతా వివరాలను వెల్లడించడంలో విఫలమైందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. పీపుల్స్ కమిటీ ఆఫ్ క్యాస్ట్ సెన్సెస్, ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్, తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సంయుక్తాధ్వర్యంలో బుధవారం బంజారాహిల్స్‌లో 'తెలంగాణ ప్రభుత్వ కులగణన సర్వే-రిజర్వేషన్లు, పుర్వాపరాలు-సమస్యలు-ఆందోళనకర అంశాలు-పరిష్కార మార్గాలు' పై మేధోమథన సదస్సు జరిగింది. ఇందులో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు, జాజుల శ్రీనివాస్‌గౌడ్, ప్రొఫెసర్ కె మురళీ మనోహర్, జస్టిస్ ఈశ్వరయ్య, ప్రొఫెసర్ తిరుమలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం సర్వే పూర్తి సారాంశం వెల్లడించకపోవడం వల్ల కులాల వెనుకబాటుతనం సమాజానికి తెలిసే అవకాశంలేకుండా పోతుందని తెలిపారు. 11 లక్షల మంది అధికారికంగానే సర్వే పరిధిలోకి రాలేదని, అయినా ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చి ప్రకటించిన లెక్కలు గత సర్వేలు, అధ్యయనాల గణాంకాలతో పోల్చితే తప్పులు దొర్లినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. 3.1శాతం మందిని సర్వే చేయకపోవడం, ఎన్యూమరేటర్లు క్షేత్ర స్థాయిలో చేసిన తప్పులతో జనాభా లెక్కల్లో తేడాలు వస్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం సర్వే చేయని 3.1 శాతం కుటుంబాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సత్వరమే సర్వే పూర్తి చేయాలని సూచించారు. తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిపుణుల కమిటీ ద్వారా సర్వే ఆడిట్ చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

హరీశ్‌రావు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు

» నిఘా పెట్టిన వారి జాబితాలో చక్రధర్ పేరు ఉంది: రాష్ట్ర ప్రభుత్వం

» ఫోన్ ట్యాపింగ్ కేసు కక్ష సాధింపులో భాగమే: హరీశ్ రావు

» ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్, రాధాకిషన్ క్వాష్ పిటిషన్లపై విచారణ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు అధికారంలో ఉన్నప్పుడు తన సొంత అవసరాల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఇష్టానుసారం వాడుకున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపించింది. కాంగ్రెస్ నేత, రియల్‌ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పంజాగుట్ట పోలీసులు తనపై పెట్టిన కేసు కొట్టేయాలని కోరుతూ హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీంతోపాటు ఇదే కేసులో రెండో నిందితుడిగా ఉన్న మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం బుధవారం విచారించింది. ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. 'హరీశ్‌రావుపై పెట్టిన సెక్షన్లకు ముడిసరుకు స్పష్టంగా కనిపిస్తోంది. హరీశ్‌రావు తనకు అడ్డువచ్చిన వారిపై నిఘా పెట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని వాడుకున్నారు. చక్రధర్‌గౌడ్ ఫోన్‌ట్యాపింగ్ అయినట్లు ఆధారాలు ఉన్నాయి. చక్రధర్‌గౌడ్‌ను చాప్టర్ క్లోజ్ చేస్తామని రాధాకిషన్‌రావుతో బెదిరించారు. కేసు పెట్టడంలో తీవ్ర అలస్యం అయింది అంటున్నారు.. కానీ, హరీశ్‌రావు అధికారంలో ఉండగా పోలీసులు కేసు ఎలా పెడతారు ? మీ ఫోన్‌పై ప్రభుత్వ నిఘా ఉంది అని యాపిల్ సంస్థ నుంచి చక్రధర్‌గౌడ్‌కు నోటిఫికేషన్ కూడా వచ్చింది' అని పేర్కొన్నారు.

ఇక, హరీశ్‌రావు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దామ శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ.. 'ఈ కేసు పాలకవర్గం కక్ష సాధింపులో భాగం. ఎఫ్ఐఆర్‌లో పెట్టిన ఒక్క సెక్షన్‌కూ కావాల్సిన ముడిసరుకు లేదు. కేసు పెట్టడంలో 16 నెలల తీవ్ర ఆలస్యం జరిగింది. 2006 నుంచి క్రిమినల్ కేసులు ఉన్న ఒక వ్యక్తికి ప్రభుత్వం తన అఫిడవిట్‌లో క్లీన్‌చిట్ ఎలా ఇచ్చింది?. కక్షసాధింపు కోసం ప్రభుత్వం ఎంతదూరమైనా వెళ్తుందనడానికి ఈ కేసు ఉదాహరణ. చక్రధర్‌గౌడ్ తన స్నేహితుడి భార్యపై లైంగికదాడి చేసినట్లు సీఆర్పీసీ 164 స్టేట్‌మెంట్ ఉంది. ఇన్ని కేసులు ఉండగా పోలీసులు క్లీన్‌చిట్ ఎలా ఇస్తారు? రూ.2.5 కోట్లు ఫార్మర్ ఫస్ట్ ఫౌండేషన్ పేరుతో పంచిపెట్టాడు. కానీ అతడు చూపిన ఆదాయం ఏటా రూ.15 లక్షలకు లోపే ఉంది' అని పేర్కొన్నారు. సిద్ధార్థ లూథ్రా వాదనలు పూర్తికాకపోవడంతోపాటు రాధాకిషన్‌రావు క్వాష్ పిటిషన్‌లో కౌంటర్ కోసం ఈ పిటిషన్లను ఈనెల 19కి వాయిదా వేస్తున్నామని ధర్మాసనం పేర్కొంది.

'అగమ్య'ప్రయాణం!

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రవాణా శాఖ సీజనల్ తనిఖీల వల్లే ప్రైవేటు ట్రావెల్స్ ఆపరేటర్లు ఇష్టానికి వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంక్రాంతి, దసరా వంటి పండుగలు, పలు ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే అధికారులు జోరుగా తనిఖీలు నిర్వహిస్తుంటారు. అనంతరం షరా 'మామూలే'.. దీనిని అవకాశంగా మార్చుకుంటున్న ప్రైవేటు ట్రావెల్ సంస్థలు పర్మిట్ లేకుండానే యథేచ్ఛగా బస్సులు తిప్పుతున్నాయి. దీంతో రవాణా శాఖ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది. అయినా అధికారులు పట్టించుకోరు. కారణం.. వారి 'లెక్కలు' వారికుండడమే.. ఉన్నత స్థాయి ఫిర్యాదుల నేపథ్యంలో ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం తాజాగా తనిఖీలు మొదలుపెట్టింది.. విజయవాడ, బెంగళూరు, నాగ్‌పూర్ మార్గాల్లో అనుమతి లేని 13 బస్సులను సీజ్ చేసింది.

15-20 కిలోమీటర్ల దూరంలోనే..

హైదరాబాద్ నుంచి ఏపీలోని పలు జిల్లాలు, బెంగళూరు, నాగ్‌పూర్, ముంబై, షిర్డీ తదితర ప్రాంతాలకు నిత్యం 400 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. వారాంతాల్లో వీటి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. నిబంధనల ప్రకారం రవాణా శాఖ పర్మిట్ ఉన్న బస్సుల్లోనే ప్రయాణికులను తీసుకెళ్లాలి. కానీ కొన్ని సంస్థలు అనుమతి లేని బస్సుల్లో తరలిస్తున్నాయి. తాజాగా తనిఖీల నేపథ్యంలో హైదరాబాద్‌కు 15-20 కిలోమీటర్ల దూరంలోనే బస్సు ఆపరేటర్లు ప్రయాణికులను వదిలేస్తున్నారు. తెల్లవారుజామున 4-5 గంటల ప్రాంతంలో హైదరాబాద్ ఆవల నడిరోడ్డుపై దింపుతున్నారు. ఆ సమయంలో వాహనాలు అందుబాటులో లేక గమ్యస్థానాలకు చేరేందుకు పిల్లలు, లగేజీతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. హయత్‌నగర్, వనస్థలిపురం వద్ద దిగిన ప్రయాణికులు కూకట్‌పల్లికి చేరుకోవాలంటే 40 కి.మీ.ల మేర ప్రయాణించాలి. చందానగర్, బీహెచ్ఈఎల్ వెళ్లే వారు 50-60 కి.మీలు వెళ్లాల్సిందే.. 'తెల్లవారుజామున వాహనాలు అందుబాటు లో లేక హయత్‌నగర్ నుంచి చందానగర్‌కు కుటుంబంతో వచ్చేందుకు రెండున్నర గంటలు పట్టింది. అదనంగా రూ.1,200 చెల్లించాల్సి వచ్చింది' అని ఇటీవల ఇబ్బందులు పడ్డ చందానగర్‌కు చెందిన ఓ ప్రయాణికుడు వాపోయారు.

అప్పుడప్పుడు హడావుడి..

నిబంధనల ప్రకారం బస్సులు నడుపుతున్నారా..? లేదా..? అన్నది గుర్తించేందుకు రవాణా శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలి. కానీ అప్పుడప్పుడు వారం, పది రోజులు హడావుడి చేసి మిన్నకుంటారు. దీంతో ఆ పది రోజులు వారికి చిక్కకుండా ఉంటే చాలు.. రూ.లక్షలు వెచ్చించి పర్మిట్ తీసుకోవడం ఎందుకన్న యోచనలో మెజార్టీ ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలున్నాయి. సంక్రాంతి సమయంలోనూ విస్తృతంగా అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించడం లేదంటూ 400 కేసులు నమోదు చేశారు. సీజన్ ముగిసిందని భావించిన నిర్వాహకులు పర్మిట్ లేని బస్సులను తిప్పడం ప్రారంభించారు. కొన్ని సంస్థలు పర్మిట్ ఉన్న బస్సు నంబర్‌ను రెండు, మూడు వాహనాలకు వినియోగిస్తున్నాయన్న ఆరోపణలూ ఉన్నాయి. గతంలో ఔటర్ ఆవలికే ట్రావెల్స్ బస్సులు పరిమితం కావాలని ఆదేశాలిచ్చారు. అయినా పలు కారణాలతో పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. నిబంధనల మేరకు రాత్రి 10 గంటల తర్వాత, ఉదయం 8 గంటల్లోపు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్ రోడ్లపై రాకపోకలు సాగించాలి. కొంతకాలంగా తనిఖీలు లేకపోవడంతో ఎప్పుడు పడితే అప్పుడు బస్సులను రోడ్ల మీదకు తెస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు సతమతమవుతున్నారు.



- ఆంధ్రజ్యోతి-హైదరాబాద్ సిటీ

గుదిబండగా టీ-ఫైబర్!

» పదేళ్లుగా సాగుతున్న పనులు

» పూర్తిచేయాలంటే 3 వేల కోట్లు కావాలి

» అధ్యయనానికి ప్రపంచ బ్యాంకు బృందం

» మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ


హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి తక్కువ ధరకు నాణ్యమైన ఇంటర్‌నెట్ సౌకర్యం అందించాలన్న లక్ష్యంగా గత ప్రభుత్వం ప్రారంభించిన టీ-ఫైబర్ పథకం.. సర్కారుకు గుదిబండగా మారింది. 2015 మార్చిలో ఈ పథకాన్ని ప్రారంభించిన గత సీఎం కేసీఆర్ మూడేళ్లలో పూర్తిచేస్తామని గొప్పగా ప్రకటించారు. పదేళ్లయినా ఈ పథకం ఇంకా మూడో వంతు కూడా పూర్తి కాలేదు. జాప్యం చేస్తున్నకొద్దీ వ్యయం పెరుగుతోందని.. వెంటనే నిధులు కేటాయించాలని అధికారులు పదేపదే పేర్కొన్నా.. గత ప్రభుత్వం స్పందించలేదు. ఇప్పుడు ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలంటే కనీసం రూ.3 వేల కోట్లు కావాలి. రూ.1,779 కోట్లు వడ్డీ రహిత రుణం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని పలుమార్లు కోరినా.. స్పందన లేదు. దీంతో ఈ ప్రాజెక్టు కోసం ఆర్థిక సహకారం అందించాలంటూ గత ఏడాది సీఎం రేవంత్ రెడ్డి ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిని కూడా కోరిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం బుధవారం రాష్ట్రానికి వచ్చింది. ఈ ప్రాజెక్టును అధ్యయనం చేస్తోంది.

రూ.వందల కోట్లు గుంతలపాలు..

రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి, ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ పథకం ద్వారా హైస్పీడ్ ఇంటర్‌నెట్ అందించాలని గత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇంటర్‌నెట్‌తో అనుసంధానం చేస్తున్న తొలి రాష్ట్రం తెలంగాణ అంటూ గత ప్రభుత్వంలో ఐటీ మంత్రిగా చేసిన కేటీఆర్ గొప్పగా చెప్పేవారు. మిషన్ భగీరథ కోసం తవ్విన గుంతల్లో టీ-ఫైబర్ పైపులు వేసి ఎంతో ప్రజాధనాన్ని మిగిల్చామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. ప్రాజెక్టు జాప్యం చేసి అంతకంటే ఎక్కువ ప్రజాధనాన్ని గుంతలపాలు చేసింది.

4 గ్రామాల్లో అధ్యయనం..

టీ-ఫైబర్ పైలట్ ప్రాజెక్టు కింద 4 జిల్లాల్లోని 4 గ్రామాల్లో పనులు మూడేళ్ల క్రితమే పూర్తయ్యాయి. ఇందులో హాజీపల్లి(రంగారెడ్డి జిల్లా), మద్దూర్ (నారాయణ్ పేట), సంగుపేట (సంగారెడ్డి), అడవి శ్రీరాంపూర్(పెద్దపల్లి) గ్రామాలున్నాయి. ఈ నాలుగు గ్రామాలను ప్రపంచ బ్యాంకు బృందం తాజాగా సందర్శించింది. గ్రామాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ వల్ల కలిగిన ప్రయోజనాలను తెలుసుకుంది. అనంతరం సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో సమావేశమైంది. రాష్ట్రంలోని 93లక్షల గృహాలను డిజిటల్ కనెక్టివిటీ పరిధిలోకి తేనున్నట్టు మంత్రి వెల్లడించారు. మరో మూడేళ్లలో అన్ని గ్రామాలకు కనెక్టివిటీ విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 32వేల కి.మీ. పొడవున ఫైబర్ ఆప్టిక్ కేబుల్‌ను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రాజెక్టు పరిశీలన అనంతరం ప్రపంచ బ్యాంకు త్వరలో తన అభిప్రాయం తెలియజేయనుంది. ప్రపంచ బ్యాంకు సాయం అందిస్తే సరి.. లేకుంటే ఈ ప్రాజెక్టు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది.



టీ-ఫైబర్ కోసం తవ్విన గుంతలు (2018 నాటి చిత్రం)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.